# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 23 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 168 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


ప్రపంచంలోనే అతి చిన్న పెన్ను



2

చిరుతతో పోరాడి.. కూతురి ప్రాణాల్ని కాపాడి..



2

## రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో...

# సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- మెట్రో విస్తరణ, ఐఆర్ఎఫ్‌సి
- నిధుల విడుదలపై చర్చ
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి వైష్ణవ్
- రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరే దిశలో సమావేశం
- మీడియాకు వెల్లడించిన సీఎం రేవంత్‌రెడ్డి
- రేపు ఖట్టర్‌తో భేటీ



**హైదరాబాద్, జూన్ 22 (మనం బ్యూరో) :** సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా సీఎం సోమవారం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో రైల్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం పాల్గొన్నారు. అశ్విని వైష్ణవ్‌తో భేటీ సందర్భంగా సీఎం హైదరాబాద్ మెట్రో రేల్ ఫేజ్-2 అనుమతులపై చర్చించారు. మెట్రో రేల్‌కు ఐఆర్ఎఫ్‌సి మంజూరు చేసిన నిధుల విడుదల జాప్యం కావడానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కారణమని సీఎం ఆరోపించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా సీఎం అశ్విని వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయించాలని కిషన్ రెడ్డికి రెండు మార్లు బహిరంగ లేఖ సైతం రాసారు. ఈ నేపథ్యంలో తాజాగా, కేంద్ర మంత్రితో సీఎం రేవంత్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

# సాదాబైనామాలో వేగం పెంచాలి

- ఏడాది కాలంలో 3.65 లక్షల పాసుబుక్‌ల జారీ
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్,జూన్22(మనం న్యూస్):** రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందని మంత్రి వెల్లడించారు.సోమవారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన నాటినుండి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాసు పుస్తకాలు జారీ ...మిగతా 2లో



## దేశానికి 'సంఘ్' ముప్పు

- మోడీ సర్కార్ పతనం తప్పదు
- ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

**బెంగళూరు, జూన్ 22: :** దేశాన్ని ఆర్ఎస్ఎస్‌తోపాటు పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాశనం చేస్తున్నారని ఏఐసీసీ



అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విరుచుకుపడ్డారు. బెంగళూరు ప్యాలెస్ మైదానంలో నిర్వహించిన కాంగ్రెస్ సంకల్ప సమావేశంలో ఆయన ప్రసంగించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే దేశానికి భవిష్యత్తు ఉండదని తేల్చిచెప్పారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ.. చివరికి మౌనం వహించారని ధ్వజమెత్తారు. బీజేపీ పాలనలో ధరలు పెరిగిపోయాయని, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. ఏదో ఒకరోజు మోడీ సర్కారు పతనమవుతుందని హెచ్చరించారు. రామమందిరం నిర్మాణంలో చోటుచేసుకున్న రూ.5వేల కోట్ల అక్రమాలపై సిట్ దర్యాప్తునకు ఆదేశించాలని డిమాండు చేశారు. నీట్ బదులు కర్ణాటక తరహాలో ఉమ్మడి ప్రవేశపరీక్ష (సీఈటీ) వ్యవస్థ అమలులోకి తేవాలని ఖర్గే పేర్కొన్నారు.


అమెరికాకు షాకిచ్చిన చైనా.. కీలక కంపెనీలపై ఆంక్షలు 9


## ఆదిలాబాద్‌ఎయిర్‌పోర్టును
# అభివృద్ధి చేయండి

- కార్గో,ఎంఆర్‌వో,హ్యాంగర్ ఏర్పాటుకు అనుకూలం
- భూసేకరణ, యుటిలిటీస్ బదలాయింపులో పూర్తిగా సహకరిస్తాం
- రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ
- గాంధీ సరోవర్ ప్రాజెక్టులు భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు


**హైదరాబాద్, జూన్ 22, (మనం బ్యూరో) :** భారత వాయుసేన ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును అన్ని వసతులతో అభివృద్ధి



చేయాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని రక్షణ శాఖ కార్యాలయం కర్తవ్య భవన్‌లో సోమవారం కేంద్ర మంత్రితో సీఎం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టులు భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి సంబంధించి భూసేకరణ, యుటిలిటీస్ బదలాయింపు అంశాల్లో పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో భారతీయ వాయు సేన ఆధ్వర్యంలో రానున్న ఎయిర్‌పోర్ట్ దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందున దానిని భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అన్ని విధాలా సహకరిస్తామని స్పష్టం చేశారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటు కార్గో, ఎంఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేందుకు సహకరించాలని కేంద్ర మంత్రిని కోరారు. తమ కీలకమైన ప్రాజెక్టుకు డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్ మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీప ప్రదేశాన్ని ఎంపిక చేసుకున్నందుకు ఆ ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## కోచింగ్ సెంటర్లో ఘోర అగ్నిప్రమాదం..
# 15 మంది మృతి

- ప్రధాని నరేంద్ర మోడీ
- సీఎం ఆదిత్యనాథ్
- కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే
- రాహుల్ గాంధీ సంతాపం





**లఖ్‌నవూ, జూన్ 22:** ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలోని ఓ కోచింగ్ సెంటర్‌లోభారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మృతుల సంఖ్య 15కు చేరింది. మరికొందరు గాయాలతో చికిత్సపొందుతున్నారు. ఈ ఘటనలో కొందరు తమ ప్రాణాలను కాపాడుకొనేందుకు భవనం పైఅంతుస్తుల నుంచి కిందికి దూకారు. ఈ ప్రమాద దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. లఖ్‌నవూలోని అలీగంజ్ ప్రాంతంలోని మూడంతస్తుల భవనం పైభాగంలో తొలుత మంటలు చెలరేగాయి. తర్వాత పైఅంతస్తులో ఉన్న కోచింగ్ సెంటర్కు ఎగబాకాయి. భవనమంతా మంటల్లో చిక్కుకుపోవడంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. మృతుల్లో పలువురు విద్యార్థులతో పాటు మరికొందరు ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

మంటల్లో చిక్కుకున్న పలువురు తమ ప్రాణాలు కాపాడుకోవడానికి పైనుంచి దూకిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఒక వ్యక్తి పగిలిన కిటికీ నుంచి బయటకు వచ్చే క్రమంలో కిందికి పడిపోయాడు. అది గమనించి స్థానికులు వెంటనే అతడిని కాపాడారు. గాయపడిన అతడిని ఆసుపత్రికి తరలించారు. కొందరు అక్కడి తీగలను పట్టుకొని వేలాడుతూ బయటపడే ప్రయత్నం చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన 30 నిమిషాల తర్వాత ఫైర్ ఇంజిన్లు వచ్చాయని స్థానికులు ఆరోపించారు. అందువల్లే, మంటలు మరింత భారీగా వ్యాపించాయని చెబుతున్నారు.

'లఖ్‌నవూలో అగ్నిప్రమాద మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నా. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల.. క్షతగాత్రులకు రూ.50,000 చొప్పున నష్టపరిహారం అందిస్తాం'

**-ప్రధాని నరేంద్ర మోడీ**

'లఖ్‌నవూ ప్రమాదం దిగ్భ్రాంతికి గురి చేసింది. ఘటనా స్థలాన్ని ...మిగతా 2లో

# వేగంగా ఆర్డీఎస్ ఆధునీకరణ

- తుంగభద్ర జలాలపై హక్కులను కాపాడుతాం
- రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యం
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్

**హైదరాబాద్, జూన్ 22(మనం న్యూస్) :** రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆధునీకరణ పనులను ఇకపై ఆలస్యం చేయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఆర్డీఎస్ వ్యవస్థను బలోపేతం చేయడం, ...మిగతా 2లో



# మత్తును చిత్తు చేద్దాం...రండీ



- యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
- యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో డీజీపీ

**హైదరాబాద్, జూన్ 22(మనం,ప్రత్యేక ప్రతినిధి):** రాష్ట్రంలో డ్రగ్స్ కట్టడికి ప్రతీ ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలని రాష్ట్ర డీజీపీ సీవీ.ఆనంద్ పిలుపునిచ్చారు. నగరంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో సోమవారం నిర్వహించిన యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ కార్యక్రమాన్ని డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ యాంటీ డ్రగ్ అవేర్నెస్ వీక్ యువత కోసమే నిర్వహిస్తున్న కార్యక్రమమని చెప్పారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం దేశ బంగారు భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తుందన్నారు. ఈక్రమంలో నెల 22 నుంచి 26 వరకు పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, వివిధ ప్రభుత్వ శాఖలు, సామాజిక సంస్థల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ...మిగతా 2లో





## బ్రిటన్ ప్రధాని
# కీర్ స్టార్మర్ రాజీనామా

**లండన్, జూన్ 22:** బ్రిటన్‌లో మరోసారి రాజకీయ అస్థిరత నెలకొంది. ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ తన పదవికి రాజీనామా చేశారు. లేబర్ పార్టీ ఒత్తిడి వల్లే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. పదవిలో ఉన్నంత కాలం విలువలకు కట్టుబడి పని చేసినట్లు తెలిపారు. తాజా పరిణామంతో బ్రిటన్‌లో దశాబ్ద కాలంలో తమ పదవులకు రాజీనామా చేసిన ప్రధానుల సంఖ్య ఆరుకి చేరింది.

కీర్ స్టార్మర్ 2024లో బ్రిటన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎన్నికల్లో లేబర్ పార్టీ పేలవమైన ప్రదర్శన మాత్రమే ఇవ్వడం, మేకర్‌ఫీల్డ్ పార్లమెంటరీ ఉపఎన్నికలో బర్న్‌హామ్ ఘన విజయం సాధించడంతో స్టార్మర్ నాయకత్వంపై ప్రశ్నలు వస్తున్నాయి. ఎప్‌స్టీన్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తన స్నేహితుడు పీటర్ మాండెల్సన్‌ను అమెరికాలో యూకే రాయబారిగా నియమించాలనే స్టార్మర్ నిర్ణయంపైనా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను ప్రధాని పదవి నుంచి వైదొలగాలని సహచర మంత్రులతోపాటు సొంత పార్టీ ఎంపీల నుంచి ఆయనపై ఒత్తిడి పెరిగింది.



అయినప్పటికీ తాను పదవి నుంచి వైదొలిగే ప్రసక్తే లేదని వాదిస్తూ వచ్చిన స్టార్మర్.. తాజాగా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం.

మరోవైపు, బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్ రాజీనామా చేస్తారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. వలసలు, ఇంధన విధానాల్లో వైఫల్యాలే అందుకు కారణమని తన పోస్టులో ఆయన పేర్కొన్నారు. దశాబ్ద ...మిగతా 2లో

## హర్మూజ్
# మీ క్యాసినో కాదు

### ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ నేత పోస్ట్

**టెహ్రాన్, జూన్ 22:** ఇజ్రాయెల్‌పై దాడులు చేయకుండా లెబనాన్‌లోని హెజ్బొల్లాను నిలువరించాలని, లేకపోతే ఇరాన్‌పై భీకరదాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. దీనిపై ఇరాన్ పార్లమెంట్‌లోని నేషనల్ సెక్యూరిటీ కమిటీ ఛైర్మన్ ఇబ్రహీం అజీజి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''మీరు బెదిరిస్తారు. మేం చర్యలు తీసుకుంటాం. హర్మూజ్ జలసంధి మీ క్యాసినో కాదు. అలాగే, సముద్ర దొంగలుండే పెరడు కాదు. ఆ జలసంధిపై తీసుకునే నిర్ణయం ఏదైనా ఇరాన్ ప్రజలు, బలగాల చేతిలోనే ఉంది'' అని ఇబ్రహీం 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు.

ఒప్పందంలోని నిబంధనలను, అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులతో విరుచుకుపడటంతో మళ్లీ హర్మూజ్‌ను మూసివేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. 60రోజుల్లో ఇరాన్‌తో తుది ఒప్పందం కుదరకపోతే ...మిగతా 2లో

## మాస్కోపై డ్రోన్ల వర్షం..
# విమానాశ్రయాలు మూత

**మాస్కో, జూన్ 22:** రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన ...మిగతా 2లో






# చిరుతతో పోరాడి.. కూతురి ప్రాణాల్ని కాపాడి..

**ముంబయి, జూన్ 22:** తన కుమార్తె ప్రాణాలు కాపాడేందుకు ఓ తండ్రి ఏకంగా చిరుతతోనే పోరాడాడు. అసాధారణ ధైర్యంతో క్రూరమృగం నుంచి చిన్నారిని కాపాడాడు. కూతురి కోసం తండ్రి చేసిన ఈ పోరాటాన్ని స్థానికులు ప్రశంసిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి మహారాష్ట్రలోని గుంజలే బస్తీలోకి ఓ చిరుత చొరబడింది. అదే సమయంలో దీపాలి అనే మహిళ తన నాలుగేళ్ల కుమార్తెతో కలిసి పొలం నుంచి ఇంటికి వెళ్తున్నారు. పక్కనే ఉన్న పొదల్లో మాటువేసిన చిరుత ఒక్కసారిగా వారిపై దాడి చేసి, చిన్నారిని పొలాల్లోకి లాక్కెళ్లింది. దీంతో సాయం కోసం ఆ మహిళ కేకలు వేయడంతో అక్కడే ఉన్న చిన్నారి తండ్రి మనోజ్ గుంజలే (32) చిరుత వెళ్లిన వైపు పరుగు తీశాడు. ప్రాణాలకు తెగించి రాళ్లు, కర్రలతో చిరుతపై దాడి చేసి.. తన కూతురిని కాపాడాడు. అక్కడి నుంచి పరుగున వస్తుండగా పొలంలో ఉన్న బావిలో పడిపోయాడు. అప్పుడు కూడా తన కుమార్తెకు ఎలాంటి గాయాలు కాకుండా కాపాడాడు. బావిలో నుంచి వారిని సురక్షితంగా బయటకు తీసిన స్థానికులు మనోజ్‌ను అతడి కుమార్తెను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

## ప్రపంచంలోనే అతి చిన్న పెన్ను

**నలందా, జూన్ 22:** ప్రపంచంలోనే అతి చిన్న పెన్నును కలిగి ఉన్న బీహార్‌లోని నలంద జిల్లా బిహార్ షరీఫ్‌కు చెందిన జగదీప్ నారాయణ్ కుమార్ వరల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ ఇత్తడి కలం పొడవు కేవలం 3 అంగుళాలే. దీనిని సుమారు 34 ఏళ్ల క్రితం కేవలం 20 రూపాయలకు కొనుగోలు చేశానని చెప్పారు. తన సేకరణలో 3 రూపాయలకు కొన్న మరో చిన్న పెన్ను కూడా ఉందన్నారు.

# కోచింగ్ సెంటర్లో ఘోర అగ్నిప్రమాదం..

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే సందర్శించి.. నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించా. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు వీలుగా అలీగఢ్‌లో పర్యటనను కుదించుకుని వెంటనే లఖ్‌నవూకు బయలుదేరుతున్నాను'

**-యూపీ సీఎం యోగి**

'లఖ్‌నవూ ప్రమాద ఘటన కలచివేసింది. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా. వీలైనంత త్వరగా మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా'

**-కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే**

'లఖ్‌నవూ ప్రమాదంలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నా. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా'

**-రాహుల్ గాంధీ**

# మాస్కోపై డ్రోన్ల వర్షం.. విమానాశ్రయాలు మూత

(మొదటి పేజీ తరువాయి)

సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు.

విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్లతో విరుచుకుపడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

# వేగంగా ఆర్డీఎస్ ఆధునీకరణ

(మొదటి పేజీ తరువాయి)

తుంగభద్ర జలాలపై తెలంగాణ హక్కులను పరిరక్షించడం, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం రెండో దశ పనులను వేగంగా అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆర్డీఎస్, తుంగభద్ర ఆనకట్ట నిర్వహణ, అంతర్రాష్ట్ర జల పంపిణీ, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం పురోగతి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ఇంజినీర్లు, జలవనరుల నిపుణులు, ఉన్నతాధికారులు, ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్డీఎస్ ఆధునీకరణ పనులపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న బలోపేత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, కాలువ గట్టులను పటిష్టం చేయాలని, నీటి నష్టాలను తగ్గిస్తూ కాలువల సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపట్టాలని సూచించారు.

# సీఎం రేవంత్ రెడ్డి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దాదాపు రెండు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో తెలంగాణకు సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టులు, నిధుల కేటాయింపులతో పాటు ప్రధానంగా ఐఆర్ఎఫ్సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) లోన్ అంశంపై ఇరుపక్షాల మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఐఆర్ఎఫ్సీ నుంచి రావాల్సిన రూ. 13,600 కోట్ల విడుదలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌తో జరిగిన ఈ చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో జరిగాయని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి సానుకూల స్పందన వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.

**రేపు కేంద్రమంత్రి ఖట్టర్‌తో భేటీ..**
**మెట్రో ఫేజ్-2పై ఫోకస్**

ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రేపు (మంగళవారం) మరో కీలక భేటీలో పాల్గొననున్నారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ఆయన సమావేశం కానున్నారు. ఈ భేటీలో హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-2 ప్రాజెక్టు విస్తరణ, కేంద్ర ప్రభుత్వ వాటా, నిధుల మంజూరుపై ప్రధానంగా చర్చించనున్నారు. రేపు కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో జరిగే ఈ అత్యంత ప్రాధాన్యత కలిగిన సమావేశానికి కూడా కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి



హాజరుకానున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రూ. 13,600 కోట్ల విడుదలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌తో జరిగిన ఈ చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో జరిగాయని, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి సానుకూల స్పందన వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.

# సాదాబైనామాలో వేగం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)




చేసినట్లు మంత్రి వెల్లడించారు. గతంలో పాసుబుక్కుల కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని ఆయర పేర్కొన్నారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని అధికారులను అదేశించారు. భూభారతి చట్టంలో పేర్కొన్న విధంగా వ్యవసాయ భూముల క్రయవిక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ జతచేసే నిబంధనను ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న ఐదు మండలాల్లో పరిస్థితులను మంత్రి ఈ సందర్భంగా సమీక్షించారు. ఈ విధానం విజయవంతంగా కొనసాగుతోందని అధికారులు వివరించగా, అక్కడి అనుభవాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే రెండో దశలో ప్రతి జిల్లాకు ఒక మండలంలో అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో మరింత వేగం పెంచాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మొత్తం 9.25 లక్షల సాదాబైనామా దరఖాస్తులలో, ఇప్పటివరకు ఆరు లక్షల దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలిన దరఖాస్తులకు వచ్చే 15 రోజుల్లో నోటీసులు జారీ పూర్తి చేయాలని, ఆ తర్వాత 30 రోజుల గడువు ముగిసిన వెంటనే అర్హులైన దరఖాస్తులను పరిష్కారించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని వెల్లడించారు.

# మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారం

- ఆర్టీజీఎస్ పై సమీక్షలో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

**(అమరావతి మనం ప్రత్యేక ప్రతినిధి) :** పీజీఆర్ఎస్ సహా ప్రజల నుంచి వచ్చే అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పని తీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...ఉద్యోగులు వినూత్నంగా ఆలోచనలు చేసేలా ప్రోత్సహిస్తాం. పనితీరు ఆధారంగా బాధ్యతలు అప్పగిస్తాం. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదుల పరిష్కారంపై దృష్టి సారించాలి. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలి. దీని ద్వారా పాలనపై ప్రజల్లో మంచి భావన కలుగుతుంది. మానవ వనరులను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు ఉద్యోగులు పాలనా పరంగా సామర్థ్యాలను పెంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పని విధానం మార్చుకోవాలి. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తేనే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోగలుగుతాం. మంత్రులు, అధికారులు, ఉద్యోగులు క్షేత్ర స్థాయి పర్యటనలకు ప్రాధాన్యమివ్వాలి. ఏపీకి బలమైన మానవ వనరుల వ్యవస్థ అవసరం. పాలనలో సంస్కరణలపై ఉద్యోగులకు, అధికారులకు శిక్షణ ఇప్పించాం. పాత రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ అనేది అతి పెద్ద టాస్క్ గా ఉండేది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక సులభంగా వాటిని క్లియర్ చేయగలిగే పరిస్థితి ఉంది. వినూత్నంగా ఆలోచన చేయకపోతే వ్యవస్థలు నిర్వీర్యం అవుతాయి.అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

పాత కేసుల ట్రేసింగ్

రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయి. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వివిధ సంఘటనలకు కులం, మతం అనే రంగు పులుముతున్నారు. వాటిని వివాదాస్పద అంశాలుగా మార్చేస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులను, అధికారులను బద్నాం చేస్తున్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇలాంటి విషయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలి. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనల్ని కంట్రోల్ చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలి. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంత



మంది నేరాలకు పాల్పడుతున్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పు దారి పడుతున్నారు. పాత కేసులను పరిష్కరిస్తున్నాం. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారు. శిక్షలు కూడా పడుతున్నాయి. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. తప్పు చేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను పక్కాగా పాటించాలి. ప్రమాణాల ప్రకారం నెంబర్ ప్లేట్లు అమర్చుకోవాలి. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంఛ్ చేయాల్సి ఉంది. ఈలోగా క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్క్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీటి భద్రత, భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, నదీ జలాలను కాలుష్యం నుంచి కాపాడడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతన్నకోసమే కూటమి ప్రభుత్వం

**అమరావతి, జూన్ 22,(మనం ప్రత్యేక ప్రతినిధి):** ఖరీఫ్-2026 వ్యవసాయ సీజన్కు సంబంధించి రాష్ట్రంలో ఎరువుల లభ్యత, పంపిణీ, నిల్వలు, సరఫరా పరిస్థితులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు, డీలర్ల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు మాత్రమే కాకుండా, అవసరానికి మించి కూడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా యూరియా సరఫరాలో ఎటువంటి కొరత లేకుండా అధికారులు, కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు బలవంతంగా కాంప్లెక్స్ ఎరువులు విక్రయించే ధోరణిని వెంటనే నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించాలని,



అనవసరమైన ఉత్పత్తులను బలవంతంగా విక్రయించడం సహించబోమని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, సంబంధిత కంపెనీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ ధరలకు యూరియా విక్రయించడం చట్టవిరుద్ధమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎరువుల డీలర్లు ఎంఆర్పీ ధరకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయించినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండేలా పటిష్ట పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయనున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అక్రమాలు, అవకతవకలు పునరావృతమైతే ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని హెచ్చరించారు. రైతులకు ఎరువుల బుకింగ్ కోసం అందుబాటులో ఉన్న యాప్ నిర్వహణ మరింత సజావుగా ఉండాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా కౌలు రైతులు, ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటీపీలు ఆలస్యంగా రావడం, మెసేజ్ లింకులు సకాలంలో అందకపోవడం వంటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులతో పాటు పర్యావరణ హిత విధానాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. నానో యూరియా వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

# కార్మిక సంక్షేమ పథకాల అమలులో సాంకేతికతకు ప్రాధాన్యత

- మంత్రి వాసంశెట్టి సుభాష్

**అమరావతి /విజయవాడ,జూన్, 22,(మనం న్యూస్):** విజయవాడ సోమవారం స్థానిక స్వర్ణ ప్యాలెస్ లోని మీటింగ్ హాల్లో ఆంధ్రప్రదేశ్ కార్మికుల వెల్ఫేర్ బోర్డు 45వ సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంక్షేమ కార్యక్రమాలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా కార్మికులకు చేరవేసేందుకు రూపొందించిన సంక్షేమ బోర్డు నూతన వెబ్సైట్ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని కార్మికులకు సంక్షేమ పథకాల సేవలను సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నూతన వెబ్సైట్ ద్వారా కార్మికుల నమోదు, సంక్షేమ పథకాల దరఖాస్తులు, లబ్ధిదారుల వివరాలు, పథకాల మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి సేవలు ఆన్లైన్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, కార్మికులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. 45వ బోర్డు సమావేశంలో సంక్షేమ పథకాల అమలు, నమోదు ప్రక్రియల సరళీకరణ, కార్మికుల భద్రత, సామాజిక భద్రతా కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ సెక్రటరీ ఎం వి శేషగిరి బాబు, కమిషనర్ గంధం చంద్రుడు వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్,వెల్ఫేర్ బోర్డు సభ్యులు వై. వెంకట రమణి, ఆరా మహేశ్వరి, అరవరాజు నేలపాల, గదుల సాయిబాబు, బి విశ్వనాథ నాయుడు,డి. నారపరెడ్డి, చింత రేణుక రాజు, నల్లగొప్పుల వెంకట చలపతిరావు, పిడుగు వెంకటరెడ్డి మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మత్తును చిత్తు చేద్దాం...రండీ

(మొదటి పేజీ తరువాయి)

డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం, పోలీసు శాఖ సమన్వయంతో కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా విద్యాశాఖ, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, కస్టమ్స్ శాఖలతో సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. దేశం తీవ్రవాదం, మావోయిజం వంటి అనేక సవాళ్లను అధిగమించినప్పటికీ, ప్రస్తుతం ప్రతి కుటుంబాన్ని ప్రభావితం చేస్తున్న అతిపెద్ద సమస్య డ్రగ్స్ అని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ అనంతరం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని, డ్రగ్స్‌కు అలవాటుపడిన విద్యార్థులు తమ స్నేహితులను కూడా అదే బాటలో నడిపిస్తున్నారని దర్యాప్తులో వెల్లడైందన్నారు. డిమాండ్ లేకపోతే సప్లై ఉండదు. కాబట్టి డ్రగ్స్ డిమాండ్‌ను తగ్గించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. కొంతమంది చిన్నారులను బిస్కెట్లు, చాక్లెట్లు వంటి వస్తువుల ద్వారా డ్రగ్స్ అలవాటు చేస్తున్నారని, ఇది దేశద్రోహానికి సమానమని డీజీపీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారిని డీ-అడిక్షన్ కేంద్రాలకు చేర్పించేందుకు కుటుంబ సభ్యులు, సమాజం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ గుండె, మెదడు, ఆరోగ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా కుటుంబ వ్యవస్థను కూడా నాశనం చేస్తాయని డీజీపీ హెచ్చరించారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి వరకు పోలీసు వ్యవస్థ మొత్తం డ్రగ్స్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని, విద్యాశాఖ, కస్టమ్స్, డీఆర్ఐ తదితర శాఖల సమన్వయంతో ఈ సమస్యను అరికట్టేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ సేఫ్టీ క్లబ్‌లు ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కొన్ని రాష్ట్రాల్లో డ్రగ్స్ కారణంగా యువత నిర్వీర్యమై, ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం పడిన ఉదాహరణలను డీజీపీ గుర్తుచేశారు. గత తరాల్లో మాదకద్రవ్యాల సమస్య పెద్దగా కనిపించేదికాదని, ప్రస్తుతం చిన్న వయస్సులోనే విద్యార్థులు డ్రగ్స్ బారిన పడుతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి యోగితా రాణా అన్నారు. డ్రగ్స్‌ను తీసుకుందామనే ప్రయత్నం చేయకూడదని, ఒక్కసారి అలవాటు అయితే దాని నుంచి బయటపడటం చాలా కష్టమని హెచ్చరించారు. తమ స్నేహితుల్లో ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పెద్దలకు సమాచారం అందించాలని సూచించారు. ఇది వ్యక్తిగత సమస్య కాదు, సమాజం మొత్తానికి సంబంధించిన సమస్య అని పేర్కొంటూ, 2029 నాటికి నషాముక్త భారత్ - నషాముక్త తెలంగాణ లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. విదేశాల నుంచి వచ్చే పార్సిళ్లలో మాదకద్రవ్యాల రవాణా పెరుగుతున్నట్లు గమనిస్తున్నామని ఈడీ జాయింట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ భరాల తెలిపారు. డ్రగ్స్ యువత కలలను నాశనం చేస్తున్నాయని, ఈ సమస్యపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ శాఖ కూడా కృషి చేస్తోందన్నారు.డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), హైదరాబాద్ జోనల్ యూనిట్ అదనపు డైరెక్టర్ జనరల్ కొండూరు ప్రసాద్ మాట్లాడుతూ ఒకప్పుడు భారత్ ట్రాన్సిట్ దేశంగా మాత్రమే ఉండేదని, కానీ ప్రస్తుతం మాదకద్రవ్యాల వినియోగం దేశంలో పెరుగుతుండటం విచారకరమన్నారు. కొన్ని రకాల డ్రగ్స్ రంగు, రుచి ఉండవని, వాటిని తీసుకున్న వ్యక్తి 48 గంటల వరకు మత్తులో ఉండే ప్రమాదం ఉందని విద్యార్థులను హెచ్చరించారు. హైదరాబాద్ ఈగల్ ఫోర్స్, పోలీసుల కఠిన చర్యల వల్ల నగరంలో డ్రగ్స్ రవాణాపై భయం నెలకొన్నదని తెలిపారు .కార్యక్రమంలో హైదరాబాద్ సిపి సజ్జనార్, కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ అజాజుద్దీన్ ఐఆర్ఎస్, రెవెన్యూ ఇంటెలిజెన్స్ శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ కొండూరు ప్రసాద్ , పంజాగుట్ట, రసూల్ పుర, బేగంపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు సెయింట్ మేరీస్ కాలేజ్ ,టి కె ఆర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)



కాలంగా రాజకీయ అస్థిరతతో సతమతమవుతోన్న యూకేలో మరోసారి అధికార పీఠం ఖాళీ అయ్యింది. ప్రధానమంత్రి పదవికి కీర్ స్టార్మర్ వైదొలగడంతో నాయకత్వ సంక్షోభం ఎదురైంది. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితుల్లో యునైటెడ్ కింగ్డమ్ పాలనా పగ్గాలు అందుకునే తదుపరి నేత ఎవరనేది ఆసక్తికరంగా మారింది. ఈ రేసులో ప్రధానంగా వినిపిస్తున్న పేరు ఆండీ బర్న్‌హామ్. లేబర్ పార్టీలో 'కింగ్ ఆఫ్ ది నార్త్'గా పేరొందిన ఆండీ కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టే అవకాశం కన్పిస్తోంది.

**ఇంతకీ ఎవరాయన?**

గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌గా పనిచేసిన ఆండీ బర్న్‌హామ్ సుదీర్ఘకాలం తర్వాత మళ్లీ పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన మేకర్‌ఫీల్డ్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. దీంతో ప్రధాని పదవికి బరిలో నిలిచేందుకు ఆయనకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ పార్టీకి నాయకత్వం వహించే వ్యక్తి బ్రిటన్‌కు ప్రధానిగా వ్యవహరిస్తారు. లేబర్ పార్టీలో బర్న్హామ్ను కీర్ స్టార్మర్‌కు ప్రధాన ప్రత్యర్థిగా పేర్కొంటారు. ''ప్రజలు నాపై నమ్మకం పెడితే నేను రాజకీయాలను మార్చేస్తా'' అంటూ ఆండీ ఇటీవల తన రాజకీయ ఆకాంక్షను బయటపెట్టారు.

**మూడోసారి లక్ కలిసొచ్చేనా..?**

ఆండీ ముర్రే బర్న్‌హామ్ 1970లో వాయువ్య ఇంగ్లాండ్‌లోని మెర్సీసైడ్‌లో జన్మించారు. రాజకీయాలపై ఆసక్తితో లేబర్ పార్టీలో చేరిన ఆయన.. 2001 నుంచి 2017 వరకు ఎంపీగా పనిచేశారు. మాజీ ప్రధాని గార్డన్ బ్రౌన్ హయాంలో క్యాబినెట్లో కీలక పదవులు చేపట్టారు. ట్రెజరీ, కల్చరల్, ఆరోగ్య మంత్రిత్వ శాఖల్లో పనిచేశారు. లేబర్ పార్టీలో నాయకత్వ పగ్గాల కోసం ఆండీ గతంలో రెండు సార్లు పోటీపడ్డారు. 2015, 2017లో ఆ బాధ్యతల కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత ప్రధాని కావాలన్న తన కలను పక్కనబెట్టి.. 2017లో గ్రేటర్ మాంచెస్టర్‌లకు మేయర్గా ఎన్నికయ్యారు. అక్కడ ఆయన రాజకీయ కెరీర్ కీలక మలుపు తిరిగింది.

**అలా 'కింగ్ ఆఫ్ ది నార్త్' పేరు..**

2020లో కొవిడ్ మహమ్మారి సమయంలో నాటి ప్రధాని బోరిస్ జాన్సన్ ప్రభుత్వంపై ఆండీ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. లాక్‌డౌన్ ఆంక్షల వల్ల ప్రభావితమైన ఉత్తర ఇంగ్లాండ్‌కు ఆర్థిక సాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని నాడు ఆయన ఆరోపించారు. అంతేగాక.. నిధుల కేటాయింపుల్లోనూ లండన్‌కు, ఉత్తర ఇంగ్లాండ్‌కు మధ్య బోరిస్ సర్కారు వివక్ష చూపిందని మండిపడ్డారు. దీంతో ఆండీ పేరు నాడు మీడియా, సోషల్ మీడియాలో మార్మోగింది. దేశవ్యాప్తంగా ఆయన పాపులారిటీ పెరిగింది. ఈ క్రమంలోనే ఆండీ మద్దతుదారులు ఆయనను 'కింగ్ ఆఫ్ ది నార్త్'గా అభివర్ణించారు. ప్రముఖ టీవీ సిరీస్ 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' రిఫరెన్స్‌తో ఆయనకు ఈ పేరు పెట్టారు. ఈ సిరీస్‌లోనూ ఉత్తర ప్రాంతాల పాలకులు తరచూ రాజు పాలనను ఎత్తిచూపుతారు.

గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌గా ఆండీ పాలనకు కూడా దేశవ్యాప్తంగా పేరొచ్చింది. ప్రభుత్వ రవాణాను మెరుగుపర్చడం, స్థానిక ఆర్థిక వ్యవస్థను మెరుగుపర్చేలా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించడం, అందుబాటు ధరల్లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టడం వంటివి చర్యలు జాతీయ మీడియాను ఆకర్షించాయి. అదే పాపులారిటీతో ఆండీ ఇప్పుడు దేశ పార్లమెంట్లోకి మళ్లీ అడుగుపెట్టగలిగారు. ఈ క్రమంలోనే కీర్ స్టార్మర్ రాజీనామాతో లేబర్ పార్టీ నాయకత్వ పగ్గాల కోసం పోటీ పడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

# హర్మూజ్ మీ క్యాసినో కాదు



(మొదటి పేజీ తరువాయి)

జలసంధి మార్గంలో టోల్ విధిస్తామని హెచ్చరించారు. పశ్చిమాసియా దేశాలకు యూఎస్ అందించిన రక్షణ సేవలకుగానూ ఆ డబ్బును తీసుకోనున్నట్లు వెల్లడించారు.

**హర్మూజ్‌లో నెమ్మదించిన రాకపోకలు..**

ఈ హెచ్చరికలలో హర్మూజ్‌లో నౌకల రాకపోకలు నెమ్మదించాయి. అంతకు ముందు రోజు 35 నౌకలు హర్మూజ్ దాటగా.. ఆదివారం కేవలం 12 మాత్రమే దాటినట్లు మారిటైమ్ ట్రాకింగ్ డేటా కంపెనీ విండ్వార్డ్ వెల్లడించింది. వాటిల్లో కొన్ని ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ వ్యవస్థను ఆపేసి ప్రయాణించినట్లు పేర్కొంది.

## బుగ్గపాడు భూముల ధరపై
# దుష్ప్రచారం తగదు
## స్పష్టం చేసిన టీజీఐఐసీ

హైదరాబాద్, జూన్ 22 (మనం బ్యూరో) : ఖమ్మం జిల్లా బుగ్గపాడు ఫుడ్ పార్కులో భూ కేటాయింపు పూర్తి పారదర్శకంగా జరిగిందని టీజీఐఐసీ స్పష్టం చేసింది. దీపక్ నెక్స్ట్ జెన్ ఫీడ్స్ సంస్థకు కారు చౌకగా కేటాయింపులు జరిగాయని ఓ మీడియాలో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ఈమేరకు టీజీఐఐసీ ఉమ్మడి ఖమ్మం జిల్లా జోనల్ మేనేజర్ అజ్మీరా స్వామి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో బుగ్గపాడులోని 203.20 ఎకరాల ఫుడ్ పార్కు ఏర్పాటు చేసి చాలా ఏళ్లు గడచినప్పటికీ పరిశ్రమలు ముందుకు రాకపోవడంతో పెట్టుబడులను ప్రోత్సహించి ఉపాధి అవకాశాలను పెంచేందుకే ధర తగ్గించాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. గతంలో ఎకరం ధర రూ.51 లక్షలుగా నిర్ణయించగా, స్పందన కరువవడంతో ఏప్రిల్ 22, 2022లో రూ.35.75 లక్షలకు సవరించడం జరిగిందన్నారు. అప్పటికీ పరిశ్రమల స్థాపనకు ఎవరూ ముందుకు రాలేదనీ, దీంతో దీపక్ నెక్స్ట్ జెన్ ఫీడ్ పరిశ్రమ రూ.515 కోట్లతో ఫీడ్, ఇంటిగ్రేటెడ్ ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పడానికి 72 ఎకరాల భూమి కేటాయించాలని అభ్యర్థించిందని పేర్కొన్నారు. అయితే, రూ.35.75 లక్షలకు ఎకరం చొప్పున కొనుగోలు తీవ్ర ఆర్థిక భారం అవుతుందని తెలపడంతో రూ.25 లక్షలకు హేతుబద్ధీకరించాల్సి వచ్చిందనీ, ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3040 మందికి ఉపాధి కల్పించనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. వెనకబడిన ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చి అభివృద్ధిని ప్రోత్సహించడం కోసమే భూమి ధర తగ్గించాల్సి వచ్చింది తప్ప ఎవరికో ప్రయోజనం కల్పించడం కోసం కాదని స్పష్టం చేసింది.

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేసేందుకు
# సమన్వయంతో పనిచేయాలి



ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలన..

చింతకాని మండలంలో సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లకు అనువైన స్థలాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

ఖమ్మం, జూన్ 22(మనం బ్యూరో): ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో జూన్ 30న నిర్వహించనున్న సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను సందర్శించి సమగ్రంగా పరిశీలించారు.అనంతరం జగనాథపురం ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రైతులకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను మరింత చేరువ చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయడం ప్రతి శాఖ బాధ్యత అని అన్నారు. సభకు భారీ సంఖ్యలో రైతులు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లను ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సభా వేదిక నిర్మాణం, హెలిప్యాడ్ ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ప్రజల కూర్చునే ఏర్పాట్లు, ప్రవేశ మరియు నిష్క్రమణ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ప్రోటోకాల్ ఏర్పాట్లు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే సభకు హాజరయ్యే రైతులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీటి సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, అంబులెన్స్ సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భద్రతా బందోబస్తు వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని సభా ప్రాంగణం వద్ద మరియు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎండి వరుణ్ రెడ్డి, రవాణా శాఖ కమిషనర్ డా. కె. ఇలంబర్తి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ కట్టడిపై పోలీసులకు శిక్షణ
## పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



హైదరాబాద్, జూన్ 22(మనం,ప్రత్యేక ప్రతినిధి): మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసు సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్‌బిస్త్ స్పష్టం చేశారు. పోలీసు అకాడమీలో సోమవారం ప్రారంభమైన 37వ బ్యాచ్ ఎండీపీఎస్ కేసుల దర్యాప్తు కోర్సు శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ పోలీస్ అకాడమీలో ఎండీపీఎస్ కేసుల దర్యాప్తు కోర్సు ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు 5,000 మందికి పైగా పోలీసు అధికారులు శిక్షణ పొందారన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో సిద్ధాంతపరమైన అవగాహనతో పాటు ప్రాయోగిక దర్యాప్తు నైపుణ్యాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతోందన్నారు. ముఖ్యంగా ఎన్డీపీఎస్ చట్టం, దర్యాప్తు విధానాలు,ఎస్ఓపీలు, సన్నివేశ ఆధారిత ప్రాక్టికల్ వ్యాయామాలు, డిజిటల్ టూల్స్ వినియోగం, తాజా న్యాయ తీర్పులపై శిక్షణ అందించనున్నామన్నారు. తొలిరోజు ఎన్డీపీఎస్ చట్టంపై సమగ్ర అవగాహన, ఎన్డీపీఎస్ కేసుల దర్యాప్తులో పాటించాల్సిన 25 కీలక దశలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కోర్సులో మొత్తం 60 మంది పోలీసు అధికారులు పాల్గొన్నారని, వీరిలో 14 మంది కానిస్టేబుళ్లు, 15 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 9 మంది ఏఎస్ఐలు, 19 మంది సబ్ ఇన్స్పెక్టర్లు, 3 సీఐలు పాల్గొన్నారు.

# సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసు
## వర్చువల్‌గా అల్లు అర్జున్ హాజరు




హైదరాబాద్,జూన్ 22(మనం,ప్రత్యేక ప్రతినిధి) : హైదరాబాద్ నగరంలోని సంధ్యా థియేటర్ తొక్కిసలాట కేసులో హీరో అల్లు అర్జున్ వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో తొక్కిసలాట కేసుపై నాంపల్లి కోర్టులో సోమవారం వాదనలు జరిగాయి. ఈ కేసులో వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ న్యాయస్థానం సమన్లు జారీ చేసినప్పటికీ సినీ నటుడు అల్లు అర్జున్ సినిమా షూటింగ్ షెడ్యూల్స్ కారణంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజయ్యారు. తనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఇందుకు కోర్టు అనుమతించడంతో వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అల్లు అర్జున్ మినహా మిగతా నిందితులంతా వ్యక్తిగతంగా న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. గత రెండు రోజుల కిందట ఈ కేసులో ఏ11గా ఉన్న అల్లు అర్జున్ సోమవారం విచారణకు హాజరు కావలసిందిగా నాంపల్లి కోర్టు నోటీసులు ఇచ్చింది. అయితే సినిమా షూటింగ్ కారణంగా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కాలేక పోతున్నానని అల్లు అర్జున్ అభ్యర్థనను ఆయన తరపు లాయర్ కోర్టుకు వివరించారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. వర్చువల్ గా అల్లు అర్జున్ ను విచారించిన కోర్టు.. తదుపరి విచారణను జులై 6వ తేదీకి వాయిదా వేసింది.

మరో పిటిషన్ : జులై 6న జరిగే తదుపరి విచారణకు తాను రాలేనని, ముందస్తు షూటింగ్ ఒప్పందాల కారణంగా కోర్టుకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని అల్లు అర్జున్ తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. ఈ కేసులో అల్లు అర్జున్ మినహా మిగిలిన నిందితులంతా న్యాయస్థానం ముందు హాజరై ఇంఛార్జ్ జడ్జి సమక్షంలో కమిటెడ్ బాండ్లపై సంతకాలు చేశారు. నిందితుల హాజరు ప్రక్రియ ముగియడంతో నాంపల్లి కోర్టు ఈ కేసు తదుపరి విచారణను జులై 6వ తేదీకి వాయిదా వేసింది.

## టిప్పర్ ఢీకొని డీటీఓ
# వెంకన్న దుర్మరణం

డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

సీఎం రేవంత్, మంత్రి పొన్నం దిగ్భ్రాంతి

కుటుంబానికి భరోసా, విచారణకు ఆదేశం

డీటీఓ మృతిపై హరీశ్‌రావు అనుమానాలు

హైదరాబాద్, జూన్ 22, మనం ప్రతినిధి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం ఉదయం ఒక అత్యంత దారుణమైన రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రభుత్వ విధుల్లో భాగంగా రోడ్డుపై వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి, బి. వెంకన్న (45) ను ఒక బొగ్గు టిప్పర్ లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటన జిల్లా అధికార యంత్రాంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. లారీ వేగానికి డీటీఓ వెంకన్న శరీరం పూర్తిగా నుజ్జునుజ్జయి రోడ్డుపై పడిపోయింది.

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలానికి చెందిన వెంకన్న.. గతంలో జగిత్యాల జిల్లాలో పనిచేశారు. అక్కడి నుండి కేవలం 15 నుండి 20 రోజుల క్రితమే ఆయన భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చి డీటీఓగా బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన కొన్ని రోజుల్లోనే ఆయన ఇలా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం ఆ కుటుంబంలో కోలుకోలేని విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు.ఈ ఘోర ప్రమాదంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్రస్థాయిలో స్పందించారు. ఈ రోడ్డు ప్రమాదంపై అనుమానాలు వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మరణం కేవలం ఒక యాక్సిడెంట్ మాత్రమే కాదనే బలమైన సందేహాన్ని హరీశ్ లేవనెత్తారు.

డీటీఓ వెంకన్న మృతి ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని రవాణాశాఖ జాయింట్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై వీలైనంత త్వరగా పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరపున భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన డీటీఓ వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామన్నారు.

# నేను, కేసీఆర్ అంత మంచోణ్ని కాదు ?

- వచ్చే ఐదేళ్లు.. మీకు సినిమా చూపిస్తం
- మా కార్యకర్తలను ఇబ్బందివెడితే? అస్సలు వదలం,వదిలిపెట్టం?
- కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు..




హైదరాబాద్, జూన్ 22, మనం ప్రతినిధి: తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదు?.. తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టినవారిని అసలు వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తన రాజకీయ ప్రత్యర్థులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము.. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని ఇక అసలే మర్చిపోం అంటూ హెచ్చరించారు. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను కూడా మర్చిపోము అన్నారు. నేను, కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు?.. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి ఒక సినిమా చూపెట్టే బాధ్యత నాది.. ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టను అంటూ తనదైన శైలిలో వార్నింగ్ ఇచ్చారు.

అటు ప్రభుత్వ తప్పిదాల్ని, ప్రభుత్వం ఇచ్చిన అలవికానీ, హామీలపై నిలదీస్తున్న గులాబీ నేతలు, కార్యకర్తలు, కాంగ్రెస్ సర్కార్ అవినీతిపై ప్రశ్నిస్తూ? పోరాడుతున్న వారిని పార్టీని కాపాడేందుకు తమ గళంతో అధికార పార్టీని, ప్రభుత్వాన్ని చెండాడే ప్రతి ఒక్కరికి కంటికి రెప్పలా కాపాడుకుంటామని కేటీఆర్ గులాబీ సైనికులకి భరోసా ఇచ్చారు. అయినప్పటికి తమ కార్యకర్తలను వేధిస్తే?.. వేదించినవారు ఎవరైనప్పటికి?, ఎక్కడున్నా కూడా ఎట్టి పరిస్థితుల్లో వదలం.. వదిలిపెట్టబోమని కేటీఆర్ ఘాటుగా హెచ్చరించారు. 'రిటైరైనా, పారిపోయినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా సరే?.. మా కార్యకర్తలను సతాయించిన ఒక్కొక్కడినీ వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది?.. వదిలిపెట్టే సమస్యే లేదు?. ఇది ఊరికే చెప్పడం లేదు?.. గుర్తు పెట్టుకోండి' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ అంతటి మాట, భరోసా ఇవ్వగానే కార్యకర్తలకు రెక్కలొచ్చినంతగా ఎగిరి గంతేపినంత పని చేశారట?!.

# ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలే?

తెలంగాణలోభారీ వర్ష సూచన

రాష్ట్రవ్యాప్తంగా జూన్ 27 వరకు వర్షాలు కురిసే అవకాశం




హైదరాబాద్, జూన్ 22, మనం ప్రతినిధి : తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరికల నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీ, నీటి నిల్వ సమస్యలను నివారించేందుకు గాను కీలక సూచనలు జారీ చేశారు. భారత వాతావరణ శాఖ కథనం ప్రకారం, రాష్ట్రంలో జూన్ 24 నుంచి ఈ నెల 27 వరకు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దీంతో సైబరాబాద్ పరిధిలోని కంపెనీలు, ఇతర కార్యాలయాలు, విద్యాసంస్థలు మధ్యాహ్నం 3:30 గంటల నుంచే ఉద్యోగులను, విద్యార్థులను విడతల వారీగా ఇళ్లకు పంపాలని సూచించారు. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

గతంలో భారీ వర్షాల కురిసిన సమయంలో గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో తీవ్రమైన ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి, వాహనదారులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోయారు. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి అలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఉద్యోగులందరూ ఒకేసారి కార్యాలయాల నుంచి బయటకు రావడం వల్ల కలిగే రద్దీని నివారించేందుకే ఈ అడ్వైజరీ జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే, నిన్న సాయంత్రం వరకు నగరంలో భారీ వర్షం నమోదు కానప్పటికీ, రానున్న రోజుల్లో వర్ష తీవ్రత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజలు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క



ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 22 (మనం బ్యూరో): నాగర్కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండలం సిర్సవాడ గ్రామం వద్ద దుందుభి వాగుపై రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనురుద్ రెడ్డి, తో కలిసి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క (ధనసరి అనసూయ) సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల నాటి కలను సాకారం చేయడంలో నాగర్కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి అసాధారణమైన పట్టుదలతో కృషి చేశారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రశంసించారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటి సాధన కోసం నిరంతరం శ్రమించే నాయకులు సమాజానికి ఎంతో అవసరమన్నారు. అలాంటి నాయకులను ప్రజలు గుండెల్లో పెట్టుకుని ఆదరించాలని మంత్రి సీతక్క తెలిపారు. సిర్సవాడ గ్రామం వద్ద దుందుభి వాగుపై రూ.20 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ...., ఈ వంతెన నిర్మాణం కేవలం ఒక అభివృద్ధి కార్యక్రమం మాత్రమే కాదని, వేలాది మంది ప్రజల జీవితాలను సులభతరం చేసే చారిత్రాత్మక నిర్ణయమన్నారు. అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న కల నేడు నిజమవుతుండడం ఆనందంగా ఉందని బ్రిడ్జి నిర్మాణానికి నాణ్యత ప్రమాణాలు పాటించి వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

## ఢిల్లీలో ఒక నీతి.. హైదరాబాద్‌లో ఒక రీతా?

సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ రాహుల్‌గాంధీకి దాసోజు లేఖ

హైదరాబాద్, జూన్ 22, మనం ప్రతినిధి : విదేశీ విధానాల్లో కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని విమర్శిస్తూ?.. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ లేఖ రాశారు. ఢిల్లీ వేదికగా ఏఐసీసీ చెప్పే జాతీయ, అంతర్జాతీయ సిద్ధాంతాలకు..

హైదరాబాద్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న 'రోడ్డు నాటకాలకు' అస్సలు పొంతన లేదంటూ ధ్వజమెత్తారు. జూన్ 20న కాంగ్రెస్ జాతీయ ప్రతినిధి పవన్ ఖేరా విడుదల చేసిన అధికారిక ప్రకటనను సైతం శ్రవణ్ ఈ లేఖకు జతచేశారు. ఆ ప్రకటన ప్రకారం... గత 12 ఏళ్లుగా మోడీ ప్రభుత్వ విదేశాంగ విధానం 'ఇండియా ఫస్ట్' కాకుండా' పీఆర్ ఫస్ట్' (ప్రచారం కోసం)లా సాగిందని కాంగ్రెస్ ఆరోపించిందని శ్రవణ్ పేర్కొన్నారు. అయితే, భారత్‌పై ట్రంప్ చిన్నచూపు చూస్తూ 'ఆదేశాల భాషలో' మాట్లాడుతున్నారని హితవు పలికారు. ఆయన ముందు మోడీ మోకరిల్లడం 140 కోట్ల మంది భారతీయులకు సిగ్గుచేటని ఢిల్లీ వేధికగా కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించిందని ఆయన చెప్పారు. ట్రంప్‌ను కాంగ్రెస్ పార్టీ ఇంతలా విమర్శించిన, మూడు రోజులకే, జూన్ 23న సీఎం రేవంత్ రెడ్డి.. డొనాల్డ్ ట్రంప్ కోసం హైదరాబాద్‌లో రెడ్ కార్పెట్ పరుస్తున్నారని శ్రవణ్ విమర్శించారు. లోక్ సభ ప్రతిపక్ష నాయకుడిగా, ఈ రాజకీయ ద్వంద్వ నీతిని మీరు ఎలా సమర్థిస్తారంటూ? రాహుల్ గాంధీకి రాసిన లేఖలో శ్రవణ్ ప్రశ్నల వర్షం కురిపించారు.

## వాళ్లను పిచ్చి ఆసుపత్రిలో చేర్చాలి?

ప్రశ్నలడిగితే? దాడులు జెస్తుండ్రు?

దూదిమెట్ల బాలరాజు యాదవ్

హైదరాబాద్, జూన్ 22, మనం ప్రతినిధి: తెలంగాణలో ఈ దుష్ట కాంగ్రెస్ పాలనలో ప్రశ్నలడిగిన అడిగిన పాపానికి?.. విసునూరి రాంచంద్రారెడ్డి నయా వారసుడిలాగా రేవంత్‌రెడ్డి, తన మంద, పోలీస్ బలంతో భౌతిక దాడులు చేస్తున్నారని, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ విమర్శించారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మీడియాతో బాలరాజు యాదవ్ మాట్లాడుతూ.. భూపాలపల్లిలో డీటీఓ వెంకన్నను లారీలతో తొక్కించి చంపేశారని ఆయన ఆరోపించారు. మైనంపల్లి హనుమతురావు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడన్నారన్నారు.

**పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఊరుకోము?..**

మైనంపల్లి పైన కేసు నమోదు చెయ్యకుండా పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రజలకు కోసం పని చేస్తున్న కేటీఆర్‌ను ఊసరవెల్లి లాంటి హనుమంతరావు ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదని బాలరాజు యాదవ్ హెచ్చరించారు. రాజకీయ బిక్ష కోసం కేటీఆర్ కాళ్లు పట్టుకున్న వ్యక్తి హనుమంతురావు అన్నారు. ఖబడ్దార్ మైనంపల్లి హనుమతురావు, ఇంకోసారి కేటీఆర్‌పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే? తమ బీఆర్ఎస్ సైన్యమంతా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు సైనికులుగా మారి ఒక్కొకరి తుక్కు వదలగొడుతామని బాలరాజు మైనంపల్లికి వార్నింగ్ ఇచ్చారు.

## మంత్రి సీతక్కకు కేటిఆర్‌ను
# విమర్శించే హక్కు లేదు



- నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి

ములుగు,జూన్ 22మనం ప్రతినిధి: జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మ నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి మీడియా సమావేశం నిర్వహించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంత్రి సీతక్కకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను విమర్శించే నైతిక హక్కు లేదని బడే నాగజ్యోతి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మేడారం జాతర అభివృద్ధి పనుల్లో భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మేడారం పనుల విషయంలో అధికార పార్టీ మంత్రుల మధ్య ఆధిపత్య పోరు నడిచిందని, ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకున్న ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని అన్నారు. దొంగ సర్టిఫికెట్లతో రాజకీయాలు చేస్తూ, ప్రజలను మోసం చేస్తున్న నాయకులు నేడు నీతులు చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. ములుగు జిల్లాలో జరుగుతున్న ఇసుక దోపిడీ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని, వేల కోట్ల రూపాయల అక్రమ ఇసుక వ్యాపారం వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ సమర్థవంతమైన నాయకుడిపై తప్పుడు ఆరోపణలు చేయించడం ద్వారా ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మేడారం పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడిన వారు అధికార పార్టీకి చెందినవారే కాదా అని ప్రశ్నించారు. గిరిజనుల సంక్షేమం పేరుతో అధికారంలోకి వచ్చి, కొందరు నాయకులు మరియు వారి అనుచరులు మాత్రమే లబ్ధి పొందుతూ గిరిజన సంఘాల సభ్యులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల సంపదను దోచుకుంటూ, అవినీతికి పాల్పడుతున్న వారికే ప్రజల శాపనార్థాలు తగులుతాయని హెచ్చరించారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, అక్రమాలను దాచేందుకు దేవుళ్లను, ఆధ్యాత్మిక అంశాలను రాజకీయాలకు వాడుకోవడం కాంగ్రెస్ నాయకులకు అలవాటుగా మారిందని ఆరోపించారు.

## పచ్చడి కలిపే చేతులు

ఇంటింటికో కథ ఉన్నట్టు
మా ఇంటి మా పచ్చడి కథ
ఏ ఇంటి రుచి... ఆ ఇంటిదే
ఆకు పచ్చని
కొత్త మామిడి కాయలు
ఇళ్లకు తరలి వచ్చిన
మామిడి చెట్లు
ఆకుపసచ్చని కాంతి
వాళ్ళ వేళ్ళ కొసలని తాకి పచ్చని
కొమ్మల్లా

మెరిసి పోతున్నవి
ఇంటికి కొత్త ఋతువు
వచ్చినట్టు
పచ్చడి కాలానికి తలుపులు
తెరుస్తున్నవి
ఎఱ్రని మిరపకాయల
ఘాటు ముక్కుపుటాలకు తాకి
తుమ్ములు.. కళ్ళలో నీళ్ళు
ఎల్లిపాయలు పొట్టు తీయలేక
చేతివేళ్ళకు కాయలు
దొడ్డుప్పు వెన్నెల్లో
చమక్కు మంటుంది
అమ్మ మెంతులను
వస్త్ర కాయితం పడుతుంది
కమ్మని వాసనలు
ఇల్లంతా కలియ తిరుగుతుంది
ఏ ఇంట్లో చూసినా
పచ్చడి సందడి
నాయన కత్తిపీటపై
ముక్కలు చేస్తే కొలత తప్పని సైజు
కళ్ళన్నీ కాయలు చేసి
ముక్కలను చూసేది


బట్ట తీసుకుని అక్కలు
జీడితీసి శుభ్రంగా తుడవటం
మామిడి ముక్కని కొరికితే
జివ్వుమనే పులుపు
ఆరబెట్టిన ముక్కల రాశులు
ఒక రకమా!
అమ్మ పెట్టె పచ్చడి
అక్కలు ఇష్టంగా పెట్టుకునే
నువ్వుల మామిడి
అల్లం మామిడి
ఆవ మామిడి
అన్ని రకాల జాడీలు
నిలువు జాడీలు
బొద్దుగా ముద్దు జాడీలు
చిన్న జాడీలు
ఎన్ని వన్నెచిన్నెల జాడీలో
మనుషుల్లో రకాలుగా
జాడీలు చేసేవాడి

చేతివేలి కొసలనుండి
జారిన సాల బంజికలు
తరాల కథల్ని
పూసగుచ్చి చెబుతవి
కొలువుదీరిన బొమ్మల్లా
జాడీల వరుస
నీళ్ల తడి తాకకుండా
లక్ష్మణ రేఖలు
నిషేధాలు
పచ్చడి నిల్వకోసం కట్టుబాట్లు
ఎన్ని కొలతలు
ఎన్ని పాళ్ళు చెప్పినా
అమ్మ పెట్టే పచ్చడి
అపురూపం
పచ్చడి కలిపే అమ్మచేతులు
అరచేతులు గోరంటాకు
పెట్టుకున్నట్టు
ఎండు మిరపకాయల్లా చేతి
వేళ్ళు నిగ నిగ లాడేవి
మా అందరికి
కలపాలనే కోరిక ఉన్నా
పిల్లలు కారాన్నీ
పులుముకుంటారోననే
అమ్మ మమకారం!
తాకనిచ్చేది కాదు
ఉప్పు,కారం,మెంతి పొడి
పల్లి నూనె
ముక్కలుకు కలుపుతుంటే
ఎప్పుడెప్పుడు
అమ్మ పెట్టె ఎఱ్రని కారంముద్దల
కోసం
నీళ్లూరుడు
అరచేతిలో పెట్టుకుని తింటుంటే
ఆ రుచికి
దేవతలే దిగివస్తారు

**- డా.సుంకర రమేశ్**
9492180764

# కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు కుట్రలా?

తెలంగాణ రాజకీయ క్షేత్రం ప్రస్తుతం తీవ్రమైన విమర్శలు, ప్రతివిమర్శలతో అట్టుడుకుతోంది. శాసనసభ ఎన్నికల తర్వాత కాస్త శాంతించినట్లు కనిపించిన రాజకీయ వాతావరణం, ఆ తదుపరి పరిణామాలు మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఒక్కసారిగా వేడెక్కింది. సిద్ధాంతాల పరంగా ఉత్తర-దక్షిణ ధ్రువాలుగా చెప్పుకునే భారత్ రాష్ట్ర సమితి, భారతీయ జనతా కూటమి ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పక్షాన్ని లక్ష్యంగా చేసుకుని ఏకకాలంలో దాడులు తీవ్రం చేశాయి. ప్రభుత్వ విధివిధానాలు, సాయం పంపిణీ వివాదం, మంత్రులపై అవినీతి ఆరోపణల వంటి ప్రతి అంశంలోనూ ఈ రెండు పార్టీల గళం ఒకేలా ధ్వనిస్తుండటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే రాజకీయ సూత్రం ఆధారంగానే అటు కేంద్రం, ఇటు రాష్ట్ర వ్యూహాలు నడుస్తున్నాయా? ఈ ముకుమ్మడి దాడి వెనుక నిజంగానే ఒక లోపాయికారీ ఒప్పందం దాగి ఉందా? అనే కోణంలో సమగ్ర విశ్లేషణ అవసరం.



ప్రస్తుత పరిణామాలను గమనిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు అటు భారత్ రాష్ట్ర సమితి నాయకత్వం, ఇటు భారతీయ జనతా కూటమి నేతలు ఏ ఒక్క అవకాశాన్ని వదలడం లేదు. అయితే ఈ రెండు పక్షాల దూకుడును అధికార కాంగ్రెస్ పక్షం చాలా చాకచక్యంగా తన వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రతిపక్షాలు రెండు ఒకటేనంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. దేశ రాజధానిలో కేసుల విచారణల వేగం తగ్గడం, కొన్ని కీలక పరిణామాల నేపథ్యంలో ఈ రెండు పక్షాల మధ్య తెరవెనుక ఒక అవగాహన కుదిరిందని, అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఒంటరిని చేసేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగుతున్నారని అధికార పక్షం గట్టిగా వాదిస్తోంది. ఈ ఆరోపణలను ప్రతిపక్షాలు ఎంతగా ఖండిస్తున్నప్పటికీ, వారి పోరాట శైలి మాత్రం ప్రజల్లో అనుమానాలకు తావిచ్చేలా ఉందనేది కొందరి అభిప్రాయం.

కానీ, ఈ వ్యవహారాన్ని రాజకీయ వ్యూహాల కోణం నుండి చూస్తే ఇందులో లోపాయికారీ పొత్తు కంటే కూడా సమయానుకూల అవసరం ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి తెలంగాణలో కాంగ్రెస్ పక్షం బలంగా ఉంది. కాంగ్రెస్ గనుక ఇదే ఉత్సాహాన్ని మరికొన్నేళ్లు కొనసాగిస్తే, అది ఇటు భారత్ రాష్ట్ర సమితి ఉనికికి, అటు భారతీయ జనతా కూటమి కలకి ఒకేసారి గండం తప్పని పరిస్థితులు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా, క్షేత్రస్థాయిలో ప్రాంతీయ పక్షం బలహీనపడితే ఆ ఖాళీని తామే భర్తీ చేయాలని జాతీయ పక్షం ఆశిస్తుండగా, తమ ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకుని మళ్లీ పుంజుకోవాలని భారత్ రాష్ట్ర సమితి భావిస్తోంది. ఇలాంటి తరుణంలో బీఆర్ఎస్, బీజేపీలకు కాంగ్రెస్ పక్షమే ప్రధాన శత్రువు కావడం వల్ల, వారి దాడుల లక్ష్యం ఒక్కటే అయింది. దీనివల్ల పైకి వీరిద్దరూ కలిసి కట్టుగా నడుస్తున్నట్లు భ్రమ కలుగుతోంది. వాస్తవం మాత్రం ఆయా పార్టీల నేతలకే వదిలేయాలి.

రైతాంగ సమస్యల విషయానికి వస్తే, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అధికార పక్షం విఫలమైందని ప్రతిపక్షాలు ముక్తకంఠంతో నినదిస్తున్నాయి. పంటలకు అందించే సాయం, పెట్టుబడి మద్దతు పంపిణీలో జరుగుతున్న ఆలస్యాన్ని అటు ప్రాంతీయ పక్షం, ఇటు జాతీయ పక్షం తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నాయి. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపడం ప్రతిపక్షాల బాధ్యత అయినప్పటికీ, ఈ రెండు పార్టీలు ఒకే రకమైన విమర్శనాస్త్రాలను సంధించడం వెనుక తెరవెనుక వ్యూహకర్తల హస్తం ఉందనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయి. నిధుల కొరతను సాకుగా చూపిస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా దారి మళ్లిస్తోందని ఇరు పక్షాలు ఆరోపిస్తున్నాయి.

తెలంగాణ సమాజం రాజకీయంగా అత్యంత చైతన్యవంతమైనది. గతంలో జరిగిన అనేక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పులు ఈ విషయాన్ని నిరూపించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ప్రజలు వింటున్నారు కానీ, ఒకవేళ ఈ రెండు ప్రతిపక్షాల మధ్య అంతర్గత అవగాహన..లోపాయికారి ఒప్పందం నిజమే అని ప్రజలు నమ్మితే అది రెండు పక్షాలకూ రాజకీయంగా భారీ నష్టాన్ని చేకూరుస్తుంది. ఎందుకంటే తెలంగాణ సెంటిమెంట్‌తో పుట్టిన ప్రాంతీయ పక్షం, జాతీయ వాదంతో నడిచే పక్షంతో పూర్తిగా చేతులు కలిపిందని భావిస్తే కార్యకర్తల్లో గందరగోళం మొదలవుతుంది. అందువల్లనే, ఈ రెండు పక్షాలు కాంగ్రెస్‌పై ఎంత ముకుమ్మడి దాడి చేస్తున్నప్పటికీ, తమ మధ్య ఎలాంటి సంబంధం లేదని చెప్పుకోవడానికి చాలా కష్టపడుతున్నాయి.

మరోవైపు, అధికార పక్షం కూడా ఈ దాడులను ఎదుర్కొనేందుకు తనదైన శైలిలో వ్యూహ ప్రతివ్యూహాలను సిద్ధం చేస్తోంది. ప్రతిపక్షాల ఆరోపణలలో నిజం లేదని, గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే ఈ రకమైన కుయుక్తులు పన్నుతున్నారని మంత్రులు తిప్పికొడుతున్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం పారదర్శకంగా ఉందని, త్వరలోనే అన్ని హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ప్రజలకు భరోసా కల్పిస్తున్నారు. అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రతిపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు రాష్ట్రంలో ముందస్తు ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్నాయి.

అంతిమంగా, ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న పరిణామాలు కేవలం రాబోయే స్థానిక ఎన్నికల హడావిడి మాత్రమే కాదు, భవిష్యత్తులో అసలైన ప్రత్యామ్నాయం ఎవరు అని నిరూపించుకునే పెద్ద యుద్ధం. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఈ తెరవెనుక రాజకీయాల అసలు రంగును బయటపెట్టనున్నాయి. ఆ ఎన్నికల్లో ఈ రెండు పక్షాలు క్షేత్రస్థాయిలో ఒకరికొకరు వ్యతిరేకంగా ఎంత వరకు పోరాడతాయి, లేదా లోపాయకారీగా ఓట్ల బదిలీకి పాల్పడతాయా అనే దాన్నిబట్టే ఈ అనుమానాలకు పూర్తి సమాధానం లభిస్తుంది. అప్పటివరకు అధికారపక్షం ఈ సహజ శత్రువుల వైఖరిని ప్రజల్లో ఎండగడుతూ తన పట్టును నిలుపుకునే ప్రయత్నం చేస్తుంది. బీజేపి నైజాన్ని ఎండకట్టే ప్రయత్నాలు కూడా చేస్తుంది. ప్రతిపక్షాలు తమ ముకుమ్మడి దాడితో ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసే వ్యూహాన్ని కొనసాగిస్తాయి. ఏది నిజం, ఏది రాజకీయం అనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు కాబట్టి, రాబోయే రోజుల్లో వచ్చే తీర్పే ఈ రాజకీయ గందరగోళానికి తెరదించుతుంది.

**- వెంక గారి భూమయ్య**
9848559863

## శరణార్థులకు సంఘీభావం తెలుపలేమా!



యుద్ధాలు, సంక్షోభాలు, హింసలు, పీడించడం, వాతావరణ ప్రతికూల మార్పులు, జాతి వివక్షలు, మత విద్వేషాలు, జాతీయత, కొన్ని సామాజిక లేదా రాజకీయసంఘాల్లో సభ్యత్వాల కారణంగా ప్రాణ భయంతో మరో దేశానికి వెళ్లి శరణు కోరి ప్రాణాలు కాపాడుకునే ప్రత్యేక వ్యక్తులు లేదా సమూహాలను శరణార్థులుగా నిర్వచిస్తాం. నేరుగా మరో దేశంలో శరణార్థులుగా చేరే వారు, ఆశ్రమం పొందే వారు, అంతర్గతంగా స్థానభ్రంశం పొందిన వారు, ఏ దేశానికి చెందని వారు, అనేక ఏళ్ల తర్వాత తిరిగి తమ దేశానికి చేరి వారందరూ శరణార్థుల జాబితాలో వస్తారు.

శరణార్థులు, వారి పిల్లలు పడుతున్న అమానవీయ వేదనలను గుర్తించి ఐరాస తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రతి ఏట 20 జూన్ రోజున ప్రపంచ శరణార్థి దినోత్సవాన్ని పాటించడం జరుగుతోంది. మరో దేశం నుంచి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వచ్చిన శరణార్థులు కూడా సాధారణ మానవులే అని, వారికి కూడా కనీస మానవ హక్కులు వర్తిస్తాయని, వారితో ధైర్యాన్ని నింపడం, వారి పిల్లలకు విద్య వసతులు విస్తరించాలని, ఆకలి చావుల కోరల్లో చిక్కుకుండా చూసుకోవాలని ప్రపంచ దేశాలకు అవగాహన పరచడానికి ఈ వేదికలు ఉపయోగపడుతున్నాయి. 2026 ప్రపంచ శరణార్థి దినోత్సవం ఇతివృత్తంగా అందరు సురక్షితంగా ఉండే వరకు శరణార్థులకు సంఘీభావం ప్రకటిద్దాం అనే అంశాన్ని నిర్ణయించారు. శరణార్థులను కూడా సాధారణ పౌరులుగా చూడాలని, శత్రువులుగా భావించ వద్దని ఐరాస సూచిస్తున్నది. శరణార్థుల పట్ల సహానుభూతి చూపడం, కనీస మానవ హక్కులను కల్పించడం, వారికి సంఘీభావంగా ప్రచారాలు నిర్వహించడం, వారి జీవిత కథలను వినడం, వారి అనుభవాలను అర్థం చేసుకోవడం, వారి పట్ల రాజకీయ ఏకీకరణ జరగడం, వారి అభ్యున్నతికి నిధులు కేటాయించడం, వారి మనోభావాలను అర్థం చేసుకోవడం లాంటివి కొనసాగాలి.


భారత్లోకి శ్రీలంక, మియాన్మార్, అఫ్ఘానిస్థాన్, టిబెట్, బంగ్లాదేశ్ లాంటి ఇరుగు పొరుగు దేశాల నుంచి వేల మంది శరణార్థులు భారత భూభాగంలోకి శరణార్థులుగా చేరడం కొనసాగుతున్నది. శ్రీలంకన్ తమిళులు, రోహింగ్యాలు, టిబెటన్లు, చక్మా-హజోంగ్లు, జూయిష్ వర్గాలు అధిక సంఖ్యలో భారత్‌కు రావడం, శరణార్థులుగా జీవితాలను కొనసాగించుకోవడం జరుగుతూ కొన్ని సార్లు మన దేశంలో శాంతి భద్రతల సమస్యలకు కూడా కారణం అవుతున్నారని కూడా భావించడంతో జరుగుతోంది. భారత్‌లో చేరిన శరణార్థులు అధిక శాతం పట్టణ ప్రాంతాల్లో స్థిరపడి అసంఘటిత పనుల్లో నిమగ్నం అవుతున్నారు. శరణార్థి కుటుంబాలకు చెందిన పిల్లలు 7 శాతం మాత్రమే విద్య కొనసాగిస్తున్నారని, 87 శాతం శరణార్థులు అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లోనే జీవిస్తున్నారని తెలుసుకోవాలి.

ప్రపంచ శరణార్థి దినోత్సవ వేదికగా నిజమైన శరణార్థులను గుర్తించి వారికి కనీస వసతులను కల్పించడం నిరంతరం జరగాలి. నిస్సహాయ స్థితుల్లో శరణార్థులుగా చేరిన వారి కుటుంబాలకు కనీస అవసరాలు తీర్చడం, సహానుభూతితో వారికి గొడుగు పట్టడం, వారి పిల్లలకు చదువుకునే అవకాశాలు కల్పించడం, మానవీయ కోణంలో అక్కున చేర్చుకోవడం, వారికి వైద్య ఆరోగ్య వసతులు కల్పించం, వారిని మానవులుగా గౌరవించడం, సమానత్వ భావనలను ఆచరించడం, కనీస సహ కారాలను అందించడం కొనసాగాలి. ఊహించని సందర్భాల్లో పరాయి దేశంలోకి చేరిన శరణార్థులకు మానవ హక్కుల గొడుగు పడదాం, వారి శ్రేయస్సుకు పాటు పడదాం.

**- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## సేవలో సమర్థత పాలనలో నైతికత

ప్రపంచవ్యాప్తంగా ప్రజల మేలు కోసం ప్రభుత్వ యంత్రాంగాలు చేసే సేవలకు గౌరవం చెల్లించేందుకు, సేవా విధులలో నిబద్ధతతో పనిచేసే అధికారులను సత్కరిం చేందుకు ఐక్య రాజ్య సమితి ప్రతీ సంవత్సరం జూన్ 23వ తేదీని ప్రజా సేవా దినోత్సవంగా జరుపుకుంటుంది. ప్రభుత్వ రంగంలో నైతికత, సమర్థత, పారదర్శకత, ప్రజలపట్ల బాధ్యత అనే విలువలను ఈ దినోత్సవం నొక్కిచెబుతోంది.




ఈ దినోత్సవానికి చరిత్రాత్మక ప్రాముఖ్యత ఉంది. అంతర్జాతీయ కార్మిక సంస్థ 1978లో ఆమోదించిన 'కార్మిక సంబంధాలపై పబ్లిక్ సర్వీస్ కూటమి -నం.151'ను గుర్తుగా, 2002లో ఐక్య రాజ్య సమితి సాధారణ సభ A/RES/57/277 తీర్మానం ద్వారా జూన్ 23ను అధికారికంగా ప్రజా సేవా దినంగా గుర్తించింది. 2003 నుండి ఈ దినోత్సవం అంతర్జాతీయంగా జరుపు కుంటున్నారు.

ఈ దినోత్సవం నాలుగు ముఖ్యమైన లక్ష్యాల చుట్టూ నడుస్తుంది.ప్రజా సేవకుల కృషిని గౌరవించడం, యువతను సేవామార్గం లోకి ప్రేరేపించడం, ప్రజా పరిపాలనను మెరుగు పరచడం, ఉత్తమ పాలనా పద్ధతులను పంచుకోవడం. ప్రజా పరిపాలనలో కొత్త ఆవిష్కరణలకు మార్గం వేసే ఈ దినోత్సవం ద్వారా ప్రభుత్వ సేవల ప్రాముఖ్యతను ప్రపంచం అంతటా గుర్తించి, వాటిని బలోపేతం చేయడమే లక్ష్యం.

ప్రతి సంవత్సరం ఐక్య రాజ్య సమితి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న వినూత్న సేవల కోసం ప్రజా సేవా అవార్డులు ప్రదానం చేస్తుంది. పాలనలో ప్రజల భాగస్వామ్యం, డిజిటల్ సేవల వినియోగం, లింగ సమానత్వం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో విశిష్టత చూపిన ప్రభుత్వ సంస్థలకు ఈ అవార్డులు లభిస్తాయి. అవార్డులు కేవలం గౌరవం మాత్రమే కాదు. ఇతర దేశాలకు ఆదర్శంగా నిలిచే విధానాలకు గుర్తింపు కూడా.

భారతదేశంలో ప్రజా సేవలకు అనేక అభినవ నమూనాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది పంజాబ్ రాష్ట్రం మొహాలీ జిల్లాలో ప్రారంభించిన 'సేవా కేంద్రాలు'. ఈ కేంద్రాల్లో పౌరులకు అవసరమైన సేవలు - పుట్టిన సర్టిఫికెట్, ఆదాయ ధృవీకరణ, విద్యుత్ బిల్లులు, ప్రభుత్వ పథకాల దరఖాస్తు మొదలైనవి ఒకే చోట, సమర్థవంతంగా అందు తున్నాయి. ఈ మోడల్‌కు ఐక్య రాజ్య సమితి 2015లో ప్రజా సేవా అవార్డు ప్రదానం చేయడం గర్వకారణం. ఇదే విధంగా ఆంధ్రప్రదేశ్ వాలంటీర్ వ్యవస్థ, కర్ణాటక భూమి పత్రాల డిజిటలైజేషన్, కేరళలో అత్యవసర సేవల నిర్వహణ వంటి కార్యక్రమాలు ప్రజా సేవలో నూతన దిశలు చూపిస్తున్నాయి.

ప్రజా సేవ అనేది కేవలం ప్రభుత్వ ఉద్యోగి విధిని నిర్వహించడమే కాదు. అది ప్రజల పట్ల ఉన్న బాధ్యతను, నమ్మకాన్ని నిలబెట్టే ధర్మం. ప్రభుత్వ ఉద్యోగి నైతికతతో, సమర్థతతో పని చేస్తేనే పాలనా వ్యవస్థ పటిష్ఠంగా నిలబడుతుంది. అందుకే ఈ దినోత్సవం ప్రతి ప్రభుత్వ సేవకునికి గుర్తు చేస్తోంది ఈ రోజు సందర్భంగా, ప్రభుత్వాలు తమ ప్రజా సేవ విధానాలను సమీక్షించుకోవాలి. పాలకుల నిబద్ధత, ప్రజల పట్ల జవాబు దారీతనం, సేవల సరళత వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. యువతలో ప్రజా సేవా స్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

జూన్ 23 ఐక్య రాజ్య సమితి ప్రజా సేవా దినోత్సవం ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వ వ్యవస్థలు, అధికారులు కలసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. సేవే లక్ష్యంగా, నైతికతే ఆధారంగా పనిచేసే వారు ఈ ప్రపంచాన్ని మెరుగైన స్థలంగా మార్చగలరు. అవే నిజమైన ప్రజా సేవకులు.

**జూన్ 23...ఐక్య రాజ్య సమితి ప్రజా సేవా దినోత్సవం**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

## ఒక బేలతనం!

అతను
భారం మోసినంతకాలం
ఎన్నడూ పెద్దగా అలసిపోలేదు!
తనని
ఇతర్లు మోసే కాలం దాపురించినప్పుడే
నిత్యం దేనికోసమో ఎదురుచూపు!
ఎంతగా దాచుకుందామనుకున్నా
కళ్ళల్లో లీలగా
ఒక భయం తండ్లాట!
రసం పిండుకున్నాక
అది బంగినపల్లి మామిడిపండైనా
టెంక విసిరేయాల్సిందే!
ఈ సత్యం తెలిస్తే .. జీవిత చరమాంకంలో
పెద్ద దిగులు ఉండదు!
ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా
పెన్షన్ ఖాతా ఖాళీ అవుతూనే ఉంది
దృష్టి ఆనక బాధ తెలియదంతే!
బ్యాలెన్స్ ఎంతుందంటే
మొన్ననే చెప్పానుగా అన్నా
బుర్ర గోక్కోవడానికి చేయి సహకరించదు!
ఎవరికీ ఏమీ వినపడరాదని
లోలోన చేసుకున్న సణుగుడు మాత్రం
అందరికీ వినిపిస్తుంది!
అతని అనుభవం
నాకేం నేర్పిందంటే పారిజాతానికైనా
నేల రాలేంతవరకే విలువని!!

**- కోట్ల వెంకటేశ్వర రెడ్డి**
94402 33261

# ప్రతీకార దాడులతో ప్రయోజనమేమి?

2022 లో ప్రారభమైన రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ఎడతెగక సాగుతోంది. రెండు దేశాలు ప్రతీ కార దాడులతో రెచ్చిపోతున్నాయి. ఇటీవల రష్యా రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ కని వినని రీతిలో దాడులు చేసింది.రష్యాలోని ఒక రిఫయినరిలో తీవ్ర దాడి జరిగింది. ఇది ఆగ్నేయ మాస్కోలో ఉంది. ఇది అత్యంత పెద్ద రిఫయినరి. దీనిపైనే ఉక్రెయిన్ కన్నేసింది. దీన్ని దెబ్బ తీస్తే రష్యా ఆర్థిక మూలాలు దెబ్బ తింటాయానే ఉద్దేశంతో కపోట్నా జిల్లాలో వున్న రిఫైనరిపైనే మూడు సార్లు దాడి చేసింది. ఈ సారి జరిగిన దాడిలో ఆ రిఫైనరీలో మంటలు ఉవ్వెత్తున్న ఎగసి పడ్డాయి. ఆ దాడికి ఆకాశమంతా దట్ట మైన పొగలతో నిండిపోయింది. ఈ దాడితో రష్యా ఆగ్రహం ప్రకటించింది. మేము అనుకున్న విధంగానే రష్యాను దెబ్బ తీశామని ఉక్రెయిన్ కూడా ప్రకటన గుప్పించింది. ఉక్రెయిన్‌ను దెబ్బ తీస్తే, మాస్కోను కూడా తీవ్రంగా దెబ్బ తీస్తామని, ఈసారి మా దాడి అత్యంత భయకరంగా ఉంటుందని, ఇక యుద్ధం ముగిపు పలికే సమయం ఆసన్న మైందని, దౌత్యపరంగా రష్యానే యుద్ధంకు ముగింపు పలకాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జెలెన్ స్కీ అభిమతంగా ఉంది. కానీ రష్యా అందుకు సుముఖంగా లేదు. ఇదిలా ఉంటే రష్యా ప్రకటన మరో విధంగా ఉంది. ఉక్రెయిన్‌కు చెందిన దాదాపు వెయ్యి డ్రోనులు, నాలుగు క్షిపణులు ధ్వంసం చేశామని రష్యా ప్రకటించింది. ఇలా ప్రతీకార దాడులతో రెండు కూడా సామరస్యంగా ఆలోచించకుండా దాడులతోనే రెచ్చి పోతున్నాయి. అయితే ఫ్రాన్స్ లో జరిగిన జి-7 దేశాల సదస్సులో ఐరొపాకు చెందిన సభ్య దేశాలు ఉక్రెయిన్‌కు మద్దతు ప్రకటించాయి. అమెరికా అధ్యక్షులు ట్రంప్ సమక్షంలో ఈ ప్రకటన చేయడం గమనార్హం. ట్రంప్ ఆలోచన వేరేగా ఉంది యుద్ధాన్ని నివారించడానికి శాంతిపై మనసు పెడతామని ట్రంప్ ప్రకటించారు.



ట్రంప్ ఆరాటం అంతా రెండు దేశాలు శాంతి బాట పట్టాలి అనే తలంపుగా ఉంది. వాస్తవానికి ఇలా ప్రతీ కార దాడులతో నష్టం మనకే అనే విషయం రెండు దేశాలు గ్రహించక పోవడం శోచనీయం.

ఇంకా ఎన్నాళ్ళు ఈ దాడులు. నివరించలేని అమెరికా, ఇరాన్ యుద్ధమే శాంతితో ముగిసింది. ఇప్పుడు దృష్టి అంతా రష్యా, ఉక్రెయిన్ పైనే ఉంది. దీని నివారణకు ట్రంప్ ఆలోచనలో ఉన్నారు. మంచిదే యుద్ధం నివారణ జరగాలని విశ్వం ఎదురు చూస్తోంది. ఇక్కడ వచ్చిన చిక్కు ఏమిటంటే రష్యా పెద్ద దేశమై పోయింది. దానికి చెప్పాలంటే కొంచెం కష్టమే. అందుకే చిన్న దేశమైనా ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాలు అండగా నిలుస్తున్నాయి. అటువంటప్పుడు ఉక్రెయిన్‌కే ఈ ఐరోపా దేశాలు నచ్చజెప్పవచ్చు అనే మీమాంస ఎదురవుతోంది. చిన్న దేశమైనా ఉక్రెయిన్ దాడి చాలా భీతహంగా ఉంది. రాజీ చర్యలు ఉక్రెయిన్ నుంచే రావాలి అని రష్యా పట్టుదలగా ఉంది. ఇక్కడ యుద్ధం ఆగాలి అంటే ఉక్రెయిన్‌కే ఐ రోపా దేశాలు చెప్పాలి. ట్రంప్ కూడా ఉక్రెయిన్‌కే చెబితే యుద్ధం ఆగి పోయే అవకాశాలు ఉన్నాయి. ఒక వేళ ఉక్రెయిన్ రాజీకి ఇప్పుకుంటే దాని పునర్‌నిర్మాణానికి అంటే రష్యా దాడులతో నష్టపోయిన ప్రాంతాలను, కట్టాడాలను రష్యానే నిర్మాణం చేపట్టాలి. మరి ఉక్రెయిన్ దాడితో నష్టపోయిన రష్యాలోని కట్టడాలను ఎవరు పునర్ నిర్మిస్తారు అనే ప్రశ్న ఉదయస్తుంది. అదే పెద్ద సమస్యగా ఉంది. దీనికి ఒక కార్యాచరణ రూపొందించాలి. ప్రతీ కార దాడులతో నష్టాన్ని నివారించాలి. రెండు దేశాలకు ఆమోద యోగ్య మైన చర్యలు చేపడితే యుద్ధం నివారణ ఆగి పోగలదు.

**- కనుమ ఎల్లారెడ్డి**
9391523027

# ప్రతి శాఖ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

**ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్**
**ప్రతి శాఖకు వచ్చే ఆరు నెలల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి**
**గ్రామ సభలు, వార్డు సభల ద్వారా వచ్చిన దరఖాస్తుల స్థితిగతులపై సమగ్ర నివేదిక రూపొందించాలి**
**జిల్లా విజయగాథలు, వినూత్న కార్యక్రమాలు ప్రత్యేకంగా నమోదు చేయాలి**
**ఆరోగ్య రంగంలో టీబీ, ఎన్సీడీ కేసులపై నెలవారీ పురోగతి వివరాలు చూపించాలి**
**గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి**
**99 రోజుల కార్యక్రమం పురోగతి పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రత్యేక కార్యదర్శి**



జగిత్యాల, జూన్-22:( మనం ప్రతినిధి) జగిత్యాల జిల్లాలో ప్రతి శాఖ భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్తో కలిసి జిల్లా అధికారులతో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు పురోగతి పై ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల వారీగా 99 రోజుల కార్యక్రమాలపై నివేదికలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ₹ గ్రామ సభలు, వార్డు సభల ద్వారా ప్రజల నుంచి అందిన దరఖాస్తుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో గుర్తించిన వినూత్న కార్యక్రమాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని తెలిపారు. 99 రోజుల కార్యక్రమం పై రూపొందించే పుస్తకంలో జగిత్యాల జిల్లా విజయగాథలు, ఆవిష్కరణలు, వివిధ శాఖల విజయాలను సమగ్రంగా ప్రతిబింబించాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు ప్రభుత్వ విజయాలను తెలియజేసే మార్గదర్శకంగా ఉపయోగపడే విధంగా పుస్తకాన్ని ప్రత్యేకంగా రూపొందించాలని పేర్కొన్నారు. 99 రోజుల కార్యక్రమం అనంతరం ప్రతి శాఖకు సంబంధించిన తదుపరి ఆరు నెలల కార్యాచరణ ప్రణాళికను శాఖల వారీగా సిద్ధం చేయాలని తెలిపారు. విద్యా వారంలో చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి విద్యార్థుల ప్రస్తుత ప్రాథమిక స్థాయి, వచ్చే ఆరు నెలల్లో సాధించాల్సిన లక్ష్యాలను నిర్దిష్టంగా నిర్ణయించాలని సూచించారు. ప్రతి శాఖ సూక్ష్మ స్థాయిలో లక్ష్యాలను రూపొందించి ముఖ్యమంత్రి సమీక్ష సమావేశానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఆరోగ్య రంగంలో గుర్తించిన క్షయవ్యాధి (టీబీ), అంటువ్యాధులు కాని వ్యాధుల (ఎన్సీడీ) విషయంలో నెలనెలా సాధించిన పురోగతి వివరాలను స్పష్టంగా చూపించాలని తెలిపారు. గుర్తించిన కేసులు, చికిత్సలో వచ్చిన మెరుగుదలలను నివేదికల్లో ప్రతిబింబించాలని సూచించారు. వివిధ కార్యక్రమాలపై ప్రజల నుంచి ఫీడ్బ్యాక్ను సేకరించి అవసరమైన మెరుగుదలలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖలో పాఠశాల స్థాయిలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి రంగంలో గత సంవత్సరంతో పోల్చి ఈ ఏడాది ఎంత మేరకు వృద్ధి సాధించామో విశ్లేషించి నివేదికల్లో ప్రతిబింబించాలని తెలిపారు. యువత, విద్యార్థులను క్రీడల వైపు మరింత ప్రోత్సహించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామ, వార్డు స్థాయిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుత పరిస్థితులు, క్షేత్రస్థాయిలో పరిష్కరించిన సమస్యలను శాఖల వారీగా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్య కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులను జూన్ 30లోపు పూర్తిగా వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రైతు బోనస్ పొందిన రైతుల వివరాలు, వారికి కలిగిన ప్రయోజనాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ దరఖాస్తులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. రైతులకు యూరియా వినియోగాన్ని తగ్గించడం, పంటల వైవిధ్యీకరణ, ఆయిల్ పామ్ సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ భూముల్లో పంట అవశేషాలకు నిప్పంటించే ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యారంగంలో జగిత్యాల జిల్లా అద్భుతమైన ఫలితాలు సాధించిందని, ఇందుకు సంబంధిత అధికారులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాల తరహాలోనే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగేలా కృషి చేయాలని సూచించారు. కొత్త అడ్మిషన్లన్నీ ఆన్లైన్ ద్వారా పూర్తిచేయాలని, మధ్యాహ్న భోజన నాణ్యతను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో కమిటీల వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అల్పాహార పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.విద్యాశాఖలో జగిత్యాల జిల్లా రాష్ట్రస్థాయిలో 17వ స్థానం నుంచి 4వ స్థానానికి చేరుకుందని తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో 500 మంది విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించారని, 150 మంది విద్యార్థులు ఐ.ఐ.ఐ.టీ.లలో ప్రవేశాలు పొందినట్లు వెల్లడించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 65 వేల మంది విద్యార్థుల ప్రభుత్వ పాఠశాలల ప్రవేశాల లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా అదనపు ఎస్పీ చేతన్ నితిన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్, సి.పి.వో సత్యం , జెడ్పి సిఈవో గౌతమ్ రెడ్డి, డి.ఆర్.డి.వో రఘువరన్,జిల్లా వైద్య శాఖ అధికారిణి సుజాత,డి.పి.వో మదన్ మోహన్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి రాజ్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భాస్కర్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు



సుల్తానాబాద్, జూన్ 22 (మనం న్యూస్): సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13, 14, 15 వార్డులకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు చొప్పరి శ్రీను, ఉస్తం లక్ష్మీనారాయణ, ముదిరాజ్ సంఘం కార్యదర్శి కంకణాల సతీష్, కంకణాల శ్రీనివాస్, కలవేణి శంకర్, కంకణాల రాకేష్, బొజ్జ రాజు, బండి రాజు కుమార్, చొప్పరి సంతు, సాయి తదితరులతో పాటు మొత్తం 25 మంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణరావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పద్మ అబ్బాయి గౌడ్, సిద్ధ తిరుపతి, గదాసు మంజూల రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన ఎస్పీ

జగిత్యాల, జూన్ 22(మనం న్యూస్): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కువమార్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 17 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.



# నకిలీ విత్తనాలపై నిఘా పెట్టాలి



- **రైతులకు, వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా చూసుకోవాలి**
- **ఈదురుగాలుల పట్ల విద్యుత్ శాఖ వారు అప్రమత్తంగా ఉండాలి**
- **రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలి**
- **ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**

పెద్దపల్లి జూన్ 22 (మనం ప్రతినిధి)ః పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో మరియు జిల్లా సహకార అధికారి అలాగే ప్రాథమిక సహకార సంఘాల కార్యదర్శులతో వానాకాలం సీజన్ పట్ల ముందస్తుగా సమీక్షా సమావేశం నిర్వహించారు ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ విప్ విజయరమణ రావు మాట్లాడుతూ.. వానాకాలన్నీ దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ శాఖ అధికారులు మరియు విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజయరమణ రావు సూచించారు. నియోజకవర్గంలో అవసరమైన కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అలాగే వానకాలంలో ఈదురు గాలుల ప్రభావం ఎక్కువగా ఉంటాయని వాటిని దృష్టిలో ఉంచుకొని రైతులకు, వినియోగదారులకు ఎలాంటి అంతరాయాలు లేకుండా చూసుకోవాలి తెలిపారు. పెద్దపల్లి ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నూతనంగా నిర్మాణం చేపడుతున్న బైపాస్ రోడ్డు లో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటిని సురక్షితమైన, అనువైన ప్రదేశాల్లోకి మార్చాలని విద్యుత్ అధికారులను ఆదేశించడం జరిగింది. క్షేత్రస్థాయిలో విద్యుత్ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని నియోజకవర్గంలో ఎలెక్ట్రిక్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచనలు చేశారు. వానాకాలం సీజన్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు మరియు విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ప్రభుత్వ విప్ విజయరమణ రావు సూచనలు చేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కార్యదర్శులు అందరూ ముందస్తు ప్రణాళికలతో వ్యవహరించి రైతన్నలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మార్కెట్లో నకిలీ విత్తనాలపై నిఘా ఉంచి వాటి అమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ఏ ఒక్క రైతు కూడా నకిలీ విత్తనాల బారిన పడకుండా చూసుకోవాలని ఆదేశించారు. విత్తనాలు అనేవి నిబంధనలకు అనుగుణంగా సజావుగా అమ్మకాలు సాగేలా చర్యలు తీసుకోవాలని అలాగే రైతులు కేంద్రాల వద్ద ఇబ్బంది పడకుండా డిజిటల్ ఎంట్రీలు, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డిసివో శ్రీమాల కి విజయరమణ రావు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి శ్రీమాల, విద్యుత్ శాఖ ఎస్.ఈ గంగాధర్ డి.ఈ రాజబ్రహ్మ చారి, , ఎ.ఈ లు, ఎ.డి.ఈ లు, పాక్స్ కార్యదర్శులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధిక నిధులు




- **మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

జగిత్యాల / పెగడపల్లి, జూన్ 22 ( మనం ప్రతినిధి ): ధర్మపురి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 68 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి (ఇఋఊ) చెక్కులు, 9 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు సేవ చేయడం తన ప్రధాన బాధ్యత అని అన్నారు. పేద ప్రజల జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబం కలగంటున్న సొంతింటి స్వప్నాన్ని సాకారం చేయడమే తన లక్ష్యమని, అందులో భాగంగా అర్హులైన నిరుపేదలకు జూలై నెల నాటికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం పెగడపల్లి మండలానికి రూ.2.51 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. ఈ నిధులతో గ్రామాల మధ్య రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని చెప్పారు. అదేవిధంగా, మండల వ్యాప్తంగా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని, రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చేసి వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సాగునీటి వసతుల విస్తరణతో పెగడపల్లి మండలాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి




- **అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్**

జగిత్యాల, జూన్ 22 (మనం ప్రతినిధి): ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత అదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ తో కలిసి ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 113 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇదివరకు ప్రజావాణి లో వచ్చిన 182 పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని లేని యెడల సంబంధిత జిల్లా అధికారిని బాధ్యునిగా చేస్తూ మెమో జారీ చేయబడునని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రెవెన్యూ అధికారి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యానికి తావివ్వొద్దు

**ప్రతి దరఖాస్తుకు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలి**
**అవినీతి, ఉద్దేశపూర్వక జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదు**
**ఫీల్ సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి**
**99 రోజుల ప్రగతి కార్యక్రమ వివరాలను నాణ్యతతో సమర్పించాలి**
**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి, జూన్ 22 (మనం ప్రతినిధి) ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ,అదనపు కలెక్టర్లు జే. అరుణ శ్రీ, కొప్పుల వెంకట్ రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో పరిపాలనా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులు, వినతిపత్రాల పరిష్కారం పై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని, ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించి తప్పనిసరిగా సమాధానం అందించాలని ఆదేశించారు. పారదర్శకత, జవాబుదారీతనం ప్రతి అధికారిలో ఉండాలని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద వచ్చే దరఖాస్తులకు కూడా నిర్ణీత సమయంలో సమాధానాలు అందించాలని సూచించారు.జిల్లా పరిపాలనలోని అధికారులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరు కావాలని, అన్ని శాఖలు తమ పరిధిలోని ఫీల్ సిబ్బంది హాజరు, పని తీరును నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా ప్రజలకు అందేలా శాఖాధిపతులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.కొన్ని శాఖల్లో ఫైళ్ల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శాఖాధికారి తమ శాఖలో పెండింగ్లో ఉన్న ఫైళ్లను క్రమం తప్పకుండా సమీక్షించి, ఉద్దేశపూర్వక జాప్యాలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు.కొంతమంది ఫీల్ సిబ్బంది లంచాలు డిమాండ్ చేస్తున్నారన్న ఫిర్యాదులు తన దృష్టికి వచ్చాయని, అవినీతిని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని సూచించారు.అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్, హానరేరియం సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని, సంబంధిత శాఖలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కార్యాలయ భవనాల నిర్వహణతో పాటు కార్యాలయ ఆవరణ, ముందుభాగంలోని ఖాళీ స్థలాలను కూడా పరిశుభ్రంగా ఉంచడం సంబంధిత శాఖల బాధ్యతేనని తెలిపారు.త్వరలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు తమకు సంబంధించిన వివరాలను సంక్షిప్తంగా, నాణ్యతతో కూడిన సమాచారంగా సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. సమర్పించే నివేదికలు వాస్తవాధారితంగా, సమగ్రంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, జిల్లా స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

# జూలై 6 వరకు అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ



- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

పెద్దపల్లి, జూన్ 22 (మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఐసీడీఎస్ రామగుండం ప్రాజెక్టులో 4 పోస్టులు, ఐసీడీఎస్ పెద్దపల్లి ప్రాజెక్టులో 17 పోస్టులు, ఐసీడీఎస్ మంథని ప్రాజెక్టులో 43 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఈ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు పూర్తిగా ఆన్లైన్ విధానంలో మాత్రమే స్వీకరించబడతాయని తెలిపారు. https://mis.tgwdcw.nic.in వెబ్సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తులు సమర్పించాలని, జూలై 6, 2026 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని వెల్లడించారు. అభ్యర్థులు సంబంధిత అంగన్వాడీ కేంద్రం ఉన్న గ్రామం లేదా మున్సిపల్ వార్డుకు చెందిన స్థానిక మహిళలై ఉండాలని, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. 01-07-2026 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయబడతాయని పేర్కొన్నారు.వినికిడి యంత్రాల సహాయంతో వినగలిగే హెచ్చెచ్ (ఏ్చటఛీజ ఏ్ఛ్చీజీఛ్గిఇఋఛీ) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఎస్ఎస్సీ మెమో (వయస్సు ధృవీకరణ పత్రం), జనన ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం, ఇంటర్మీడియట్ సర్టిఫికేట్, దివ్యాంగుల సదరం సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, అనాథ ధృవీకరణ పత్రం తదితర పత్రాలను జతపరచాలని సూచించారు.ప్రజావాణి లేదా కార్యాలయాల్లో నేరుగా సమర్పించిన దరఖాస్తులు స్వీకరించబడవని, ఆన్లైన్లో సమర్పించిన దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే ఈ నియామక ప్రక్రియను ఏ దశలోనైనా రద్దు చేసే అధికారం జిల్లా కలెక్టర్కు ఉంటుందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యుత్ ఉద్యోగులపై నిరాధార ఆరోపణలు సరికావు

- **విద్యుత్ శాఖ ఏ డి ఈ జవహర్లాల్ నాయక్**

జగిత్యాల, జూన్ 22 (మనం న్యూస్) జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఓ విద్యుత్ వినియోగదారు గత కొంతకాలంగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు విజిలెన్స్ విభాగం అధికారులు నిర్వహించిన తనిఖీల సందర్భంగా సంబంధిత వినియోగదారుడి విద్యుత్ సర్వీస్ కనెక్షన్ను నిలిపివేశారు. అయితే, ఈ చర్యకు జగిత్యాల ఏడీఈ జవహర్లాల్ నాయక్ వ్యక్తిగతంగా కారణమంటూ కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఏడీఈ జవహర్లాల్ నాయక్ స్పష్టం చేశారు. విధి నిర్వహణలో భాగంగా తీసుకునే అధికారిక చర్యలను వ్యక్తిగత కోణంలో చిత్రీకరించడం బాధాకరమని వారు పేర్కొన్నారు. ఇలాంటి నిరాధార ఆరోపణలు క్షేత్రస్థాయిలో పనిచేసే విద్యుత్ ఉద్యోగుల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతరం విద్యుత్ సేవలు అందించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ఉద్యోగుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అసత్య ప్రచారాలతో ఉద్యోగుల ప్రతిష్ఠను దెబ్బతీయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు.

# భారతదేశపు అతిపెద్ద ప్రపంచ వేదికగా బిల్డ్‌కాన్



**హైదరాబాద్ , జూన్ 22(మనంన్యూస్):** భవన నిర్మాణ సామగ్రి, నిర్మాణం మరియు మౌలిక సదుపాయాల రంగాల కోసం భారతదేశపు ప్రధాన ప్రదర్శన అయిన భారత్ బిల్డ్‌కాన్2026, ప్రపంచ తయారీ మరియు సోర్సింగ్ కేంద్రంగా భారతదేశపు స్థానాన్ని పునరుద్ఘాటిస్తూ, న్యూఢిల్లీలోని యశోభూమిలో విజయవంతంగా ముగిసింది. ఈ నాలుగు రోజుల కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా 40,000 మందికి పైగా సందర్శకులు, ప్రతినిధులు మరియు కొనుగోలుదారులు పాల్గొని, భారతీయ తయారీదారులు మరియు సరఫరాదారులకు అపూర్వమైన వ్యాపార అవకాశాలను సృష్టించారు. భారతదేశవ్యాప్తంగా 30కి పైగా దేశాలు మరియు 100కు పైగా నగరాల నుండి ప్రతినిధులు పాల్గొనడంతో, భారత్ బిల్డ్కాన్ 2026 భవన నిర్మాణ సామగ్రి పర్యావరణ వ్యవస్థకు దేశపు 'ఒకే దేశం, ఒకే ఎక్స్పో' వేదికగా నిలవాలన్న తన దార్శనికతను విజయవంతంగా నెరవేర్చింది. ఈ ప్రదర్శన, ఈవెంట్ సందర్భంగా 400 కోట్లకు పైగా విలువైన వ్యాపార లావాదేవీలను సులభతరం చేసింది మరియు 8,000కు పైగా అధిక సామర్థ్యం గల వ్యాపార అవకాశాలను సృష్టించింది. వీటిలో చాలా వరకు రాబోయే నెలల్లో గణనీయమైన వాణిజ్య భాగస్వామ్యాలుగా మారే అవకాశం ఉంది. తయారీదారులు, ఎగుమతిదారులు, ఆర్కిటెక్టులు, బిల్డర్లు, డెవలపర్లు, కాంట్రాక్టర్లు, పంపిణీదారులు, రిటైలర్లు మరియు ప్రపంచ కొనుగోలుదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా, భారత్ బిల్డ్కాన్ 2026 భారతీయ వ్యాపారాలను దేశీయ మరియు అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే ఒక ప్రత్యేకమైన మార్కెట్ను సృష్టించింది. ఈ ఈవెంట్ సిరామిక్స్, శానిటరీవేర్, టైల్స్, సహజ రాయి, లామినేట్లు, పెయింట్లు, హార్డ్వేర్, నిర్మాణ సామగ్రి మరియు అనుబంధ రంగాలలో భారతదేశపు తయారీ సామర్థ్యాలను ప్రదర్శించింది. ఈ ఎడిషన్లో ఒక ప్రధాన ఆకర్షణ బలమైన అంతర్జాతీయ భాగస్వామ్యం. ఇది భారతీయ కంపెనీలకు-ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు మరియు వర్ధమాన తయారీదారులకు-ప్రపంచ మార్కెట్లకు ప్రత్యక్ష ప్రాప్యతను అందించింది. ఈ ఎక్స్పో భారతీయ బ్రాండ్లకు పలు దేశాలకు చెందిన కొనుగోలుదారులు, పంపిణీదారులు మరియు సోర్సింగ్ భాగస్వాములతో సమేకమయ్యేందుకు వీలు కల్పించింది. తద్వారా వారు ఎగుమతి అవకాశాలను అన్వేషించి, తమ అంతర్జాతీయ ఉనికిని బలోపేతం చేసుకోవడానికి సహాయపడింది. ఈ కార్యక్రమ విజయంపై భారత్ బిల్డ్కాన్ డైరెక్టర్ శ్రీ విశాల్ ఆచార్య మాట్లాడుతూ, 'భారత్ బిల్డ్కాన్ 2026 విజయం కేవలం ప్రదర్శన ద్వారా జరిగిన వ్యాపారానికే పరిమితం కాలేదు. పారిశ్రామిక నాయకులు, ప్రభుత్వ విభాగాలు మరియు ప్రపంచవ్యాప్త కొనుగోలుదారులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ ఎడిషన్ యొక్క అత్యంత ముఖ్యమైన విజయాలలో ఒకటి. సెంట్రల్ పబ్లిక్ వరక్స్ డిపార్ట్మెంట్ (ఇగ్ని), గవర్నమెంట్ ఇ-మార్కెట్ప్లేస్ (ఎ్ఫు), వాణిజ్య శాఖ, గృహ మరియు పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, మరియు వివిధ ఖిఉ భాగస్వాముల వంటి కీలక సంస్థలు మరియు విభాగాల చురుకైన భాగస్వామ్యం సహకారం, జ్ఞాన మార్పిడి మరియు వ్యాపార వృద్ధికి అర్థవంతమైన అవకాశాలను కల్పించింది. వరుస సంభాషణలు మరియు చర్చల ద్వారా, భారతీయ తయారీదారులు ప్రభుత్వ సేకరణ కార్యక్రమాలు, ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాలు, నాణ్యతా ప్రమాణాలు మరియు మార్కెట్ ప్రవేశ అవకాశాలపై విలువైన అంతర్ద ృష్టులను పొందారు.


## తొలిసారిగా లేజర్ పద్ధతిలో అర్షమొలల శస్త్రచికిత్సలు





**పెద్దపల్లి, జూన్ 22 (మనం ప్రతినిధి):** పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అర్షమొలల (పైల్స్) చికిత్సలో మరో ముందడుగు పడింది. ఈ రోజు ఆసుపత్రిలో తొలిసారిగా లేజర్ పద్ధతి ద్వారా అర్షమొలల శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించబడింది. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ పైల్స్ ఆపరేషన్లు ఇప్పటికే నిర్వహించబడుతున్నప్పటికీ, లేజర్ విధానంలో శస్త్రచికిత్స చేపట్టడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ ఆధునిక చికిత్సా విధానంలో కోతలు, కుట్లు అవసరం లేకపోవడంతో పాటు నొప్పి కూడా తక్కువగా ఉంటుంది. శస్త్రచికిత్స అనంతరం రోగులు తక్కువ సమయంలోనే కోలుకొని, రెండు రోజుల వ్యవధిలో తమ సాధారణ కార్యకలాపాలను నిర్వహించ గలుగుతారు. ఇలాంటి లేజర్ శస్త్రచికిత్సలు సాధారణంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉండగా, ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సేవలను అందించడం అరుదైన విషయమని వైద్యులు పేర్కొన్నారు. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నిరంతరం అభివృద్ధి చెందుతోందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో ఈ స్థాయి వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడానికి కృషి చేసిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కి, అలాగే జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీహర్ష, ఐఏఎస్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.అదేవిధంగా, పెద్దపల్లి జిల్లా ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న ఆధునిక వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## ప్రతిభ కనబర్చిన విద్యార్థికి నగదు పురస్కారం



**ములుగు, జూన్ 22(మనంన్యూస్):** క్షీరసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2026 సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల కు కేఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ వారు కొన్యాల ఉమ నరసింహ రెడ్డి , టీంకేఎన్ఆర్ , అంబేత్కర్ యూత్ వారు ఫస్ట్ ర్యాంక్ వచ్చిన కుందన పల్లి సిరి సన్మానం చేసి మెమొంట్ మరియు నగదు బహుమానం అందజేశారు. ఫస్ట్ వచ్చిన ఐదు గురు విద్యార్థులు కూడ. నగదు మరియు మెమొంటో ఇవ్వడం జరిగింది బావిషత్ లో ఇంకా విద్యార్థులకి ప్రోత్సాహం అందిస్తాము అని చెప్పారు

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఫిర్యాదుల కంప్యూటరీకరణ

- **జిల్లా వ్యాప్తంగా 19 వేల ఫిర్యాదులు అందాయి**
- **ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరగ వద్దు**
- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్**

**సిద్దిపేట జూన్ 22; మనం ప్రతినిధి:** జిల్లాలో వార్డు, గ్రామ, మండల స్థాయి సభల ద్వారా సుమారు 19 వేల ఫిర్యాదులను సేకరించడం జరిగిందని ప్రత్యేక టైం బాండ్ తో ప్రణాళిక బద్ధంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపట్టడం జరుగుతుందని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్ పేర్కొన్నారు. స్థానికంగా పరిష్కరించే అవకాశం ఉన్నవాటిని అప్పటికప్పుడు పరిష్కరించడం జరిగిందని పై స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలకు ఉన్నతాధికారులకు అందజేయడం జరిగిందని వాటిని అన్ని విధాల పరిశీలించి పరిష్కార మార్గాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు కోసం 90% దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులను ఇప్పటికే సగానికి పైగా కంప్యూటరీకరుణ చేయడం జరిగిందని మిగతావి కూడా ఫ్రూట్ ని చేసి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి రూపొందించి విజయవంతంగా



అమలు చేస్తున్నారని ఈ కార్యక్రమాల్లో అందిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించడానికి ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షించడం జరిపిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కే హైమావతి మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. అంతకుముందు వివిధ శాఖలు ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన, నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో సిపి సాధన రష్మీ పెరుమాళ్ వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల ప్రాణం అంటే అంత అలుసా

- **రోడ్డుపైనే ఇష్టారాజ్యంగా బస్సుల పార్కింగ్**
- **ఓ పక్క ఆటోలు మరో ఒక పక్క ట్రాఫిక్**
- **ట్రాఫిక్ సిఐ ఆజ్ఞలు కూడా భేకతార్**



**గజ్వేల్, జూన్ 22 మనం న్యూస్:** గజ్వేల్ పట్టణంలో ఆర్టీసీ బస్సులు అడ్డదిడ్డంగా రోడ్డుపైన పార్కు చేయడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందిగా మారుతుందని వాహనదారులు,పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితమే బస్టాండ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినప్పటికీ బస్ స్టాండ్ లోకి బస్సులు వెళ్లకుండా రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడంతో రోడ్డు దాటాలంటే ఇబ్బందిగా మారిపోయిందని ఎంతోమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరే కాకుండా ఆ చుట్టుపక్కల ఉండే దుకాణదారులు కూడా ఎంతో అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు ఎన్నిసార్లు బస్సులను ఇక్కడ పార్కు చేయొద్దని వారు తెలిపినప్పటికీ కూడా రోడ్డుకు రెండు పక్కల వాహనాలను పార్కు చేస్తున్నారు అని ఆరోపిస్తున్నారు. గజ్వేల్ పట్టణంలో ఉన్న ఏకైక బస్సు డిపో అయినా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోను చూస్తున్నటువంటి డిపో మేనేజర్ ఇది కనపడ్డా కూడా కనపడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజల నుండి ఆరోపణ విల్లవిస్తున్నాయి. ప్రతిరోజు ఇందిరా పార్క్ చౌరస్తా నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ఏదో ఒక స్థలంలో ఈ బస్సుల అడ్డదిడ్డంగా పార్కు చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్న కూడా దీనిని డిపో మేనేజర్ కానీ డిపో అధికారులు కానీ పట్టించుకోకపోవడం శోచనీయం. దీనితోపాటుగా ఆటోలు కూడా ఇక్కడ పడితే అక్కడ పార్కు చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారుతుంది. గతంలో బస్సు డిపో మేనేజర్లు ఒక అధికారిని నియమించి బస్సులను సక్రమంగా నిలిపి ఉండేలా చూసేవారు కానీ ప్రస్తుతం ఉన్న బస్సు డిపో మేనేజర్ దానిని పట్టించుకోకుండా గాలికి వదిలేస్తున్నారని పలువురు అంటున్నారు.

### స్పందించిన ట్రాఫిక్ సిఐ

మనం దినపత్రికలో బస్సులు అడ్డదిడ్డంగా పార్కు చేయడం రోడ్డుకు ఇరువైపులా నిలవడంతో ఎంతో ఇబ్బంది కలుగుతుందని మనం దినపత్రికలో రావడంతో వెంటనే స్పందించి ప్రతిరోజు ఉదయం సాయంకాలం ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి పాఠశాల, కళాశాల పిల్లలకు, పెద్దవారికి ఇబ్బంది కలగకుండా చూస్తున్నారు. ఈ విషయమై స్థానిక డిపో మేనేజర్ కు సమాచారం అందించినప్పటికీ కూడా స్పందించకపోవడం బాధాకరమని ట్రాఫిక్ సిఐ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపైన బస్సులను పార్కు చేసినట్లయితే జరిమానా విధిస్తానని తెలిపినప్పటికీ కూడా స్పందించకపోవడం ఎంతవరకు సమంజసమో ఆలోచించదగ్గ విషయం. ఇప్పటికైనా డిపో మేనేజర్ వెంటనే స్పందించి ఒక అధికారిని ఏర్పాటు చేసి ట్రాఫిక్కు ఇబ్బంది కలగకుండా బస్సులను బస్టాండ్లో నిలిపే విధంగా చేయాలని పలువురు డిపో మేనేజర్ ను కోరుతున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్లో ఉంచరాదు



- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, జూన్ 22(మనం బ్యూరో):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల ను ఫైల్ ట్రాకింగ్ చేస్తున్నామని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కారించడానికి అన్ని చర్యలుతీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్ర మీశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 192 మంది అర్జీదారులు ప్రజావాణిలో దరఖాస్తులు సమర్పించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. త్వరితగతిన దరఖాస్తులు పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులు క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ వారిగా ఆన్లైన్లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలిస్తున్నామని చెప్పారు. శాఖల వారీగా దరఖాస్తుల సంఖ్య, పెండింగ్ దరఖాస్తులను సమీక్షించారు. ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. ప్రజావాణిలో అశ్విని తానాజీ వాకడే, డిఆర్ఓ స్వామి ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాల సమస్యలు పరిష్కరించండి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ను కలిసిన ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు



**సంగారెడ్డి జూన్ 22 మనం న్యూస్ ప్రతినిధి :** సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్రావు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, రైతు సమస్యలు, తాగునీటి సౌకర్యం, రోడ్లు, విద్యా సంస్థలు, గ్రామీణ మౌలిక వసతులు తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సదాశివపేట మండలం బొబ్బిలిగామ గ్రామ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుందని, అలాగే పాఠశాల భవన గోడలు దెబ్బతినడంతో కరెంట్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరడంతో పాటు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ డి ఎఫ్ కింద రూ.5 కోట్లతో నియోజకవర్గ పరిధిలోని రెండు పట్టణాలు, నాలుగు మండలాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనల పురోగతిని కలెక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. మల్కాపూర్ గ్రామంలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి నంబర్లు జారీ చేసిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కంది మండలం ఉత్తర్పల్లి గ్రామ పరిధిలో పణ్యాల నాగరాజు ఫీల్ నుంచి చిట్యాల అఖిల్ ఫీల్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.23 లక్షల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. సూరారం గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలో నిర్మించిన మరుగుదొడ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరగా, జిల్లాలోని పెండింగ్ బిల్లుల వివరాలను పరిశీలించి చెల్లింపులు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గిర్మాపూర్ గ్రామంలో రీజినల్ రింగ్ రోడ్డు భూ బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో బయోమెట్రిక్ విధానాన్ని సడలించాలని ఎమ్మెల్యే కోరారు. అధిక వయస్సు కలిగిన రైతులకు వేలిముద్రలు సరిగా నమోదు కాకపోవడంతో నష్టపరిహారం చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయని వివరించారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా బీఎల్ఓలు పట్టణ ప్రాంతాల్లో డోర్ టు డోర్ సర్వే సక్రమంగా నిర్వహించడం లేదని, బీఎల్ఏలకు సరైన సమాచారం అందడం లేదని, దీంతో నివేదికల్లో పొరపాట్లు జరిగే అవకాశం ఉందని కలెక్టర్కు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు. 2026-27 సంవత్సరానికి రూ.1.98 కోట్లతో బోర్వెల్ పనులకు అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కోరారు. అదేవిధంగా జహీరాబాద్ నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాణిక్రావు కలెక్టర్ను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## కంగ్టీ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



**సంగారెడ్డి జూన్ 22 మనం న్యూస్ ప్రతినిధి:** కంగ్టీ పోలీసు స్టేషన్ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల శుభ్రత, సిబ్బంది బ్యారక్, స్టేషన్ రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల స్థితిగతులను పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్లో ఉన్న కేసులను సమీక్షించిన ఎస్పీ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచాలన్నారు. వివిధ రకాల ఆర్థిక, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మూఢనమ్మకాలపై ప్రజలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఎస్హెచ్ఓకు సూచించారు. రాష్ట్ర సరిహద్దుల గుండా ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, చెక్పోస్టుల నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, కేడీలు, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, పగలు-రాత్రి బీట్ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. పోలీసు స్టేషన్కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓపికగా విని తగిన పరిష్కారం చూపడంతో పాటు వారికి భరోసా కల్పించాలని సూచించారు. ఈ తనిఖీలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టీ సీఐ వెంకట్ రెడ్డి, ఎస్హెచ్ఓ దుర్గారెడ్డి తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## తెలంగాణ గుండె చప్పుడు ప్రొ. జయశంకర్‘




**హైదరాబాద్, జూన్ 22 న్యూస్:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శకుడు ప్రొ. కె. జయ శంకర్ వర్ధంతి సందర్భంగా గాంధీ ఆసుపత్రి, గాంధీ వైద్య కళాశాల వైద్యులు, ఉద్యోగ బృందం పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం డా. రాజ్కుమార్ జాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ సిద్ధాంత రూపకర్త, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన త్యాగమూర్తి 'ప్రొఫెసర్ జయశంకర్ సార్' తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం, స్వయంపాలన కోసం నిరంతరం పోరాడారని తెలిపారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, త్యాగాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని, ముఖ్యంగా తెలంగాణ బిడ్డలకు నీళ్ళు , నిధులు, ఉద్యోగాలలో జరుగుతున్న అన్యాయాలపై నిత్యం గళం వినిపిస్తూ, ధైర్యంగా ప్రశ్నిస్తూ, ప్రజలను చైత్యం చేస్తూ, తెలంగాణ ఆకాంక్షలకు స్వరంగా నిలిచిన మహోన్నత వ్యక్తి జయ శంకర్ సార్ అని అన్నారు. తను చూపిన మార్గంలో నడవడం, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అని అన్నారు. అటువంటి గొప్ప మహనీయుడు తెలంగాణ నేలపై జన్మించడం మనందరి అదృష్టమని పేర్కొంటూ, ఆయన అమూల్యమైన సేవలను స్మరించుకుంటూ శతకోటి వందనాలు తెలియజేశారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- **యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




**సంగారెడ్డి, జూన్ 22 మనం న్యూస్ ప్రతినిధి:** మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా వ్యవహ రించాలని, ముఖ్యంగా యువత డ్రగ్స్ మరియు ఇతర వ్యసనాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును సురక్షితంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ ప్రతీక్ జైన్ నషా ముక్త్ భారత్ అభియాన్ - వికసిత్ భారత్ కి పహచాన్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజం మరియు దేశ అభివృద్ధికి కూడా తీవ్ర ముప్పుగా మారుతుందని అన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. జూన్ 17 నుండి జూన్ 26 వరకు నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ సప్తాహ్ - 2026 ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి సకాలంలో సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 14446 నేషనల్ డీ-అడిక్షన్ హెల్ప్లైన్ సేవలను అందుబాటులో ఉంచిందని, అవసరమైన వారు ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. లలితా దేవి, డీఆర్డీఓ జ్యోతి, జిల్లా పరిషత్ సీఈఓ జానకి రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ ప్రజా ప్రభుత్వ సంక్షేమం



## పదేళ్ల గత పాలకుల నిర్లక్ష్యానికి చెక్..
## ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు అండ
## మహిళా సాధికారతకు కాంగ్రెస్ పెద్దపీట..
## 30 నెలల్లో రూ. 67 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ
## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం, జూన్ 22 (మనం.బ్యూరో): రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న విప్లవాత్మక సంక్షేమ పథకాల లబ్ధి ప్రతి ఇంటికీ చేరుతోందని, ఈ అద్భుత ప్రగతిని మహిళా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కాంగ్రెస్ సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా లోకానికి సమాన అవకాశాలు కల్పించడంతో పాటు, వారిని ఆర్థికంగా, రాజకీయంగా బలోపేతం చేయడమే ధ్యేయంగా ఇందిరమ్మ రాజ్యం పనిచేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

గత పాలకుల పదేళ్ల నిరంకుశ పాలనలో పేద ప్రజలు ఇళ్ల కోసం ఎదురుచూసి అలసిపోయారని భట్టి విక్రమార్క విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి పేదవానికి ఇల్లు కట్టుకునేందుకు ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందిస్తోందని గుర్తుచేశారు. 'గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిన ఘనత మా ప్రభుత్వానిదే. ఈ ఏడాది కూడా నియోజకవర్గానికి 2,000 చొప్పున ఇళ్లు కేటాయించాం. ఇంకా ఎవరైనా అర్హులు ఉండి ఇళ్లు రాకుంటే మా దృష్టికి తీసుకురండి, వారికి తప్పకుండా మంజూరు చేస్తాం' అని హామీ ఇచ్చారు. పేద పిల్లల ఉన్నత చదువుల కోసం ఫీజు రీఇంబర్స్మెంట్ను పకడ్బందీగా అమలు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కింద వంద రోజుల పని కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు వివరించారు. రాబోయే రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. పేద కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే వైద్యం కోసం ఇల్లు, భూమి, బంగారం అమ్ముకునే దుస్థితి రాకూడదనే ఉద్దేశంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని ఏకంగా రూ.10 లక్షలకు పెంచామని డిప్యూటీ సీఎం తెలిపారు. దీని ద్వారా పేదలకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా మెరుగైన వైద్యం అందుతోందన్నారు.

మహిళల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని కొనియాడారు. ఐదేళ్లలో డ్వాక్రా మహిళలకు లక్ష కోట్ల రూపాయల రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, కేవలం రెండున్నర ఏళ్లలోనే రూ.67,000 కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని వెల్లడించారు. వడ్డీ లేని రుణ పరిమితిని సైతం రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా.. స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేయించి, మహిళలనే ఆ బస్సులకు యజమానులను చేసిన ఘనత మన ప్రజా ప్రభుత్వానికే దక్కుతుంది' అని గర్వంగా ప్రకటించారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు, మరియు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నిర్వహణలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వివరించారు.

మిగతా పార్టీలలాగా కాంగ్రెస్ ఉపన్యాసాలకే పరిమితం కాదని, మహిళలకు రాజకీయంగా అత్యున్నత అవకాశాలు కల్పించిన చరిత్ర తమదేనని గుర్తుచేశారు. దేశానికి ఇందిరా గాంధీని ప్రధానిగా, సోనియా గాంధీని యూపీఏ చైర్పర్సన్గా, దేశ రాజధాని ఢిల్లీకి షీలా దీక్షిత్ను ముఖ్యమంత్రిగా చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కొనియాడారు. సమాజంలో సగభాగమైన మహిళల అభ్యున్నతి కోసమే కాంగ్రెస్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మహిళా నాయకురాళ్లు నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు. గత పదేళ్లుగా పార్టీ కోసం రోడ్లపైకి వచ్చి, ధర్నాలు, ఉద్యమాలు చేసిన ప్రతి ఒక్క మహిళా నాయకురాలికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కష్టపడిన వారి వివరాలు జిల్లాల వారీగా తమ వద్ద ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు అందరికీ సముచిత గౌరవం, పదవులు దక్కేలా చూసే బాధ్యతను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, నేను (ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క) తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అలాగే, ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో మహిళలు చురుగ్గా పాల్గొని, అర్హుల ఓట్లు పోకుండా చూడాలని కోరారు. పార్టీ వ్యవస్థ మరింత బలోపేతం కావడానికి ప్రతి బూత్ లెవెల్ కమిటీలోనూ మహిళలకు కీలక ప్రాధాన్యత కల్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా అధ్యక్షులు దొబ్బల సౌజన్య, శాసనసభ్యులు రామదాస్ నాయక్, డిసిసి అధ్యక్షులు నూతి సత్యనారాయణ, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యం,, పువాళ్ళ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---

## బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పైడి, దొడ్డాకుల రాజేశ్వరరావు



దమ్మపేట, జూన్ 22(మనం న్యూస్): అశ్వారావుపేట నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీలో కీలక నేతలుగా ఉన్న దమ్మపేట మండలానికి చెందిన దమ్మపేట మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వరరావు,దొడ్డకుల. రాజేశ్వరరావు,సోమవారం బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. వారిద్దరూ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు.దమ్మపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దొడ్డ రమేష్,,కి లేఖ ద్వారా వారి రాజీనామా పత్రాన్ని పంపారు. వీరిద్దరూ మండలంలో బలమైన నాయకులుగా ఉన్నారు. మండల క్రియాశీలక రాజకీయాల్లో పైడి వెంకటేశ్వరరావు,తనదైన ముద్ర వేసుకున్నారు.గత 40 సంవత్సరాలు నుండి.పైడి వెంకటేశ్వరరావు,పార్టీ పరంగా ప్రభుత్వ పరంగా పదవులు ద్వారా దమ్మపేట మండల ప్రజలకు దగ్గరగా ఉన్నారు.అలాగే దొడ్డాకుల రాజేశ్వరరావు,కూడా దమ్మపేట మండలంలో బలమైన నాయకుడుగా గుర్తింపు పొందారు. ఆయన కూడా ప్రభుత్వపరంగా పార్టీ పరంగా ఆయనకు వచ్చిన అవకాశాన్ని మండల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు.వీరిద్దరూ రాజీనామా ను ధ్రువీకరించారు. బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన పైడి వెంకటేశ్వరరావు, దొడ్డకుల రాజేశ్వరరావు,భవిష్యత్తులో మేము మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,అడుగుజాడల్లో నడుస్తామని వారు ఒక ప్రకటనలో తెలిపారు.

---

# సింగరేణి ఉద్యోగులకు ప్రమాద బీమా

## సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో సింగరేణి సంస్థ ఒప్పందం

కొత్తగూడెం సింగరేణి, జూన్22(మనం న్యూస్): సింగరేణి సంస్థ కార్మిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇన్సూరెన్స్ పథకానికి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారితో సోమవారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శాలరీ ఎకౌంటు కలిగి ఉన్న సింగరేణి ఉద్యోగులకు కోటి నుండి కోటి యాబై లక్షల వరకు ప్రమాద బీమా సొమ్మును చెల్లించడం జరుగుతుంది. సింగరేణి యజమాన్యం ప్రత్యేక చొరవతో సహజ మరణానికి కూడా 10 లక్షల నుండి 20 లక్షల వరకు భీమా సదుపాయం కల్పించారు. సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు డైరెక్టర్ పర్సనల్ ఫైనాన్స్ గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవ ఫలితంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారితో ఈ కొత్త ఒప్పందం జరిగింది. అంతేకాకుండా శాలరీ అకౌంట్ కలిగి ఉన్న ఉద్యోగులకు మరికొన్ని మంచి రాయితీలను ఈ ఒప్పందంలో పొందుపరిచారు. ఈ



సందర్భంగా జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పని చేసే ఉద్యోగులు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో ఖాతాలు కలిగి ఉండి తమ ఖాతాలను శాలరీ ఎకౌంటుగా మార్చుకున్న వారికి ప్రమాద బీమా పథకంతో పాటు మరికొన్ని మంచి రాయితీలు అమల్లోకి వస్తాయన్నారు. ఉద్యోగులందరూ చిరకాలం ఆయురారోగ్యాలతో తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ సుఖసంతోషాలతో ఉండాలి అనేదే కంపెనీ ఉద్దేశమని అయితే అనుకోని ఘటనలు జరిగినప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలవడం కోసం ఇటువంటి బీమా పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు.

అనంతరం జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైద్రాబాద్ జోన్ డిప్యూటీ జోనల్ హెడ్ ఏ.వి.రమణ మూర్తి ఈ ఒప్పోంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్, జిఎం(పర్సనల్) ఐఆర్ పిఎం కవితా నాయుడు, జిఎం(పర్సనల్) ఈఈ ఆర్సి ఏజేఎం మురళీధర్ రావు, జిఎం(ఎఫ్ అండ్ఏ) ఎన్.చక్రవర్తి, డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణరావు, ముకుంద సత్యనారాయణ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరంగల్ రీజియన్ హెడ్ ఐ.రాజ్ కుమార్, చీఫ్ మేనేజర్ లు అబ్దుల్ ఖాదర్ షేక్, బి.నరేందర్ రెడ్డి, కొత్తగూడెం బ్రాంచ్ హెడ్ జి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

---

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

- హెల్త్ కార్డులు సత్వరమే ఇవ్వాలి
- ఐదు విడతల డిఏ మంజూరు చేయాలి
- పిఆర్సి సత్వరం ప్రకటించాలి
- ఉద్యోగ విరమణ బకాయిలు సత్వరం చెల్లించాలి

ఖమ్మం, జూన్ 22(మనం న్యూస్): సమస్యలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరుతున్నామని ఎస్జిపిఏటి రాష్ట్ర కార్యదర్శి విమేరిఏసుపాదం, జిల్లా అధ్యక్షులు పరిశపుల్లయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని సత్వరం పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం(ఎస్జిపిఏటి) పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో హాజరైన పెన్షనర్ల సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి పేరున చేసిన మెమొరాండం ప్రతిని కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కారుమంచి శ్రీనివాసరావు కు అందజేశారు. పెన్షనర్లకు తక్షణమే నగదురహిత వైద్యం అమలయ్యేలా హెల్త్ కార్డులు అందించాలని, పెండింగ్ లో వున్న ఐదువిడతల డిఏమంజూరు చేయాలని, పిఆర్సిని సత్వరం ప్రకటించి అమలు చేయాలని, ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలని తమ సంఘం కోరుతున్నదని, ఆమేరకు రాష్ట్ర వ్యాపితంగా నేడు ఆయా జిల్లా కేంద్రాలలో జిల్లాకలెక్టర్ లకు మెమొరాండం అందజేసినట్లు ఎస్జిపిఏటి నాయకులు విమేరి ఏసుపాదం, పరిశపుల్లయ్య, రాయలరవి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెదమళ్ళ సత్యనారాయణ, కొలికొండ శరత్ బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు, జల్లా వెంకటేశ్వర్లు, మహిళా




కార్యదర్శి తాడిఅంజలి, టిపిటిఎఫ్ పూర్వప్రధానకార్యదర్శి మనోహరరాజు, విశ్రాంత మండలవిద్యాధికారి పాకనాటి నాగిరెడ్డి, జిల్లా నాయకులు బెల్లం రాధాకృష్ణ మూర్తి,జి మధుకరరెడ్డి, ఊడుగు సుధాకర్,చాపలమడుగు సుధాకర్, యండిహుస్సేన్, గండ్లూరికృష్ణారావు, ప్రసాదరావు, ఖమ్మం నగర శాఖ ముఖ్యకార్యకర్తలు యంరామారావు, చీదిరాల వెంకటేశ్వరరావు, ఏసాగర్, వెచ్చారామకృష్ణ, పివీరభద్రరావు, మధుసూధనరెడ్డి, పినాగేశ్వరరావు, ఆదినారాయణ, వైనాగేశ్వరరావు పాల్గొన్నారు.

---

## ఎస్సీ రైతుల సమస్యల పరిష్కారానికి
# కలెక్టర్ కార్యాలయం ముట్టడి




కొత్తగూడెం టౌన్, జూన్ 22 (మనం న్యూస్ ): కొత్తగూడెం ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న షెడ్యూల్ కులాల (ఎస్సీ) రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారం కోసం సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక సుజాతనగర్ మండల అధ్యక్షులు, ఏజెన్సీ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో-కన్వీనర్ వేల్పుల భాస్కర్ పాల్గొని రైతుల సమస్యలపై తన గళాన్ని వినిపించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో దశాబ్దాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎస్సీ రైతులు నేటికీ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు అమలు కావాల్సిన చోట, ఎస్సీ రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు పూర్తిస్థాయిలో దూరమవుతున్న పరిస్థితి నెలకొందన్నారు.

వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, రుణ సదుపాయాలు మరియు ఇతర ప్రభుత్వ సహాయాలను ఏజెన్సీ ప్రాంతంలోని ఎస్సీ రైతులకు కూడా సమానంగా అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, పోడు భూముల సమస్యల కారణంగా రైతులు నిరంతరం అభద్రతాభావంతో జీవిస్తున్నారని, సాగు చేస్తున్న భూములపై హక్కులను గుర్తించి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిలో ఎస్సీ రైతుల పాత్ర కీలకమని, వారి ఆర్థిక మరియు సామాజిక స్థితిగతులను మెరుగుపరచడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే ఉద్యమాలను మరింత ఉద్ధ ృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమం ఏజెన్సీ షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. కార్యక్రమంలో మాదిగ జేఏసీ అధ్యక్షులు చదలవాడ సూరి, సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్, జిల్లా నాయకులు కృపాకర్, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు, అలాగే పెద్ద సంఖ్యలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ రైతులు పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వానికి నిరసన ద్వారా తెలియజేశారు.

---

# సన్న రకాల వరి సాగుకు ప్రోత్సాహం

## రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలు
## 43 రైతు వేదికల వద్ద విత్తన మేళాల నిర్వహణ
## జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22(మనం ప్రతినిధి): ప్రస్తుత వానాకాలం సీజన్లో సన్న రకాల వరి సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందేందుకు, నాణ్యమైన విత్తనాలు మరియు ఎరువులను అందుబాటులో ఉంచేందుకు జిల్లాలోని 43 రైతు వేదికల వద్ద మంగళవారం నుండి ఈ నెల 29వ తేదీ వరకు విత్తన మేళా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన సన్న రకాల వరి విత్తనాలు అయిన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-7715, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-1638 రకాల సాగు ద్వారా రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పాటు బహిరంగ మార్కెట్లో మెరుగైన ధరలు పొందే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు సన్న రకాల వరి సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

విత్తన మేళా కార్యక్రమంలో భాగంగా పప్పుధాన్యాలు, కూరగాయల పంటలకు సంబంధించిన మేలు రకం విత్తనాలు, నానో యూరియా, నానో డీఏపీ, యూరియా తదితర వ్యవసాయ ఉత్పాదకాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతు వేదికల వద్ద సహకార సంఘాలు, తెలంగాణ సీడ్స్ సంస్థ, గుర్తింపు పొందిన విత్తన విక్రయ డీలర్లు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందజేయనున్నట్లు తెలిపారు .

జిల్లాలో బీపీటీ-5204 విత్తనాలు 17,509 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్-15048 విత్తనాలు 3,118 క్వింటాళ్లు, హెచ్ఎంటీ సోనా 1,913 క్వింటాళ్లు, జై శ్రీరామ్ 2,599 క్వింటాళ్లు, కేఎన్ఎం-7715 విత్తనాలు 327.5 క్వింటాళ్లు, డబ్ల్యూజీఎల్-44 విత్తనాలు 4,052.3 క్వింటాళ్లు, కేఎన్ఎం-1638 విత్తనాలు 3,200 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే నానో యూరియా 2,165.5 లీటర్లు, నానో డీఏపీ 1,664 లీటర్లు, యూరియా 16,000 మెట్రిక్ టన్నులు జిల్లాలో సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.

రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీకి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.జిల్లాలోని రైతులందరూ తమ సమీప రైతు వేదికల్లో నిర్వహించే విత్తన మేళా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని నాణ్యమైన విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి లబ్ధి పొందాలని కోరారు. మరిన్ని వివరాల కోసం వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

---

# వైరా గడ్డపై గులాబీ జెండా ఎగరవేస్తాం

## రైతుకు యూరియా ఇవ్వలేని ప్రజా పాలన
## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

వైరా, జూన్ 22 (మనం న్యూస్): వైరా గడ్డపై గులాబీ జెండా ఎగరవేస్తామని టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాత మధుసూదన్ రావు అన్నారు. సోమవారం స్థానిక కమ్మవారి కళ్యాణ మండపంలో బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు.ఎస్ ఆర్ పై నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ఆర్ జె సి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుకు యూరియా ఇవ్వాలేని స్థితిలో ప్రజా పాలన జరుగుతుందని రాష్ట్రంలో ఎక్కడైనా రైతు అరిగోస పడకుండా ఉన్నాడా ఇదేనా కాంగ్రెస్ ప్రజా పాలన అంటూ కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ధ్వజమెత్తారు.అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇంతవరకు నెరవేర్చలేదని రైతు భరోసా, రైతు బీమా ఇంతవరకు సక్రమంగా ఇచ్చిన పాపాన పోలేదని రైతుకు యూరియా కూడా ఇవ్వలేని ఈ ప్రభుత్వాన్ని ప్రజాపాలన అంటారని నిలదీశారు. అంతేకాకుండా వైరా మున్సిపాలిటీ చైర్పర్సన్ భర్త నోరు దగ్గర పెట్టుకొని ఉండాలని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా ఇంచార్జ్ తక్కలపల్లి రవీందర్ మాట్లాడుతూ సర్ పేరుతో కాంగ్రెస్ పెద్ద కుట్ర పన్నిందని. దానని తిప్పి కోట్టేందుకు బూత్ లెవెల్ ఏజెంట్లు ఇంటింటికి తిరిగి ఓటరుకు ఏస్ ఐ ఆర్ యొక్క ఆవశ్యకతను వివరించాలని కోరారు. సమన్వయ కమిటీలు పార్టీకి ఆయువుపట్టని అన్నారు.

గ్రామాల్లో మళ్లీ కేసిఆర్ రావాలని 100% ప్రజలు కోరుకుంటున్నారని ఆ దిశగా ప్రతి కార్యకర్త పార్టీకి సేవ చేయాలని కోరారు. పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు ఉంటాయని అన్నారు. రాజకీయ నాయకుడే సమాజానికి వైద్యం చేసే వైద్యులని చెడిపోతున్న సమాజానికి రాజకీయ నాయకులు వైద్యం చేయాలని అన్నారు. అనంతరం తాత మధుసూదన్ రావు మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో 2029 లో టిఆర్ఎస్ జండా ఎగరటం ఖాయమని ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టిన బిఆర్ఎస్ గెలుపును ఆపలేరని అన్నారు. వైరా ఎమ్మెల్యే కూడా గాలివాటంకు వచ్చినవాడేనని బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని కొనిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామంలో అభివృద్ధి పనులను




అడ్డుకుంటే ఒప్పుకోమని అన్నారు. సిరిపురం లో వైరా ఎమ్మెల్యే బెదిరించిన తలవంచకుండా పోరాడి సర్పంచ్ సాధించుకున్నామని గుర్తు చేశారు. వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రీజియన్ ద్వారా తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తుందని. సర్ వల్ల పశ్చిమ బెంగాల్ లో 95 లక్షల ఓట్లు గల్లంతు అయ్యాయని టిఎంసి ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ పని ముగియ పోతుందని ఇప్పటికే సగం సినిమా ప్రజలకు అర్థమైందని అన్నారు. 2029లో టిఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వనమా విశ్వేశ్వరరావు, కట్ట కృష్ణార్జున రావు, లకావత్ గిరిబాబు, బానోత్ మనీషా లక్ష్మి, బానోత్ బాలాజీ నాయక్, బాణాల వెంకటేశ్వరరావు ,ముత్యాల సత్యనారాయణ, బొమ్మెర రామ్మూర్తి, లాల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మనం Manam Mahabubnagar
మహబూబ్ నగర్

## ధాన్యం అక్రమ తరలింపు కేసులో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

- పూర్తిస్థాయి విచారణకు అదనపు కలెక్టర్ కు ఆదేశాలు

రాజన్న సిరిసిల్ల, జూన్ -22(మనం ప్రతినిధి ):ప్రభుత్వ ధాన్యం అక్రమ తరలింపు కేసులో నిందితుడు అయిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని సోమవారం తొలగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల యాసంగి సీజన్ ధాన్యం సేకరణ పూర్తి చేయగా, ధాన్యం అక్రమ తరలింపు కేసులో జిల్లా పౌర సరఫరాల శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కే. రాజ శేఖర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఈ కేసులో నిందితుడిగా ఉన్న రాజ శేఖర్ ను వెంటనే విధుల నుంచి తొలగిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.అలాగే ధాన్యం అక్రమ తరలింపు పై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. విచారణ నివేదిక రాగానే .. తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

## మత్తు వదలండి.. క్రీడా మైదానాల వైపు సాగండి

- క్రీడాకారులు గ్రామస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు ఎదగాలి
- తెలంగాణ రాష్ట్రం అంతర్జాతీయ స్థాయిలో క్రీడారంగంలో రాణించాలి
- పాలమూరు జిల్లా క్రీడాకారులు జాతీయస్థాయిలో మరిన్ని పథకాలు సాధించాలని
- రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 22 (మనం బ్యూరో): మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో రూ. 12కోట్ల 53 లక్షల వ్యయంతో చేపట్టనున్న క్రీడా మౌలిక సదుపాయాల పనులకు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి 'మత్తు వదలండి మైదానాలు చేరండి అని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి యువతకు పిలుపునిచ్చారు. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం గ్రౌండ్ మైదానంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రూ. 12.53 కోట్లతో(10.70 కోట్ల రూ.లతో అథ్లెటిక్ సింథటిక్ ట్రాక్, ఒక కోటి రూ.లతో నాలుగు ఓపెన్ జిమ్స్, రూ. 51 లక్షలతో ఇండోర్ జిమ్, మహిళల అథ్లెటిక్స్ హాస్టల్ మిగిలిన పనులకు రూ. 32 లక్షలు వ్యయంతో పలు ఆధునిక క్రీడా సదుపాయాల నిర్మాణానికి ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి క్రీడలకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్రీడా కారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్న 400 మీటర్ల 8 లైన్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ ద్వారా జిల్లాలోని యువ క్రీడాకారులకు ఉన్నత స్థాయి శిక్షణ అందే అవకాశం కలుగుతుందన్నారు. క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా జీవన శైలిని మార్చే శక్తివంతమైన సాధనమని మంత్రి అన్నారు. ప్రతి యువకుడు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వివిధ నియోజకవర్గం లలో ఇప్పటికే సుమారు రూ. 80 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. క్రీడా రంగ అభివృద్ధి కోసం అవసరమైతే రూ. 100 కోట్ల వరకు ఖర్చు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. యువత టైమ్పాస్గా కాకుండా క్రీడలను సీరియస్గా తీసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో స్విమ్మింగ్ పూల్ ను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. స్పోర్ట్స్ అసోసియేషన్లు మరింత చురుకుగా పనిచేసి గ్రామ స్థాయి నుండి యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలని సూచించారు. క్రీడా ప్రాజెక్టులకు గ్రీన్ ఛానల్ ద్వారా త్వరితగతిన అనుమతులు ఇచ్చి పనులను వేగవంతం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. లక్షలాది యువతకు క్రీడల ద్వారా అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. .ప్రభుత్వ విప్,మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... మంత్రి వాకిటి శ్రీహరి క్రీడాశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకం చేసి మహబూబ్ నగర్ కు మంజూరు చేసిన ప్రాజెక్టుకు ఈరోజు శంకుస్థాపన చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాడు అడిగిన వెంటనే స్పందించి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. వాలీబాల్, కబడ్డీ అకాడమీతో పాటు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాను క్రీడల రంగంలో నెంబర్ వన్గా తీర్చిదిద్దడమే కాకుండా ఒలింపిక్ క్రీడలలో దేశం తరుపున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించేలా క్రీడాకారులకు ఉత్తమ శిక్షణ ఇప్పించే ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. అవసరమైతే భూముల సేకరణ చేపట్టి క్రీడలకు సంబంధించిన అన్ని రకాల వసతులు కల్పిస్తామని తెలిపారు. యువతకు క్రీడల ద్వారా మరిన్ని అవకాశాలు కల్పిస్తూ వారి భవిష్యత్తును బలోపేతం చేయాలని



సంకల్పించామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా రాబోయే రోజుల్లో దేశంలోనే క్రీడా రంగంలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## పేదరిక నిర్మూలనకు సమగ్ర కార్యాచరణ



- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్...

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 22 (మనం బ్యూరో): జోగులాంబ గద్వాల జిల్లాలో టిజిఐ ఎల్పికి ఎంపికైన గట్టు మండలంలో పేదరిక నిర్మూలనకు సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్లిహుడ్ ప్రోగ్రామ్ (టీజీఐఎల్పి) గురించి సోమవారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ప్రోగ్రాంకు ఎంపికైన వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో అత్యంత పేద కుటుంబాలను శాశ్వతంగా పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్లిహుడ్ ప్రోగ్రామ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడం, జీవనోపాధి కోసం నిరంతర మార్గదర్శకత్వం చేయడం ద్వారా పేదరికం నుంచి బయటపడేలా చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమం అమలులో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొన్నారు. ప్రతి 30 నుంచి 50 అత్యంత పేద కుటుంబాలకు ఒక కోచ్ను నియమించి, వారి ద్వారా ఆయా కుటుంబాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. గద్వాలలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ...జోగులాంబ గద్వాల జిల్లాలో అత్యంత వెనుకబడ్డ గట్టు మండలంలోని 14 గ్రామాల్లో 1033 నిరుపేద కుటుంబాలను ఇప్పటికే ఈ కార్యక్రమానికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో వర్తింప చేస్తామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ శ్రీకాంత్, డిఆర్డిఓ ముషాహిదా బేగం, ఏపీడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి, జీవనోపాధి కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి

- లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి
- ఆదివాసీ, పీవీటీజీ కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి
- దివ్య దేవరాజన్, సీఈఓ, సెర్ప్




ములుగు, జూన్ 22,మనం ప్రతినిధి, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రత్యేక జీవనోపాధి కార్యక్రమాల అమలులో వేగం పెంచాలని, లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం, తెలంగాణ సామాజిక అభ్యున్నతి కార్యక్రమం అమలు పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన లబ్ధిదారులకు జీవనోపాధి అవకాశాల కల్పన, ఉత్పాదక ఆస్తుల పంపిణీ, గ్రామస్థాయిలో కార్యక్రమాల అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల అమలులో జిల్లా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. లబ్ధిదారుల కుటుంబాలకు ఆధార్ నమోదు, ఉపాధి హామీ జాబ్ కార్డులు, రేషన్ కార్డులు, గృహాల మంజూరు, ఆరోగ్య సేవలు, టీకాల కార్యక్రమాలు వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖలతో సమన్వయం పెంచి కుటుంబాలకు బహుళ జీవనోపాధి అవకాశాలు కల్పించాలని, పశువైద్య శిబిరాలు, పోషకాహార తోటలు, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. అటవీ ఉత్పత్తుల ఆధారంగా ఇప్పపువ్వు, తేనె సేకరణ, తేనెటీగల పెంపకం, వెదురు సాగు వంటి కార్యక్రమాలను ప్రోత్సహించి ఆదివాసీ కుటుంబాల ఆదాయాన్ని పెంపొందించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ప్రత్యేకంగా ఆదివాసీ, అత్యంత వెనుకబడిన గిరిజన కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేసి ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిఆర్డిఏ చంద్రశేఖర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 'మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు' ఆవిష్కరణ

- మహబూబ్ నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 22 (మనం బ్యూరో): మహబూబ్ నగర్ జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు రాసిన ' మహబూబ్ నగర్ జిల్లా బడిపిల్లల కథలు ' కథల సంకలనాన్ని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.... విద్యార్థులు రాసిన కథలు చాలా చక్కగా, అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. విద్యార్థుల్లో సృజనాత్మక నైపుణ్యాలను ఆవిష్కరించడానికి ఇలాంటి రచనలు దోహదపడుతాయన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి మాట్లాడుతూ... పాఠశాల విద్యార్థుల అనుభవాలు, ఆలోచనలతో ఈ పుస్తకం రూపుదిద్దుకుందన్నారు. చిన్నారుల్లో పఠనాసక్తిని పెంపొందించడానికి ఈ కథలు ఉపయోగపడుతాయన్నారు.

జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో ఈ పుస్తకం వెలుగు చూసిందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ హరిప్రియ, జెడ్పీ సి.ఇ.ఓ. వెంకట్ రెడ్డి, ఎ.ఓ.సువర్ణ రాజ్, వ్యవసాయ శాఖ ట్రేనింగ్ సెంటర్ డి.డి. వేంకటేశ్, ఎ.ఎం.ఓ. దుంకుడు శ్రీనివాస్, సి.ఎం.ఓ. సుధాకర్ రెడ్డి, జి.సి.డి.ఓ. అస్రాఖాద్రి, పుస్తక సంపాదకులు డా.భీంపల్లి శ్రీకాంత్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం



- వివేక ఎఫ్ పి ఓ నుండి ఉచితంగా వరి విత్తనాలు పొందిన రైతుల హర్షం...

మంగపేట, జూన్ 22, మనం ప్రతినిధి: సోమవారం మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో వివేక రైతు ఉత్పత్తిదారుల సంఘం నుండి ఉచితంగా వరి విత్తనాలు పొందిన బండారుగూడెం అడవిరామవరం గిరిజన రైతులు మంత్రి సీతక్క గారి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా గిరిజన రైతులు సోయం చెన్నారావు కురసం శ్రీను సోయం సత్యం తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకు జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి తమ వివేక ఎఫ్ పి ఓ సంఘం నుండి సుమారు మూడు వందల ఎకరాలకు ఫౌండేషన్ తరగతి బీపీటీ 5204 సన్న రకం వరి వంగడం విత్తనాలను ఉచితంగా పంపిణీ చేసి తమకు విత్తనాల కొనుగోలు ఖర్చు ఆర్థిక భారాన్ని లేకుండా చేసినందుకు కృతజ్ఞతగా మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు అన్నారు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చిన జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డిని రైతులు అభినందించారు ఈ కార్యక్రమంలో బండారు గూడెం, అకినేపల్లి మల్లారం గ్రామాలకు చెందిన రైతులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగుల ఆరోగ్యమే సేవల సామర్థ్యానికి పునాది




- ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉచిత హెల్త్ ప్రొఫైల్ పరీక్షలు
- 200 మంది అధికారులు, ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

ములుగు, జూన్ 22, మనం ప్రతినిధి, ఉద్యోగుల ఆరోగ్యమే సేవల సామర్థ్యానికి పునాదిగా ఉంటుందని,ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఉచిత హెల్త్ ప్రొఫైల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని,ఉద్యోగుల ఆరోగ్యం మెరుగ్గా ఉంటేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలరని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు.రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశాల మేరకు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, ములుగు జిల్లా ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల కోసం ఉచిత హెల్త్ ప్రొఫైల్ పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హెల్త్ క్యాంపును పరిశీలించి వైద్య సిబ్బందితో వివరాలు తెలుసుకున్నారు.స్వయంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఉద్యోగులు కూడా తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచిస్తూ ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఉద్యోగులు విధి నిర్వహణలో ఎల్లప్పుడూ ఒత్తిడితో పనిచేయాల్సి వస్తుందని, అలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా ఉద్యోగులు మరింత సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించగలరని తెలిపారు. ములుగు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వైద్య బృందం ఆరోగ్య శిబిరంలో దాదాపు 200 మంది అధికారులు, ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీ, సంఘ నాయకులు పోలురాజు, కందుల జీవన్ కుమార్, మేడి చైతన్య, ఎం. ప్రకాష్ రెడ్డి, కొమురయ్య, రాజు, బి. యశ్వంత్, శిరీష, రఫీక్, శైలజ, ఎం. రాజు, జి. కృష్ణ ప్రసాద్, మహేష్, ఏవో రాజ్ కుమార్, బి. బాలయ్య, టి. సారంగపాణి, రహీం, సందీప్, తేజ, వరుణ్, సరిత, జైస్మిత, సాయి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు జిల్లాలో 7 రోజులు వరకు రైతు వేదికలలో విత్తన మేళా నిర్వహణ కార్యక్రమం




- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 22 (మనం బ్యూరో): వ్యవసాయ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచి వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు మహబూబ్నగర్ జిల్లాలో జూన్ 23 నుండి 29 వరకు 17 మండలాలలో ఎంపిక చేయబడిన రైతు వేదికలలో (ఖ్జుజిం గ్ఫిఛీజీజ్మ్షుట) విత్తన మేళా' (ఖ్ఫిఛీ ఢ్జిబ్బా) నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.గోవింద్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ విత్తన మేళాలో వివిధ పంటలకు సంబంధించిన ధృవీకరించబడిన, నాణ్యమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ధాన్య సేకరణలో సూచించిన 7 రకాల వరి సన్న రకాల విత్తనాలు, అలాగే అపరాల విత్తనాలు, నూనెగింజల పంట విత్తనాలు, వివిధ రకాల కూరగాయల విత్తనాలు మరియు నానో యూరియా, నానో డీఏపీ రైతులకు కొనుగోలు కోసం అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా విత్తనాలను కొనుగోలు చేసుకొని, సకాలంలో విత్తనాలు విత్తడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

- యువతకు అప్రెంటిషిప్ సువర్ణ అవకాశాలను విస్తరించాలి
- మత్తు పదార్థాల రహిత జిల్లాకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రజలకు పిలుపు



గుమ్మడి మహబూబ్ నగర్ జూన్ 22 (మనం బ్యూరో): జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టీజీ ఐపాస్, జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, అదేవిధంగా ఎన్ఏటీఎస్ 2.0 (నేషనల్ అప్రెంటిషిప్ ట్రైనింగ్ స్కీం) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సంబంధిత శాఖల అధికారులు వేగవంతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా మంజూరు చేయాలని ఆదేశించారు. పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందించి జిల్లాలో పారిశ్రామిక వృద్ధికి తోడ్పడాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎంఎస్ఎంఈ పాలసీ-2024 కింద సేవా రంగానికి చెందిన ఎస్సీ పురుష పారిశ్రామికవేత్తలకు ప్రాజెక్టు వ్యయంలో 35 శాతం (గరిష్టంగా రూ.75 లక్షలు), మహిళా పారిశ్రామికవేత్తలకు 45 శాతం (గరిష్టంగా రూ.75 లక్షలు) వరకు సబ్సిడీ అందజేయబడుతుందని తెలిపారు. అలాగే తయారీ రంగంలో ఎస్సీ పురుష పారిశ్రామికవేత్తలకు 50 శాతం (గరిష్టంగా రూ.1.00 కోటి), మహిళా పారిశ్రామికవేత్తలకు 70 శాతం (గరిష్టంగా రూ.1.20 కోట్లు) వరకు సబ్సిడీ కల్పించబడుతుందన్నారు. సాధారణ వర్గానికి చెందిన పారిశ్రామికవేత్తలకు తయారీ రంగంలో పురుషులకు 25 శాతం (గరిష్టంగా రూ.30 లక్షలు), మహిళలకు 45 శాతం (గరిష్టంగా రూ.50 లక్షలు) వరకు సబ్సిడీ మంజూరు చేయబడుతుందనీ పేర్కొన్నారు.

## బిఆర్ఎస్ అసత్య ప్రచారాలకు బెదిరేది లేదు

ములుగు,జూన్ 22మనం ప్రతినిధి : ఇసుక అక్రమ రవాణా జరిగిందని బిఆర్ఎస్ నాయకులు చేసిన అసత్యపు ప్రచారాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారక్క సన్నిధిలో చర్చకు వస్తే చర్యకు రాకుండా తప్పించుకుని కార్యాలయంలో కూర్చుని పిచ్చి కూతలు కూశారని మహిమ గల సమ్మక్క సారక్క దగ్గర వారు చేసిన తప్పుడు ఆరోపణలు, అవినీతి బట్టబయలవుతుందని ములుగు నడిబొడ్డులో చర్చకు రావాలని సవాల్ విసిరారు. తప్పుడు ప్రచారాలు, నిరాధారమైన మాటలు మాట్లాడి సవాళ్లు విసిరి దమ్ము దైర్యం లేని దద్దమ్మలకు ఒక విషయం తెలుసుకోవాలని చెప్పారు. మీరు చేసిన ఆరోపణలు నిజాలే అయితే చర్చకు రావాలని రాకుండా కేవలం ప్రెస్ మీట్ పెట్టే ఫోటోలకు పోజులు ఇవ్వడానికి తప్ప ఎందుకు పనికిరారని అన్నారు. మరొకసారి ప్రభుత్వం మీద కానీ,మంత్రి సీతక్క మీద కానీ తప్పుడు మాటలు ,తప్పుడు ప్రచారాలు చేస్తే ఖబడ్దార్ మిమ్మల్ని ప్రజలే తరిమి కొడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, సీనియర్, యూత్, మహిళా నాయకులు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజావాణి పిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- పాలమూరు ప్రజావాణిలో 117 వినతులు స్వీకరణ
- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. ఎల్. బి హరిప్రియ

ఉమ్మడి మహబూబ్ నగర్ జూన్ 22 (మనం బ్యూరో): సోమవారం పాలమూరు జిల్లాలో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన పిర్యాదుదారుల దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన



ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె . ఎల్.బి హరిప్రియ, అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను శ్రద్ధగా విన్నారు. ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అర్జిదారులకు ఆమె భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో మున్సిపల్, జిల్లా పౌరసరఫరాల, భూ సర్వే రికార్డుల శాఖ, గృహ నిర్మాణ శాఖ, విద్యా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి, గిరిజన అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించి 117 దరఖాస్తులను అధికారులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని , డి.ఆర్.ఓ ఎ.నిర్మల, జడ్.పి.సి.ఈ.ఓ, ఇంచార్జి డి. పి.ఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుధ సర్వీసులకు అమెరికా అంగీకారం



**వాషింగ్టన్, జూన్ 22:** భారత్‌కు విక్రయించిన కీలక ఆయుధాలకు సంబంధించి సర్వీస్లను అందించేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించింది. ఈ విషయాన్ని అమెరికా విదేశాంగశాఖ.. అక్కడి కాంగ్రెస్‌కు వెల్లడించింది. అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు, ఎం777ఏ2 అల్ట్రాలైట్ శతఘ్నులకు సంబంధించిన సర్వీసులను అగ్రరాజ్యం అందించనుంది. ఈ డీల్ విలువ 482 మిలియన్ డాలర్లుగా అంచనావేసింది. విదేశాలకు ఆయుధ విక్రయాలను పర్యవేక్షించే ది డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ ఇటీవల ఈ సర్వీసులకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భారత్ అమ్ములపొదిలోని కీలక ఆయుధాల నిర్వహణ, లాజిస్టిక్స్, శిక్షణ, సాంకేతిక సాయం వంటి వాటికి ఇబ్బంది లేకుండాపోతుంది. అమెరికాలోని బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ కంపెనీలు అపాచీ సర్వీసు కాంట్రాక్టర్లు కాగా.. బీఏఈ సిస్టమ్స్ ఎం777కు సర్వీసు కాంట్రాక్టులు చేస్తోంది.

# ప్రశ్నాపత్రం లీక్...

## అది ఫేక్ వీడియో: ఎన్టీఏ




**ఢిల్లీ, జూన్ 22:** దేశవ్యాప్తంగా నీట్ రీటెస్ట్ ఆదివారం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రం లీక్ అయిందంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న ఓ వీడియోపై ఎన్టీఏ మరోసారి స్పందించింది. అది నకిలీదని ఎక్స్ వేదికగా వెల్లడించింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అలాంటి తప్పుడు ప్రచారాన్ని నమొద్దని విజ్ఞప్తి చేసింది. దేశవ్యాప్తంగా అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ రీటెస్ట్ విజయవంతంగా ముగిసిందని ఎన్టీఏ వెల్లడించింది. అవాస్తవాలతో కూడిన వీడియోను కొందరు కావాలనే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని పేర్కొంది. తప్పుడు సమాచారాన్ని సృష్టించి, విద్యార్థులను ఆందోళనకు గురిచేయడం తీవ్రమైన నేరమని, బాధ్యులపై కఠిన తీసుకుంటామని హెచ్చరించింది.

కాగా.. దేశవ్యాప్తంగా నీట్ యూజీ రీ-ఎగ్జామ్‌కు 20 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఢిల్లీలోని ఎన్టీఏ ప్రధాన కార్యాలయం నుంచి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సమీక్షించారు. అన్ని ప్రభుత్వ విభాగాల సహకారంతో పునః పరీక్షను రికార్డు సమయం (37 రోజుల్లో)లో దిగ్విజయంగా నిర్వహించగలిగామని ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ పేర్కొన్నారు.

# మా సోయా కొంటే ఇరాన్ ఆస్తులు విడిపిస్తాం

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్



**వాషింగ్టన్, జూన్ 22:** పశ్చిమాసియాలో శాశ్వత శాంతి స్థాపన దిశగా మరో ముందడుగు పడిందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే లక్ష్యంగా ఆ దేశంతో జరిపిన చర్చలు తుది ఒప్పందానికి మంచి పునాది వేశాయన్నారు. దీనివల్ల అమెరికా ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తమ సోయా, మొక్కజొన్న, గోధుమలను టెహ్రాన్ కొనుగోలు చేస్తే.. దానికి బదులుగా విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులు విడిపిస్తామని పేర్కొన్నారు. తాము చేసుకున్న ప్రాథమిక ఒప్పందానికి ఇరాన్ కట్టుబడి ఉందో లేదో ధ్రువీకరించడానికి ఐక్యరాజ్యసమితి అణు తనిఖీ అధికారులు ఇరాన్‌ను సందర్శిస్తారని వాన్స్ తెలిపారు. లెబనాన్ విషయంలో సరైన సమన్వయం ఉండేలా ఇరాన్, ఇజ్రాయెల్ నేతలతో తమ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. హర్మూజ్ తెరిచే ఉందని.. జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయన్నారు.

పాక్ మధ్యవర్తిత్వంతో ఇరుదేశాలు అవగాహన ఒప్పందంలో ముందడుగు వేశాయని ఇరాన్ అధికారులు వెల్లడించారు. పాక్ నేతలు లేకపోతే ఒప్పందం ముందుకు సాగడం కష్టతరంగా మారేదని.. మళ్లీ ఘర్షణలు తలెత్తేవని పేర్కొన్నారు. రాబోయే 60 రోజుల్లో ఒక సమగ్ర ఒప్పందానికి ఎలా చేరుకోవాలనే దాని చర్చలు కొనసాగుతున్నాయన్నారు. చర్చల ద్వారానే దౌత్యపరమైన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

# మార్కెట్లోకి ఇక ఇరాన్ చమురు..

## స్విడ్జర్లాండ్ చర్చల్లో కీలక పురోగతి..!



**స్విడ్జర్లాండ్, జూన్ 22:** తమ చమురు ఎగుమతులపై ఆంక్షలను ఎట్టకేలకు అమెరికా తొలగించినట్లు ఇరాన్ వెల్లడించింది. స్విడ్జర్లాండ్‌లో అమెరికాతో జరిగిన తొలి విడత చర్చల అనంతరం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందం అమలు పర్యవేక్షణకు ఓ కమిటీ ఏర్పాటు కానుంది. దీంతోపాటు లెబనాన్‌లో ఉద్రిక్తతలను నివారించేందుకు డీకాన్ఫ్లిక్షన్ సెల్ ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఇరాన్-అమెరికా అంగీకారానికి రావడంతో తొలివిడత చర్చలు ముగిశాయి. అనంతరం మధ్యవర్తులుగా వ్యవహరించిన పాకిస్థాన్-ఖతార్ ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలను నివారించడానికి అమెరికా-ఇరాన్ మధ్య ఓ కమ్యూనికేషన్ లైన్ కూడా ఏర్పాటు చేయనున్నారు. దీంతో పాటు తరచూ ఉద్రిక్తలకు కారణమవుతున్న లెబనాన్ అంశంపై డికాన్ఫిలక్షన్ సెల్ను ఏర్పాటు చేయడానికి అమెరికా అంగీకరించింది. ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి ప్రతినిధులు తొలివిడత చర్చలు ముగిశాయి. కానీ, సాంకేతిక అంశాలపై ఈ వారం కూడా చర్చలు కొనసాగనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు చర్చలకు ప్రధాన అవాంతరంగా మారాయి. ఇరాన్ ముసుగు సంస్థ కార్యకలాపాలను ఆపేయాలంటూ ట్రంప్ ట్రూత్ సోషల్లో పోస్టు చేశారు. లేకపోతే ఇర్వా భారీ ఎత్తున దాడి చేస్తామని హెచ్చరించారు. అంతేకాదు.. ఇరాన్ అధ్యక్షుడు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బెదిరించారు. దీంతో ఇరాన్ స్పీకర్ మహమ్మద్ బాఘేర్ దౌత్య బృందం చర్చల నుంచి వాకౌట్ కూడా చేసింది. అమెరికాకు చర్యలకు ప్రతిస్పందించేందుకు తాము సిద్ధమే అని ఆయన పేర్కొన్నారు.

# షిండే క్యాంప్‌లోకి ఆరుగురు ఎంపీలు




**ముంబయి, జూన్ 22:** మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. శివసేన(యూబీటీ)కు చెందిన ఆరుగురు ఎంపీలు షిండే నేతృత్వంలోని శివసేనలో చేరారు. దీంతో గడిచిన కొన్ని రోజులుగా శివసేన (యూబీటీ)లో చీలికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. 'ఆరు పులులు (ఎంపీలనుద్దేశించి) ఇప్పుడు అసలైన శివసేన ఫ్యామిలీలోకి వచ్చాయి. వారికి స్వాగతం. ఆపరేషన్ టైగర్ విజయవంతమైంది' అని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్నాథ్ షిండే ప్రకటించారు.

షిండే క్యాంప్‌లో చేరిన ఎంపీల్లో ఓం రాజే నింబాల్కర్, సంజయ్ దిన పాటిల్, సంజయ్ జాదవ్, సంజయ్ దేశ్ముఖ్, నగేష్ పాటిల్ అష్టికర్, బౌసాహెబ్ వక్‌చౌరే ఉన్నారు. మొత్తం 9 మంది ఎంపీల్లో ఆరుగురు షిండే క్యాంప్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల క్రితం 2022 జూన్ 22న 40 మంది ఎమ్మెల్యేలు తమతో వచ్చారన్న షిండే.. ఇప్పుడు ఏకంగా 'సిక్స్' కొట్టామని పేర్కొన్నారు. శివసేన రెండో విడత విస్తరణ ప్రణాళికగా ఈ చేరికను అభివర్ణించారు. మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల ఢిల్లీలో పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయగా కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో శివసేనలో మరోసారి చీలిక ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా అధికార, విపక్ష కూటముల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ తాజాగా ఆరుగురు ఎంపీలు షిండే క్యాంప్‌లో ప్రత్యక్షమయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అందడం లేదన్న కారణంతోనే తాము పార్టీ మారుతున్నట్లు రెబల్ ఎంపీలు చెప్పుకొచ్చారు.

# ఖతార్కు షాక్...

## రస్ లఫాన్ గ్యాస్ క్షేత్రంలో భారీ పేలుడు..!



**దోహా, జూన్ 22:** ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టు వంటి ఖతార్ రస్ లఫాన్ క్షేత్రంలో బర్జాన్ ప్లాంట్లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 54 మంది గాయపడగా.. 18 జాడ గల్లంతైంది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. వాస్తవానికి ఇరాన్-అమెరికా యుద్ధం వేళ ఐఆర్జీసీ దళాలు ఈ గ్యాస్ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకొని భారీగా దాడులు చేశాయి. దీంతో గ్యాస్ ప్లాంట్ దెబ్బతిని భారీగా ఉత్పత్తి సామర్థ్యం పడిపోయింది. కొన్నాళ్ల క్రితమే ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గు ముఖం పట్టడంతో గ్యాస్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ చర్యలు చేపట్టింది.

ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడి నుంచి గ్యాస్ దాదాపు 30 దేశాలకు పైగా ఎగుమతి అవుతోంది. వీటిల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఐరోపా సమాఖ్య, చైనా వంటి దేశాలు ఉన్నాయి. భారత ఎల్ఎన్జీ దిగుమతుల్లో ఖతార్ నుంచి 40-47% వరకు హర్మూజ్ జలసంధి దాటుకొని వస్తున్నాయి. ఈ గ్యాస్ క్షేత్రాన్ని ఖతార్ ఎనర్జీనే నిర్వహిస్తుంది. భారత్-ఖతార్ మధ్య 2024లో 78 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 2028 నుంచి 20 ఏళ్లపాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఖతార్ ఎల్ఎన్జీ భారత్‌లో విద్యుత్తు, ఎరువుల ఉత్పత్తి, పరిశ్రమలు, గృహోపయోగానికి చాలా కీలకం. అమెరికా, ఆఫ్రికాతో పోల్చుకొంటే ఇక్కడి నుంచి భారత్‌కు గ్యాస్ తరలించడం చాలా చౌక.

# అమెరికాకు షాకిచ్చిన చైనా..

## కీలక కంపెనీలపై ఆంక్షలు



**లండన్, జూన్ 22:** అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.

# మీడియా అకాడమీలో సర్‌పై అవగాహన సదస్సు



**హైదరాబాద్,జూన్22(మనం న్యూస్):** ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జర్నలిస్టులకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు.ముఖ్య ఎన్నికల అధికారి కార్యాలయం తరపున బి.చెన్నయ్య, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్,డి. చిరంజీవి, ఐటీ మేనేజర్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్ ప్రక్రియపై సమగ్ర వివరణ అందించారు.ఈ సందర్భంగా వారు ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం ఉద్దేశ్యం, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల సవరణ, మార్పులు, తొలగింపులు, ఇంటింటి సర్వే తదితర అంశాలపై విపులంగా వివరించారు.ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాల ప్రాధాన్యత ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజలకు సరైన సమాచారం చేరవేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ఆయన అన్నారు. జర్నలిస్టులు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన పెంపొందించుకుని ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి, నాగులపల్లి వెంకటేశ్వరరావులతో పాటు వివిధ మీడియా సంస్థలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

# తాగు నీటి సరఫరాలో అంతరాయం కలగొద్దు

- వచ్చే ఏడాది తాగునీటి అవసరాలపై ముందస్తు కార్యాచరణ
- రిజర్వాయర్‌లలో నీటి నిల్వలు, సింగూరు నీటి లభ్యతపై ఉన్నతస్థాయి సమీక్ష



**హైదరాబాద్,జూన్22(మనం న్యూస్):** రాష్ట్ర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి జయేష్ రంజన్ అధికారులను అదేశించారు. సోమవారం సచ్చివాలయంలో ఈ మేరకు ప్రత్యేక ప్రధానకార్యదర్శి అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, దాన కిశోర్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్, మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ కృపాకర్ రెడ్డి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇరిగేషన్, జలమండలి, మిషన్ భగీరథఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు, వర్షాకాల ప్రవాహాలు, పట్టణ ప్రాంతాల తాగునీటి అవసరాలు, రానున్న వేసవి డిమాండ్‌పై సమీక్ష నిర్వహించారు. మంజీరా, సింగూరు జలాశయాల్లోని నిల్వలు ఈఏడాది సెప్టెంబర్ 30 వరకు మాత్రమే సరిపోతాయని, గోదావరి వనరుల ద్వారా కూడా అదే కాలం వరకు నీటి లభ్యత ఉందని వివరించారు. సింగూరు నీటి వనరులపై ఆధారపడిన ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు (కంటింజెన్సీ ప్లాన్లు)సిద్ధం చేయాలని సూచించారు. అదేవిధంగా గోదావరి నుంచి మిషన్ భగీరథకు అదనపు నీటి సరఫరా కోసం పెండింగ్‌లో ఉన్న సుమారు 4 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులను 40 రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన సుమారు రూ.3 కోట్ల నిధుల అంశాన్ని కూడా పరిశీలించాలని నిర్ణయించారు. పనులు పూర్తయిన అనంతరం అదనంగా 40 ఎంజీడీల నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మిషన్ భగీరథ పరిధిలో బోర్‌వెల్‌ల వద్ద వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు చేపట్టి భూగర్భజలాల పునరుద్ధరణ పెంచాలని జయేష్ రంజన్ అధికారులను అదేశించారు. జలమండలి, మిషన్ భగీరథ అధికారులు అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు, అవసరమైతే ఇతర వనరుల నుంచి నీటిని మళ్లించే అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని జయేష్ రంజన్ అధికారులకు సూచించారు.

# ప్రజల భద్రతే ప్రాధాన్యం

- రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్,జూన్22(మనం న్యూస్):** రాష్ట్రంలో వర్షాకాలం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రహదారి, రవాణా వ్యవస్థను నిరంతరం కొనసాగించడంతో పాటు, వరదల వల్ల రహదారులు, వంతెనలు, కల్వర్టులు తదితర మౌలిక సదుపాయాలకు కలిగే నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)ను విడుదల చేసినట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది వరకే తాను సమీక్షించిన అంశాల మేరకు ఆర్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థాయిల ఆర్ అండ్ బి అధికారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని మంత్రి సూచించారు. జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాకాలం ముగిసే వరకు సూపరింటెండింగ్ ఇంజినీర్ నుంచి అసిస్టెంట్ ఇంజినీర్ వరకు అన్ని స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.అత్యవసర పరిస్థితులను.. ఎదుర్కొనేందుకు అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆయన అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, ముంపు ప్రమాదం ఉన్న రహదారులు, వంతెనలు, కల్వర్టులు, కట్టల బలహీన ప్రాంతాలను ముందుగానే గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ప్రమాదకర ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాలను ముందుగానే గుర్తించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు సంబంధించిన అత్యవసర పనుల్లో ఎలాంటి ఆలస్యం జరగకుండా ఇంజినీర్లకు అప్పగించిన అధికారాల మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

# నాణ్యమైన విత్తనం - అధిక దిగుబడికి పునాది

- రైతు వేదికల్లో విత్తన మేళాలు
- ఒకే వేదికపై రైతులకు నాణ్యమైన విత్తనాలు
- ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల విత్తనాలపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్రవ్యాప్తంగా 2,601 రైతు వేదికల్లో జూన్ 23 నుండి 30 వరకు నిర్వహణ
- వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి



**హైదరాబాద్,జూన్22(మనం న్యూస్):** నాణ్యమైన విత్తనం - అధిక దిగుబడికి పునాది అని, ఒకే వేదికపై రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించటం ద్వారా అధిక దిగుబడులు సాధించ వచ్చునని రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు డా.గోపీ వెల్లడించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వర్షాభావ పరిస్థితులను తట్టుకునే ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం నాణ్యమైన విత్తనం - అధిక దిగుబడికి పునాది అనే నినాధంతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని ఆయన వెల్లడించారు.పప్పు జాతి పంటలను, నూనె గింజ పంటలను, చిరుధాన్యాలు. కూరగాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించే దిశగా రైతులకు ఆయా పంటలకు సరైన విత్తనాలను, నాణ్యమైన విత్తనాలను ఒకే వేదికపై అందుబాటులో ఉంచుటకు ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2601 రైతు వేదికలలో ఈనెల 23వ తేదీ నుండి 30 తేదీ వరకు విత్తన మేళాలు నిర్వహించనున్నట్టు గోపి తెలిపారు. రైతులు తమ అవసరాలకు అనుగుణంగా వివిధ పంటలకు ధ్రువీకరించిన విత్తనాలను సరసమైన ధరలకు కొనుగోలు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని స్పష్టంచేశారు. అంతేకాకుండా ఎల్నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన పంటల ఎంపికపై కూడా రైతులకు మార్గదర్శకాలు అందించనున్నారు.విత్తన మేళాలను రైతులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన ధ్రువీకరించిన విత్తనాలను కొనుగోలు చేసి శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ సంచాలకులు డా. బి. గోపి, రైతులకు సూచించారు.

# న్యాయవాదుల సమస్యల పరిష్కారం కృషి చేస్తా



- న్యాయవాదుల జోలికొస్తే ఉపేక్షించం
- రక్షణ చట్టం పై అవగాహన పెంపొందించుకోవాలి

**సూర్యాపేట, జూన్ 22 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి న్యాయవాదుల రక్షణ కోసం జూన్ 2న తీసుకొచ్చిన న్యాయవాదుల పరిరక్షణ చట్టం న్యాయవాదుల జీవితంలో ఒక మైలురాయి అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో న్యాయవాదులతో కలసి స్థానిక కోర్టు చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన న్యాయవాదుల చట్టంపై న్యాయవాదులు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ కీలకమైందని అలాంటి న్యాయవ్యవస్థకు పిల్లర్లు న్యాయవాదుల అని స్పష్టం చేశారు రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టే న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకొచ్చిందన్నారు.న్యాయవాదులకు ఎలాంటి సమస్యలు ఉన్న నాన్నగారు రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి న్యాయవాదుల పక్కన కూర్చొని ఆ సమస్యలను పరిష్కరించారని గుర్తు చేశారు. మా తండ్రిని ఆదరించినట్లుగా నన్ను ఆదరించి గౌరవించిన వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో కోర్టు భవన నిర్మాణానికి ఇప్పటికే 10 ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సంవత్సరంలో భవన నిర్మాణాన్ని పూర్తి చేసుకుందామన్నారు.న్యాయవాదుల రక్షణ చట్టం అమలులో ఎలాంటి ఇబ్బందులు ఉన్న తనను సంప్రదిస్తే చట్ట అమలుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో న్యాయవాదులపై చేయి వేస్తే సహించేది లేదని తాను ముందుండి అండగా ఉంటానన్నారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తీసుకువచ్చిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయవాదులంతా అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, ప్రభుత్వ న్యాయవాదులు ఫరిదొడ్డిన్, కోణం రఘు, దొరేపల్లి రమేష్, సీనియర్ న్యాయవాదులు బత్తిని వెంకటేశ్వర్లు, సినెపల్లి సోమేశ్వర్ రావు, ఉమాపతి, తల్లమళ్ళ హస్సేన్, బొమ్మగాని శ్రీనివాస్, వి.వి. రావు, టేకుపల్లి శ్రీనివాసరావు, మధుబాబు, డప్పు మల్లయ్య, పోలేబోయిన నర్సయ్య యాదవ్, బుచ్చేశ్వరరావు, పల్లా పరమేష్, ఉట్కూరి సైదులు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి కోటను అత్యంత ఆధునీకరణ చేస్తున్నాం

- మంత్రి జూపల్లి

**యాదాద్రి భువనగిరి, జూన్ 22 (మనం ప్రతినిధి):** భువనగిరి కోట పర్యాటక అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, పురావస్తు శాఖ డైరెక్టర్ డా. అర్జున రావు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సోమవారం భువనగిరి లో కోట క్రింద రోప్ వే, హోటల్ నిర్మాణం, పర్యాటకులకు మౌలిక సదుపాయాలు, కొండ పైన జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అధికారులు, అక్కడ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులతో మంత్రి మాట్లాడారు. వివిధ విభాగాల ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు పనుల్లో తీవ్ర జాప్యం జరిగిందని అసహనం వ్యక్తంచేశారు. కొండ క్రింద(లోయర్ స్టేషన్ లో) రోప్ వే నిర్మాణం, హోటల్, పార్కింగ్, రెస్ట్ రూమ్స్, చిల్డ్రన్ ప్లే ఏరియా, రాక్ గార్డెన్ కు విద్యుత్ దీపాల అలంకరణ, కొండపైన (అప్పర్ స్టేషన్) కోట పునరుద్ధరణ, వాటర్ బాడీస్ బ్యూటిఫికేషన్, కేఫేటేరియా, కోట చరిత్రని తెలియజేయడానికి ఇంటర్ప్రిటేషన్ సెంటర్, మెట్ల పునరుద్ధరణ, ఎంట్రన్స్ ప్లాజా, టికెట్ కౌంటర్, వెయిటింగ్ లాంజ్, రెస్టారెంట్, పర్యాటకులకు మౌలిక సదుపాయాలపై సుదీర్ఘంగా చర్చించారు. భువనగిరి కోటను అత్యంత ఆధునీకరణ చేస్తున్నాం. కోట వైభవం ఉట్టిపడేలా దీనిని తీర్చిదిద్దుతున్నాం అక్టోబర్ 2 నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పనులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పగలు, రాత్రి పనులు చేపట్టాలని ఆదేశించారు అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గత పాలకులు పర్యాటకాన్ని నిర్లక్ష్యం చేశారు. కనీస వసతులు కూడా కల్పించలేదు నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం తెలంగాణను దేశంలోనే అత్యంత ప్రాధాన్య పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడం, పర్యాటకం ద్వారా సంపద సృష్టి, ఉద్యోగ ఉపాధి కల్పన లక్ష్యంగా సమగ్ర కార్యాచరణతో ముందుకుసాగుతున్నాం 2047 నాటికి తెలంగాణను అంతర్జాతీయ స్థాయి ఆధాత్మిక, వారసత్వ సాంస్క ృతిక పర్యాటక కేంద్రంగా మార్చడమే మా ప్రభుత్వ లక్ష్యం. యాదాద్రి, భువనగిరి కోట, కొలనుపాకలను అనుసంధానిస్తూ సమగ్ర ఆధ్యాత్మిక-వారసత్వ పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. తెలంగాణలోనే కాకుండా, భారతదేశం మొత్తంలోనే అత్యంత విశిష్టమైన బౌద్ధ వారసత్వ క్షేత్రాల పరిరక్షణ, పునరుద్ధరణకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దేశ , విదేశీ పర్యాటకులకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం స్వదేశ్ దర్శన్ స్కీమ్ 2.0 కింద వ్యయం రూ. 56.81 కోట్ల అంచనా వ్యయంతో భువనగిరి కోటను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం



వారసత్వ పరిరక్షణ, ఆధునిక సదుపాయాలు, పర్యాటక అనుభవాల మెరుగుదల, రోప్వే ఏర్పాటు ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషికి తెలంగాణ ప్రజలు మద్దతు తెలపాలి. కనీసం నెలకు రెండు సార్లు పర్యాటక ప్రాంతాలను సందర్శించి , తెలంగాణ పర్యాటకాన్ని ప్రోత్సహించాలని కోరారు. కుటుంబంతో ఆహ్లాదంగా గడపడం వల్ల మానసికొల్లాసం కలుగుతుంది. ఆలోచన విధానం మారుతుందని అన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లడుతూ రోప్ వే పనుల పరిశీలన పర్యాటకులకు ఎంతగానో ఉపయోగపడే భువనగిరి ఖిల్లారోప్ వే పనుల ప్రగతిని వారు ప్రత్యేకంగా పరిశీలించారు.తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ( టి ఎస్ టి డి సి / టి జి టి డి సి) ఆధ్వర్యంలో కోట పరిసరాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ పర్యాటక రంగ అభివృద్ధి పనులను, మౌలిక వసతుల కల్పనను వారు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడుతూ₹.. భువనగిరి కోటను రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న రోప్ వే పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా అత్యంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను మరియు కాంట్రాక్టర్లను ఆదేశించారు. కొనసాగుతున్న అన్ని అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలన్నారు.

భువనగిరి నియోజకవర్గ పరిధిలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి మరియు ఆధునిక వసతుల కల్పనకు పెద్దపీట వేసేలా తమ వంతు పూర్తి సహకారం ఈ కార్యక్రమం లో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- ఈనెల 25 నుండి బిఎల్ఓ లు ఇంటింటికి వస్తున్నారు
- బిఎల్ఓ లకు ప్రజలు సహకరించాలి
- జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**నల్గొండ - జూన్ 22 (మనం ప్రతినిధి ):** అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో 'ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ' కార్యక్రమం ద్వారా పారదర్శక ఓటరు జాబితాను రూపొందించేందుకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ కోరారు.సోమవారం 'సర్ ' పై తన చాంబర్లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 నుండి జూలై 24 వరకు బిఎల్ఓ లు ఇంటింటిని సందర్శిస్తున్నారని, ఇందులో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వడం జరుగుతుందని, ఈ కార్యక్రమం సవ్యంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు .ఈ విషయంలో బిఎల్ఓ లకు బిఎల్ఏలు పూర్తి సహకారం అందించాలని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఈనెల 25 నుండి జూలై 24 వరకు బిఎల్ఓల ఇంటింటి సందర్శన ఉంటుందని, జూలై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ఉంటాయని, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని, జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు ముసాయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని, తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1 ,2026న ప్రచురించనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో ఓటర్ల మ్యాపింగ్ తర్వాత 1316063 మంది ఓటర్లను మ్యాపింగ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. బి ఎల్ వో లు ఇంటింటి సందర్శన సందర్భంగా ప్రతి ఓటర్ కు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వడం జరుగుతుందని, ఒకటి బిఎల్ఓ దగ్గర ఉంటుందని, మరొకటి ఓటర్ కు ఇస్తారని, ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్యూమరేషన్ ఫామ్ లో వివరాలను ఇవ్వలేకపోతే ఓటర్ పోర్టల్ ద్వారా కూడా వివరాలను సమర్పించవచ్చని కలెక్టర్ వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం తీసుకో లేకపోయినా, లేదా సమర్పించలేకపోయినా పొరపాటున లెక్కించకపోయిన, లేదా జాబితాలోకి రాకపోయినా గుర్తించి వారు జాబితాలో నమోదయ్యేలా సహకరించాలని కోరారు. ప్రత్యేకించి బిఎల్వోలు, బిఎల్ఓ సూపర్వైజర్లు, నియమించబడిన అధికారులు నెల రోజులపాటు క్షేత్రస్థాయిలోనే ఉంటారని, వారికి సమాచారం అందించాలని చెప్పారు. సర్ లో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం తో పాటు, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలు ,మండల తహసిల్దార్ కార్యాలయాల్లో కూడా హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ప్రకారమే సర్ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, ఎవరు ఎలాంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగా నివాసం ఉన్నచోట ఓటు హక్కును వినియోగించుకోవచ్చని, ఈ విషయం బిఎల్ఎ ల ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓటు హక్కు లేకుండా, అలాగే చనిపోయిన వారు, శాశ్వతంగా చిరునామా మారిన వారి వంటి వాటిని తీసి వేసి పారదర్శకమైన ఓటరు జాబితా



రూపొందించడంలో భాగంగానే సర్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఓటరు జాబితాలో ఉండాలని , అదేవిధంగా అనర్హులు జాబితాలోకి రాకూడదని ఆయన వెల్లడించారు. బిఎల్ఎలు ప్రజా ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి వాలంటీర్ల సహకారాన్ని కూడా తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. సర్ కు సంబంధించి మీడియాలో వచ్చే వార్త కథనాలను ఎప్పటికప్పుడు మానిటర్ చేసేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మీడియా మానిటరింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 25 నుండి 28 వరకు ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ ఉంటుందని, అందువల్ల రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యంగా తీసుకొని అందరికీ ఫారమ్స్ చేరే విధంగా చూడాలన్నారు. ఈ విడత ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ప్రతి 1200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. అందువల్ల ఓటర్లందరూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వచ్చే బీఎల్ఓ లకు పూర్తి సమాచారాన్ని ఫామ్ ద్వారా అందించాలని, ఈ విషయంపై విస్తృత ప్రచారం కల్పించాలని ఆయన కోరారు. బిఎల్ఎలు వారికి జారీ చేసిన గుర్తింపు కార్డులను ధరించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో సహకరించాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ,బీఎస్పీ నుండి భాషపాక శివ, బిజెపి నుండి పి. లింగస్వామి, సిపిఐ నుండి నర్సిరెడ్డి ,బిఆర్ఎస్ నుండి పిచ్చయ్య, ఏఏపి పార్టీ తరపున అద్దంకి రవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణమూర్తి, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలి



- జిల్లా కలెక్టర్

**యాదాద్రి భువనగిరి, జూన్ 22 (మనం ప్రతినిధి):** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టర్ ఛాంబర్ లో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులను ప్రజల నుండి స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 94 అర్జీలను స్వీకరించారు. అందులో రెవిన్యూ శాఖ 63, జిల్లా గ్రామీణభివృద్ధి 8, మున్సిపాలిటీ 6,సర్వే ల్యాండ్ 6, జిల్లా పరిషత్ 2, ఈఈ ఆర్ అండ్ బి 2, విద్యా 2, ఏ డి మైన్స్,సంక్షేమ శాఖ, సోషల్ వెల్ఫేర్, ఎక్సజ్, ప్రణాళికా శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కల్పనా,జడ్పీ సీఈవో శోభారాణి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి సహకారంతో చిన్నగ్రామాలు సైతం అభివృద్ధి పథంలో



- కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్నవెంకటరెడ్డి

**నేరేడుచర్ల జూన్ 22 మనం న్యూస్:** రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో చిన్న గ్రామాలు సైతం నేడు అభివృద్ధి పథంలో ముందడుగు వేస్తున్నాయని నేరేడుచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి అన్నారు. నేరేడుచర్ల మండలం పుల్గంబండ తండ గ్రామ పంచాయతీ లో ఖ్ఖాఖుఎఖి నిధులతో సంఘ బంధం భవనము 10 లక్షలు , అంగన్వాడీ కేంద్రం 12 లక్షలు మరియు సిసి రోడ్ 5 లక్షల రూపాయలతో నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకట్ రెడ్డి ఎంపీడీవో డి సోమసుందర్ రెడ్డి ఎంపీవో ఇ. నాగరాజు పంచాయతీ రాజ్ ఏ ఈ కళ్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పుల్గంబండ తండ గ్రామ సర్పంచ్ బానోతు మంగమ్మ , జుఉప సర్పంచ్ బానోతు మంగ, వార్డ్ మెంబెర్స్ బానోతు రంగమ్మ, బానోతు నాగరాజు, రామావత్ సైదమ్మ, రామావత్ కోటేశ్వర్ రావు అంగోతు చిన్ని పంచాయతీ కార్యదర్శి మచ్చ నర్సింహా,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై తక్షణమే పరిష్కరించాలి



**సూర్యాపేట, జూన్ 22 (మనం ప్రతినిధి):** వివిధ సమస్యలపై ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్న ఫిర్యాదులకు తక్షణమే పరిష్కరించేలా అధికారులు చూడాలని జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా ఎస్పి పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఎస్పి ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ... ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు.

ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, జూన్ 22 (మనం ప్రతినిధి)** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, డిఆర్ఓ రాజేశ్వరి లతో కలిసి కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.సుల్తానాబాద్ మండలం రేగడి మద్దికుంట గ్రామానికి చెందిన నోముల రాజేశ్వర్ రెడ్డి తమ ఇంటిని ఆన్లైన్లో నమోదు చేసేందుకు దరఖాస్తు చేసుకోగా పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తమ పేరు నమోదు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఎంపిడిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రామగుండం గౌతమినగర్ కు చెందిన డి కాశయ్య మల్కాపురం గ్రామంలో సర్వేనెంబర్ 125/3 లో గల 20 ఎకరాల భూమి గతంలో ఎక్స్ సర్వీస్ మెన్ కోసం 1981 లో కేటాయించడం జరిగిందని , దీనిలో ఎటువంటి ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనుమతి ఇవ్వరాదని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్డీవో పెద్దపల్లి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఓదెల మండలం గూడెం గ్రామానికి చెందిన వేముల నర్సమ్మ సర్వే నెంబర్ 474/1 లో ఎకరం భూమి ఉందని , తన భూమిని కొంతమంది ఆక్రమించాలని చూస్తున్నారని, తన భూమి జోలికి ఎవరు రాకుండా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ఓదెల కు రాస్తూ నిబంధనలు ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గోదావరిఖని సూర్య నగర్ కు చెందిన ఆర్. రాధ తన కుమారుడికి ప్రభుత్వ విద్యా సంస్థలోని హాస్టల్లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా విద్యాశాఖ అధికారికి రాస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం



**పాలకీడు, జూన్ 22 (మనం న్యూస్):** హుజూర్ నగర్ నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో పాలకవీడు మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని మాజీ ఎంపీపీ భూక్యా భూపాల్, మాజీ జెడ్పిటిసి మాలోత్ మోతిలాల్ నాయక్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నరసింహారావు లు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోమటికుంట గ్రామంలో రూ 5 లక్షల నిధులతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. పాలక వీడు మండల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్ ఇప్పటికే 500 కోట్ల రూపాయలు మంజూరు చేశారని , మరిన్ని నిధులతో రాష్ట్రానికే ఆదర్శ మండలంగా తీర్చి దిద్దుతారనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. కార్యక్రమంలో కోమటికుంట, చెరువు తండా, జాన్ పహాడ్ గ్రామాల సర్పంచ్ లు వడిత్య సునీత లక్ష్మణ్, లక్ష్మీ సైదా, కవితా కిరణ్, ఉప సర్పంచ్ మాధవి బుచ్చయ్య,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు నాగరాజు ,శ్రీను నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సేవే లక్ష్యంగా వాసవి క్లబ్




**నేరేడుచర్ల, జూన్ 22 (మనం న్యూస్):** సేవే లక్ష్యంగా నేరేడుచర్ల వాసవి క్లబ్ వివిధ పనులు చేస్తూ పట్టణంలో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఏర్పరచుకుంది. నేరేడుచర్ల వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. డాన్ టు డెస్క్ పది సేవ కార్యక్రమములు నిర్వహించారు. అవసరం ఉన్నచోట సిమెంట్ బెంచీల ఏర్పాటు ఆలయంలోని గోవులకు మంచినీటి గాబు గోవుకు మూడు బస్తాల దణా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు బ్లడ్ డోనర్స్ బ్యానర్స్ ఎమర్జెన్సీ నెంబర్స్ బ్యానర్స్. మెడికల్ కిట్, స్కూలు మెరిట్ విద్యార్థులకు శాలువాల తో సన్మానం ఇలా అనే క కార్యక్రమాలు నిర్వహించారు వాసవి క్లబ్ ప్రెసిడెంట్ నీలా రామ్మూర్తి ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా బెజిగం రాజేశ్వరరావు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఇంటర్నేషనల్ ఆర్. సి..లకుమారపు పాండురంగారావు. ఆర్. ఇ. సి .ఓరుగంటి వెంకటేశ్వర్లు. జెడ్సి కె. ఇందిరా, క్లబ్ ఆఫీసర్స్ ఉప్పల విద్యాసాగర్, మిట్టపల్లి రమేష్ . గెల్లిలక్ష్మీ ప్రసన్న, వనిత క్లబ్ ప్రెసిడెంట్ చారగుండ్ల మల్లికా, వాసవి క్లబ్ ట్రెజరర్. చారగుండ్ల వెంకటేశ్వర్లు, వనిత క్లబ్ సెక్రటరీ రేపల ఉర్మిలా ట్రెజర్ జెగిని శ్రీవాణి, క్లబ్ సభ్యులు కొత్త లక్ష్మణ్, కందిబండ శ్రీనివాసరావు ఊట్కూరి నటరాజ్ , పోలిశెట్టి వెంకటేశ్వర్లు, జూలూరు అశోక్, పాల్వాయి గోపాలకృష్ణ, పోతుగంటి సత్యనారాయణ , వంకాయల శ్రీను గుంటూరు శ్రీనివాసు, పారేపల్లి అశోక్, తాళ్లూరు శ్రీనివాస్, తడకమళ్ళ పరమేశం, గరిణె వాసు కొక్కళ్ళ వెంకటేశ్వర్లు, చెక్క లక్ష్మణ్, వనిత సభ్యులు నే జ్యోతి కొక్కళ్ల సుజాత, వంకాయల విజయ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల ఫిర్యాదులను స్వీకరణ

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్గొండ -- జూన్ 22 (మనంన్యూస్):** నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 43 మంది బాధితులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న కేసులు, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ కట్టుబడి ఉందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా అందిన వినతులపై సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు.



## ఎస్సైని సన్మానించిన ప్రజా సంఘాల నాయకులు



**మహాదేవపూర్ జూన్ 21మనం న్యూస్:** మహాదేవపూర్ ఎస్సైగా నూతనంగా వచ్చిన ఎస్ఐ సాంబమూర్తిని సోమవారం రోజున ప్రజా సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి లింగాల రామయ్య,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు బోడరాజు, మరియు దళిత సీనియర్ నాయకులు చందు తో పాటు పలువులు పాల్గొన్నారు.

## వైభవంగా విగ్రహ పునర్ప్రతిష్ట



**మల్హార్, జూన్ 21( మనం న్యూస్):** మండల కేంద్రంలోని వల్లెం కుంట గ్రామం లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం పునరప్రతిష్ట కార్యక్రమం వైభావంగా జరుగుతుంది. గత రెండు నెలల క్రితం ఆలయం లోని ధ్వజ స్థంభం విరగడం తొ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లో నూతమ ధ్వజ స్థంభం తొ పాటు ఆలయం లోని విగ్రవాలను పునరప్రతిష్టంచడం జరుగుతుంది. ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుంది అని ఆలయ కమిటీ తెలియజేయడం జరిగింది. ఇవ్వాళా మొదటి రోజూ లో భాగంగా హోమం జరిపించడం జరిగింది అని నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కోమల రాజిరెడ్డి గ్రమ సర్పంచ్ బొమ్మ రజిత రమేష్ రెడ్డి ఉప సర్పంచ్ కటకం సప్న నరేష్ పాల్గొని ప్రత్యేక పూజా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామ ప్రజలు అందరూ భక్తి నిష్టల తొ పాలొగొన్నారు.

## నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టివ్వాలి




**భీమదేవరపల్లి జూన్ 22 మనం న్యూస్:** ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇల్లు కట్టివ్వాలని సిపిఐ కార్యకర్తలు ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. సోమవారం రోజున మండల సిపిఐ పార్టీ కార్యకర్తలు తో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్ వినతి పత్రం ఎమ్మార్వో రాజేష్ కుఅందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో నాలుగు సంవత్సరాల క్రితం 58 జీవో ప్రకారం దరఖాస్తు చేసుకున్న 500 మంది నిరుపేదలకు ప్రతి ఒక్కరికి నివేషణ స్థలం తో పాటు ఇందిరమ్మ ఇల్లు కట్టి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మండల కార్యదర్శి ఆదరి రమేష్, కొత్తపల్లి గ్రామ శాఖ కార్యదర్శి బూడ బాలరాజు, గట్ల నర్సింగాపూర్ కార్యదర్శి చుంచు కుమారస్వామి, బుల్లెట్ పల్లి గ్రామ కార్యదర్శి సన్నీల్లా రవి, ఆరేపల్లి పుష్ప, ఆరేపల్లి కొమురయ్య, రాగాల చంద్రయ్య, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**వరంగల్, జూన్ 22(మనంన్యూస్):** జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ (గ్రాఇక్షు) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో డిసిపి అంకిత కుమార్ అదనపు కలెక్టర్ జి సంధ్యారాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణ, అక్రమ రవాణా నివారణ, యువతలో అవగాహన కల్పించడం, విద్యాసంస్థల్లో చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాల, కళాశాలల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నిషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమానికి సంబంధించి వివిధ శాఖలు అధికారులు కార్యాచరణ ప్రణాళికలు, పురోగతి నివేదికలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్ ఆర్డీవో సుమ నర్సంపేటఆర్డీవో ఉమారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాంబశివరావు, టి డబ్ల్యూ ఓ రాజమణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చే పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.

## పోచంపల్లికి అధ్యక్ష పదవి



**భీమదేవరపల్లి జూన్ 22 మనం న్యూస్:** భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి నియమితులయ్యారు. సోమవారం రోజున మల్లారం గ్రామ వాస్తవ్యులు కాంగ్రెస్ నాయకులు పోచంపల్లి రాజిరెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియామక పత్రం తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, డిసిసి అధ్యక్షులు ఎనగాల వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నియామక పతన స్వీకరించారు. మండల కాంగ్రెస్ నాయకులు, నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులకు మాదకద్రవీణపై అవగాహన

- ఆంటీ డ్రగ్ సోల్జర్స్‌గా రూపాంతరం చెందాలి:
- వంగర ఎస్సై దివ్య

**భీమదేవరపల్లి జూన్ 22 మనం న్యూస్:** మాజీ ప్రధాని పివి స్వగ్రామ లో విద్యార్థులకు మాదకద్రవేయులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం రోజున వంగర ఎస్సు దివ్య వంగరలోని పివిఆర్ రెసిడెన్షియల్ పాఠశాల, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ సామాజికంగా దురాలవాట్లకు నివారించడంలో విద్యార్థులకు బాధ్యత ఉందని అన్నారు. విద్యార్థులు బాధకద్రవ్యాలు వాడటం వల్ల కలిగే దుష్ప్రభావాలు డ్రగ్ రహిత సమాజ స్థాపనలో తెలంగాణ పోలీస్ పాత్ర గురించి వివరిస్తూ మాదకద్రవేయుల వ్యక్తి వ్యతిరేక ప్రతిజ్ఞ విద్యార్థుల చేయించారు. విద్యార్థులు యాంటీడ్రగ్ సోల్జర్స్ గా రూపాంతరం చెంది డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటుకు నడుం బిగించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



# విద్యార్థులకు టీ-షర్టుల పంపిణీ



- మడక మధు దాతృత్వం

**మహాదేవపూర్ జూన్21మనం న్యూస్:** మహాదేవపూర్ మండలంలోని ఎం.పి.పి.ఎస్ పెద్దంపేట మరియు ఎం.పి.పి.ఎస్ రాపలి కోటప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు డి.టి.ఎఫ్ జిల్లా కౌన్సిలర్ మడక మధు తన సొంత ఖర్చులతో టీ-షర్టులను అందజేశారు. పెద్దంపేట పాఠశాలలో జరిగిన పంపిణీ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బీసుల లావణ్య ముఖ్య అతిథిగా హాజరైవి ద్యార్థులకు టీ-షర్టులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమెమాట్లాడుతూ,మడక మధు విద్యార్థుల కోసం చేస్తున్న సేవలు అభినందనీయమని, ఆయన దాతృత్వం ఇతరులకు ఆదర్శమని కొనియాడారు. డి.టి.ఎఫ్. జిల్లా కౌన్సిలర్ మడక మధు మాట్లాడుతూప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంచడానికే ఈ చిన్న ప్రయత్నం.ఒకే రంగు టీ-షర్ట్ వేసుకున్నప్పుడు పిల్లల మధ్య సమానత్వ భావన పెరుగుతుంది. చదువుతో పాటు పిల్లల వ్యక్తిత్వ వికాసానికి వేంవ ఎప్పుడ ూతోడ ుగా ఉంటాం.ఇదిఆరంభంమాత్రమే, మండలంలోని అన్ని పాఠశాలలకు విడతలవారీగా సహాయం అందస్తాంఅని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ మండల డీటీఫ్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షులు సాయికుమార్, రామమూర్తి, ఎం.పి.పి.ఎస్ పెద్దంపేట ప్రధానోపాధ్యాయులు బిక్షపతి, ఎం.పి.పి.ఎ స్రాపల్లి కోటప్రధానోపాధ్యాయురాలుయాస్మిన్,ఉపాధ్యాయులు రూప, మమత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా - 'భరోసా' కేంద్రం

- ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఐ

**ములుగు, జూన్ 22, మనం ప్రతినిధి:** మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఐ పి ఎస్ ఆధ్వర్యంలో ఈ రోజు జిల్లా స్థాయి కన్వర్జెన్స్ సమావేశం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లైంగిక వేధింపులు, పోక్సో, గృహహింస వంటి కేసుల బాధితులకు వైద్యం, కౌన్సెలింగ్, న్యాయ సహాయం, పరిహారం, ఆశ్రయం మరియు పునరావాస సేవలు సకాలంలో అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భరోసా సెంటర్ ద్వారా ఈ ఏడాది ఇప్పటివరకు బాధితులకు కౌన్సెలింగ్, వైద్య సహకారం, న్యాయ సహాయం, పరిహార ప్రతిపాదనలు, ఆశ్రయం, విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడ్డాయి. అలాగే పలు పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కీలక పాత్ర పోషించింది. బాధితులకు తక్షణ న్యాయం, భద్రత మరియు గౌరవప్రదమైన పునరావాసం కల్పించడంలో ములుగు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందని ఎస్పీ తెలిపారు.ఈ సమావేశంలో ఏటూరునాగారం ఏ ఎస్పీ మనన్ భట్ ఐ పి ఎస్ , డీఎస్ పి కిషోర్ కుమార్, డి డబ్ల్యూ ఓ ప్రేమలత, ఎస్ ఐ రాజ్యలక్ష్మి మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, దర్యాప్తు అధికారులు మరియు భరోసా సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు త్వరిత గతిన పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, జూన్ 22(మనంన్యూస్):** సోమవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ స్వయంగా స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పరిష్కరించేందుకు ప్రజావాణి దరఖాస్తు ఫారం ను ప్రత్యేకంగా రూపొందించి దరఖాస్తు దారులకు సులభతరంగా చేయడమే కాకుండా సంబంధిత అధికారి వెంటనే రిమారక్స్ కాలాన్ని ఏర్పాటు చేయడం పై దరఖాస్తు దారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రజావాణి కి మొత్తం 242 దరఖాస్తులు నమోదయ్యాయి. అందులో రెవెన్యూ శాఖకు 78, మున్సిపాలిటీకి 51, హౌసింగ్ శాఖకు 42, డిబిసిడిఓ 10, అలాగే ఇతర శాఖలకు సంబంధించి 61 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు తక్షణమే ఎండార్స్ చేసి సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఎంహెచ్వో సాంబశివరావు, డి ఆర్ డి ఓ నాగ పద్మజ, డిబిసిడిఓ పుష్పలత, డిడబ్ల్యుఓ రాజమణి మరియు సంబంధిత జిల్లా అధికారులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పీహెచ్సీలో అర్ధరాత్రి ప్రసవం

**ఆత్మకూరు (ఎస్), జూన్ 22(మనంన్యూస్):** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక మహిళ సురక్షితంగా మగబిడ్డకు జన్మనిచ్చింది. సాధారణ కాన్పు కావడంతో అటు కుటుంబ సభ్యులు ఇటు వైద్య సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**సెలవు రోజైనా అంకితభావం...**

ఆదివారం సెలవు దినం అయినప్పటికీ, రాత్రి వేళలో గర్భిణికి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆత్మకూరు (ఎస్) పీహెచ్సీకి తీసుకువచ్చారు. కేవలం 12 గంటల పాటు మాత్రమే సేవలందించే కేంద్రం అయినప్పటికీ, అత్యవసర పరిస్థితిని గమనించిన వైద్యాధికారి డాక్టర్ రమ్య ఆమె బృందం వెనుకాడలేదు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, అర్ధరాత్రి 11:27 గంటలకు మహిళకు విజయవంతంగా నార్మల్ ప్రసవం చేశారు దీంతో తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



**వైద్య బృందానికి పలువురు ప్రశంసలు...**

సెలవు రోజైనా సరే లెక్కచేయకుండా, అర్ధరాత్రి వేళలో సమన్వయంతో పనిచేసి అంకితభావాన్ని చాటుకున్న డాక్టర్ రమ్య.పీహెచ్సీ సిబ్బందిపై స్థానిక ప్రజలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకాన్ని పెంచేలా శ్రమించిన ఈ బృందం చూపిన ఈ నిబద్ధత, అంకితభావంపై ఆత్మకూరు ప్రజలందరికీ గర్వకారణంగా ఉందని పలువురు కొనియాడుతున్నారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

- హాస్టల్, విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్లపల్లి లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ

**రాజన్న సిరిసిల్ల, జూన్ -22(మనం ప్రతినిధి ):** మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లిలోని సిరిసిల్ల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా వారితో మాట్లాడారు. ఈరోజు ఏ ఏ ఆహార పదార్థాలు వడ్డించారో ఆరా తీశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు వచ్చారో ఆరా తీశారు. అనంతరం వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరయ్యాలా చూడాలని సూచించారు. విద్యాలయాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.



# డి-సిల్టేషన్ పేరుతో గోదావరి ఇసుక దోపిడీ

- బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు కుడుముల లక్ష్మీనారాయణ



**ములుగు,జూన్ 22మనం ప్రతినిధి :** మండలంలోని గంపోనిగూడెం గ్రామ సమీపంలో పొదుమూరు రెవెన్యూ పరిధిలోని పట్టా భూముల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయని చూపిస్తూ, రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్, భూగర్భ జలాలు, ఇరిగేషన్ తదితర శాఖల నుంచి అనుమతులు పొంది, రాజకీయ అండదండలతో కొందరు ఇసుక కాంట్రాక్టర్లు గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు కుడుముల లక్ష్మీనారాయణ ఆరోపించారు. మండల కేంద్రం సమీపంలోని దొంగలవార్రె ప్రాంతంలో నడి గోదావరిలో భారీ యంత్రాలతో ఇసుకను అక్రమంగా తవ్వి, లారీల ద్వారా తరలిస్తూ కోట్ల ప్రజా సంపదను దోచుకుంటున్నారు.ఈ వ్యవహారం పూర్తిగా అక్రమమని తెలిసినా, ఇసుక కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకొని అధికార పార్టీ నాయకులు ప్రేక్షకుల పాత్ర పోషిస్తున్నారని మండిపడ్డారు. గోదావరి ఒడ్డునుంచి కిలోమీటర్ల మేర నదిలో రహదారి నిర్మాణం జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలపై గతంలో గంపొనిగూడెం గిరిజన సహకార సంఘం ఇసుక క్వారీ అనుమతి కోరగా, ఈ ప్రాంతం ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలోకి వస్తుందని పేర్కొంటూ అనుమతి నిరాకరించారు.అదే ప్రాంతంలో ఉన్న పట్టా భూములకు మాత్రం ఇసుక తవ్వకాల అనుమతులు ఎలా ఇచ్చారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘానికి వర్తించిన ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనలు పట్టా భూములకు వర్తించవా? అధికార పార్టీ ఒత్తిడితో నిబంధనలను పక్కన పెట్టి అనుమతులు ఇచ్చారా అని ప్రశ్నించారు. కరకట్ట మరియు రహదారి నిర్మాణంపై పొదుమూరు ప్రాంతం నుంచి కరకట్ట నిర్మాణం ఇప్పటికే చేపట్టబడిందని, పాత కరకట్ట నిర్మాణ అవశేషాలను తొలగించి రహదారి ఏర్పాటు చేసి ఇసుక తరలిస్తున్నప్పటికీ అధికారులు స్పంది ంచకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. గిరిజనులకు లబ్ధి చేకూరుస్తామని చెప్పుకునే ప్రభుత్వం, గిరిజన సంఘానికి అనుమతి ఇవ్వకుండా, ఎకో సెన్సిటివ్ జోన్లో ఉన్న పట్టా భూములకు అనుమతులు ఇవ్వడం వెనుక కారణాలు వెల్లడించాలని కోరారు.సీతమ్మ సాగర్ ప్రాజెక్టు డి-సిల్టేషన్ పేరుతో మంగపేట మండలంలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, ఇది పూర్తిగా అనుమానాస్పద వ్యవహారమని పేర్కొన్నారు. ప్రభుత్వమే ఇచ్చిన సమాచార ప్రకారం మంగపేట మండలంలోని ఏ గ్రామమూ సీతమ్మ సాగర్ ప్రాజెక్టు ముంపు పరిధిలోకి రావడం లేదన్నారు. ముంపు ప్రభావం లేని ప్రాంతంలో డి-సిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలకు అనుమతులు ఎవరి ఒత్తిడితో ఇచ్చారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు గతంలో సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పనులు నిలిపివేయబడ్డాయని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితిలో ప్రాజెక్టు పేరుతో ముంపు లేని ప్రాంతంలో డి-సిల్టేషన్ చేపట్టడం చట్టబద్ధమేన అని ప్రశ్నించారు.

## మత్తు పదార్థాల వ్యతిరేకఅవగాహన కార్యక్రమం



**మహాదేవపూర్ జూన్ 22మనం న్యూస్:** మహదేవపూర్ మండలంలోని గ్రామం బ్రాహ్మణపల్లి పరిధిలోని పోలీస్ స్టేషన్ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.యువత, విద్యార్థులు గ్రామప్రజల కుగంజాయి,డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం ,కుటుంబం, సమాజంపై పడేచెడుప్రభావాలనువివరించడం. జరిగిందిమత్తు పదార్థాల వాడకం వల్ల కాలేయం,గుండె, మెదడు దెబ్బతినడం, మానసిక వ్యాధులు రావడం వంటి ఆరోగ్య సమస్యలు గురించి తెలపడం జరిగింది డ్రగ్స్కు అలవాటు పడితే చదువు,ఉద్యోగం,కుటుంబ పరువు కోల్పోయి నేరాల వైపు మళ్లే ప్రమాదం. జరుగుతుందని ఎస్సు సాంబమూర్తి తెలిపారు అదేవిధంగాచెడు స్నేహాలు, ఒత్తిడి కారణంగా యువత డ్రగ్స్ వైపు పోవద్దని తెలపడం జరిగింది అదే కాకుండాగ్రామంలో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నా, సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి గ్రామంలో మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా,వినియోగం పూర్తిగా నిషేధం. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎండి పిఎఫ్ చట్టంప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి. ప్రజలు నిర్భయంగా సమాచారం ఇవ్వాలని అలాగే సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచ బడతాయి.డ్రగ్స్ వద్దు జీవితం ముద్దుమత్తు వద్దుభవిష్యత్తు ముద్దు అనేని నాదంతోప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. అదేవిధంగా పిల్లలతల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడలు, చదువు, నైపుణ్యాలపై దృష్టి పెట్టాలనివారు తెలపడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఎస్సు సాంబమూర్తి మరియుపోలీస్ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఇంగ్లాండ్‌కు ఐసీసీ భారీ షాక్!

## 12 ఓవర్లకు 12 పాయింట్లు కోత..




న్యూజిలాండ్ తో మూడు టెస్టుల సిరీస్ లో ఇంగ్లాండ్ 1-1తో సమంగా ఉంది. మొదటి మ్యాచ్ లో ఇంగ్లాండ్ గెలవగా.. రెండో మ్యాచ్ లో కివీస్ 253 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టెస్టుకు రెగ్యులర్ సారథి బెన్ స్టోక్స్ దూరం కాగా.. ఘోర పరాజయం చవిచూసింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్ కు ఐసీసీ గట్టి షాక్ ఇచ్చింది. ఈ జట్టుకు పాయింట్లను తగ్గించింది. ఇప్పటికే పర్సంటేజీ తగ్గగా.. పాయింట్లలోనూ భారీగా కోత పడటంతో డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ లో ఇంగ్లాండ్ ఏడో స్థానంలో ఉంది.

ఆదివారం న్యూజిలాండ్ తో రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోయింది. దీంతో డబ్ల్యూటీసీ పట్టికలో ఈ జట్టు పర్సంటేజీ 34.72 నుంచి 26.38 శాతానికి పడిపోయింది. రెండో టెస్టు మ్యాచ్ కు ముందు ఇంగ్లాండ్ ఖాతాలో 50 పాయింట్లు ఉన్నాయి. కానీ, ఈ టెస్టులో ఏకంగా 12 ఓవర్లను ఆలస్యంగా వేయడంతో 12 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో పాయింట్ల సంఖ్య 50 నుంచి 38కి తగ్గింది. కెప్టెన్ గా వ్యవహరించిన జో రూట్ తోపాటు సహచరులందరికీ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానాగా పడింది.

**బెన్ స్టోక్స్ వచ్చేశాడు..**

స్వదేశంలో సిరీస్ ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న ఇంగ్లాండ్ కు ఓ గుడ్ న్యూస్. బాక్సర్ తో గొడవ కారణంగా రెండో టెస్టు ఆడలేకపోయిన కెప్టెన్ బెన్ స్టోక్స్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. కివీస్ తో మూడో టెస్టు కోసం ప్రకటించిన స్క్వాడ్ లో అతడికి చోటు దక్కింది. కెప్టెన్ రాకతో తుది జట్టులో ఎవరిని పక్కన పెడతారో చూడాలి. జూన్ 25 నుంచి నాటింగ్ హామ్ వేదికగా మూడోటెస్టు ప్రారంభం కానుంది.




## 2027 వన్డే ప్రపంచకప్.. రోడ్ మ్యాప్ సిద్ధం!

వన్డే ప్రపంచ కప్ 2027 టోర్నీకి నిర్దిష్టమైన ప్రణాళిక (రోడ్మ్యాప్)ను రూపొందించడం ప్రారంభమైందని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. ప్రపంచ కప్ ముందు టీమ్ఇండియా తగినన్ని 50 ఓవర్ల క్రికెట్ మ్యాచులు ఆడేలా చూస్తామని తెలిపారు. ''వచ్చే ఏడాది అక్టోబర్ లో టోర్నీ ప్రారంభం కానుంది. ఇప్పటికే ఇంగ్లాండ్ తో మూడు వన్డేల సిరీస్ ను భారత్ ఆడనుంది. జులై 14 నుంచి 19 వరకు ఆ సిరీస్ జరగనుంది. రాబోయే కాలంలో మరిన్ని మ్యాచులను నిర్వహించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. మ్యాచ్ ప్రాక్టీస్ వల్ల కప్పు గెలిచేందుకు అవకాశాలు మెరుగవుతాయని'' అని సైకియా పేర్కొన్నారు.



## ఫుల్ స్వింగ్‌లో చిరు-బాబీ మూవీ

అగ్ర కథానాయకుడు చిరంజీవి ఫుల్ జోష్ లో ఉన్నారు. ఆయన సినిమా మొదలు పెట్టడమే ఆలస్యం పరుగులు పెట్టిస్తున్నారు. చిరు కీలక పాత్రలో బాబీ దర్శకత్వంలో ఓ మూవీ రూపొందుతున్న సంగతి తెలిసిందే. మెగా158 (వర్కింగ్ టైటిల్)గా రానున్న ఈ మూవీ షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఇటీవలే పొల్లాచ్చిలో కీలక షెడ్యూల్ ని పూర్తి చేసుకుంది. సోమవారం నుంచి హైదరాబాద్ లో కొత్త షెడ్యూల్ మొదలైంది. చిరుతో పాటు ప్రధాన తారాగణంపై కీలక టాకీ పార్ట్ ను చిత్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో పొల్లాచ్చి షెడ్యూల్ లో షూటింగ్ కు సంబంధించిన విశేషాలతో కూడిన వీడియోను చిత్ర బృందం పంచుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు, యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.

'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత చిరు - బాబీ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్లే ఈసారి ఓ చక్కటి భారీ మాస్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో చిరు రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రానికి సంగీతం తమన్, ఛాయాగ్రహణం విజయ్ కార్తీక్ కన్నన్ అందిస్తున్నారు.

## నాలుగేళ్ల కిందట సెరెనా రిటైర్ మెంట్.. వైల్డ్ కార్డుతో రీఎంట్రీ



సెరెనా విలియమ్స్.. అమెరికా టెన్నిస్ దిగ్గజం. నాలుగేళ్ల కిందట ప్రొఫెషనల్ టెన్నిస్ కు వీడ్కోలు పలికిన ఈ స్టార్ మళ్లీ రాకెట్ తో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్న వింబుల్డన్ లో అడుగు పెట్టనుంది. నిర్వాహకులు ఇప్పటికే ఆమెకు వైల్ కార్డు ఎంట్రీ ఇచ్చారు. మహిళల సింగిల్స్ ఈవెంట్ లో ఆమె పునరాగమనంపై వింబుల్డన్ ఛాంపియన్ షిప్ సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టు పెట్టింది. ''ఇది డ్రిల్ కాదు.. 2026 వింబుల్డన్ మహిళల సింగిల్స్ లో వైల్ కార్డు ఎంట్రీతో సెరెనా విలియమ్స్ పోటీ పడనుంది'' అని సెరెనా ఇమేజ్ ను పోస్టు చేసింది. సెరెనా సోదరి వీనస్ విలియమ్స్ కూ డబుల్స్ లో వైల్ కార్డ్ ఎంట్రీ దక్కింది.



## అదంతా ముగిసిపోయింది: విరాట్ కోహ్లీ



టీమ్ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ గతేడాది టెస్టు క్రికెట్కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. కెప్టెన్ గా భారత జట్టుకు అద్భుత విజయాలు అందించిన అతడు.. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ లో ఆడి అంతర్జాతీయ క్రికెట్ కు గుడ్ బై చెప్పేస్తాడనే అంచనాలున్నాయి. అయితే, ఇప్పటికీ ఫిట్గా.. ఫామ్ లో ఉన్న కోహ్లీ టెస్టుల్లో పునరాగమనం చేయాలని కోరుకొనేవారు లేకపోలేదు. తాజాగా ఓ ఈవెంట్ లో పాల్గొన్న విరాట్ కోహ్లీకి ఇలాంటి ప్రశ్నే ఎదురైంది. దీనికి అతడు చాలా లౌక్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం.

స్పోర్ట్స్ బ్రాండ్ వన్8 లాంచ్ ఈవెంట్ కు విరాట్ కోహ్లీ హాజరయ్యాడు. ఈ బ్రాండ్ లోని ఓ షూ ధర రూ. 9,230గా ఉంది. టెస్టుల్లో విరాట్ సాధించిన పరుగుల సంఖ్య కూడా అంతే. దానికి కోట్ చేస్తూ.. కార్యక్రమానికి హోస్ట్ గా ఉన్న కమెడియన్ డానిష్ సైత్ ఓ ప్రశ్న సంధించాడు. ''మీరు ఇంకొన్ని పరుగులు చేసి.. ఆ వస్తువు లాభాలను పెంచొచ్చు కదా?'' అని విరాట్ ను అడిగాడు. దీనికి కోహ్లీ బదులిస్తూ.. ''నేను తక్కువ ధరకే అమ్మేయడానికి ఇష్టపడతాను. ఇక మీరు అడుగుతున్న దానితో (టెస్టు క్రికెట్) నా పని అయిపోయింది. ధన్యవాదాలు'' అని చెప్పాడు. దీంతో విరాట్ మళ్లీ టెస్టుల్లోకి పునరాగమనం చేసే అవకాశాలు లేవని స్పష్టమైందని క్రికెట్ వర్గాలు తెలిపాయి.




## జాన్వీ కపూర్ ప్రియుడు అతనే.. హింట్ ఇచ్చిందిగా..!

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ పెద్ది మూవీతో మరో హిట్ తన ఖాతాలో వేసుకుంది. రామ్ చరణ్ హీరోగా వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ గా నిలిచింది. ఈ మూవీ అచ్చియమ్మ పాత్రలో మెప్పించింది బాలీవుడ్ భామ. అయితే ఆమె రోల్ పై పెద్దఎత్తున విమర్శలు రావడంతో ఆమె సీన్స్ ను కొన్నింటిని తొలగించారు. పెద్ది మూవీతో తన గ్లామర్ తో అభిమానులను ఆకట్టుకుంది.


ఇక సినిమా సంగతి పక్కనపెడితే తాజాగా ఈ బ్యూటీ తన ప్రేమ, ప్రియుడి గురించి హింట్ ఇచ్చింది. తాను ధరించిన టీ షర్ట్ పై క్యూట్ కొటేషన్ రాసుకొచ్చింది. ఒకవేళ నేను తప్పిపోతే నా ప్రియుడికి అప్పజెప్పండి ప్లీజ్.. శిఖర్ పహారియా పేరు రాసిన టీ షర్టు ధరించింది. చూసేందుకు ఇదంతా ఫన్నీగా ఉన్నా.. ఈ ముద్దుగుమ్మ తన లవ్ గురించి ఓపెన్ గానే చెప్పినట్లు ఉందంటున్నారు. ఇది కాస్తా వైరల్ కావడంతో జాన్వీ కపూర్.. ప్రియుడు శిఖర్ పహారియానే అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



## నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది: సమంత

నటి సమంత ప్రస్తుతం హ్యాపీ మోడ్ లో ఉన్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' విజయం సాధించింది. మరోవైపు ఆమె తల్లి కానుందనే వార్తలు కూడా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తనకు పుట్టే పిల్లల గురించి సమంత గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

కొన్నేళ్ల క్రితం ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ.. ''నా బిడ్డే నా ప్రపంచం అవుతుంది. ఉద్యోగం చేసుకుంటూ పిల్లలను, ఇంటి బాధ్యతలను చూసుకునే మహిళంటే నాకెంతో గౌరవం'' అని అన్నారు. అదే ఇంటర్వ్యూలో తన బాల్యం గురించి కూడా పంచుకున్నారు. ''నా చిన్నప్పుడు ఎన్నో కష్టాలు పడ్డాను. అలాంటి బాల్యం గడిపిన వారంతా వారి పిల్లలకు విలాసవంతమైన, సౌకర్యవంతమైన జీవితాన్ని ఇవ్వాలనుకుంటారు. నేను కూడా అదే నిర్ణయించుకున్నా. నా బిడ్డ పుట్టిన తర్వాత కొన్ని సంవత్సరాల పాటు తనను వదిలి ఎక్కడికీ వెళ్లను. తనే నా సర్వస్వంగా చూసుకుంటా'' అని చెప్పారు.



తాజాగా జరిగిన 'మా ఇంటి బంగారం' సక్సెస్ సెలబ్రేషన్స్ లో సమంత బేబి బంప్ తో కనిపించారు. ఈ విషయంపై ఆమె సన్నిహిత వర్గాలను అడగ్గా.. సమంత, రాజ్ లకు ఇది చాలా ప్రత్యేకమైన సమయం అని.. వాళ్లిద్దరూ కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నారని వెల్లడించాయి. దీంతో త్వరలోనే సామ్ ఈ గుడ్ న్యూస్ ను అధికారికంగా వెల్లడిస్తారని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**మిలియన్ డాలర్ల క్లబ్ లోకి 'మా ఇంటి బంగారం'..**

సమంత నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' హిట్ టాక్ తో బాక్సాఫీసు వద్ద దూసుకుపోతోంది. మూడు రోజుల్లో రూ.43 కోట్లు వసూలు చేసింది. నార్త్ అమెరికాలో వన్ మిలియన్ డాలర్ల క్లబ్లో చేరింది. సోషల్ మీడియాలోనూ ఈ సినిమాకు సంబంధించిన రీల్స్ వైరల్ గా మారాయి.


**సామ్ నువ్వు అర్హురాలివి: నయనతార విషెస్**

'మా ఇంటి బంగారం' విజయం సాధించడంతో అభిమానులు, సెలబ్రిటీలు సమంతకు విషెస్ తెలుపుతున్నారు. తాజాగా నటి నయనతార ఈ చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. 'సామ్ నీ విషయంలో ఎంతో హ్యాపీగా ఉంది. ఈ విజయానికి నువ్వు అర్హురాలివి' అని పోస్ట్ పెట్టారు. దీనికి సమంత స్పందిస్తూ 'డార్లింగ్ నయన్' అంటూ హార్ట్ ఎమోజీలను జోడించారు.

## విజయ్ మాల్యా పాత్రలో అర్జున్ రామ్ పాల్

మన దేశంలోని బ్యాంకులకు దాదాపు రూ.9 వేల కోట్ల మేర రుణాల ఎగవేత కేసులో నిందితుడిగా ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా పాత్రలో ప్రముఖ బాలీవుడ్ నటుడు అర్జున్ రామ్పాల్ నటించబోతున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. 'బిలియనీర్' పేరుతో రూపొందనున్న వెబ్ సిరీస్ లో ఆయన విజయ్ మాల్యాగా కనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి.

తాజాగా ఈ వెబ్ సిరీస్ నిర్మాత ప్రభ్ లీన్ సంధు దీనిపై స్పష్టతనిచ్చారు. 'బిలియనీర్'లో విజయ్ మాల్యా పాత్ర లేదని, అయితే ఆయన జీవితం ఆధారంగా ఓ పాత్రను తీర్చిదిద్దినట్లు ఆమె చెప్పారు. అందులో అర్జున్ రామ్ పాల్ నటిస్తారని స్పష్టం చేశారు. 'దురంధర్'లో తన నటనతో ప్రేక్షకులను విశేషంగా అలరించిన అర్జున్ రామ్పాల్ తో కలసి పనిచేసేందుకు తాము ఆసక్తితో ఎదురుచూస్తున్నట్లు ప్రభ్ లీన్ చెప్పారు. ఈ సిరీస్ కు హన్సల్ మెహతా, రాబీ గ్రేవాల్ దర్శకత్వం వహించనున్నారు.





Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.